# || ప్రజానాయకుడు ప్రకాశం ||

(నాటకము)

రచన

శ్రీ మొదలి నాగభూషణ శర్మ

Copyright చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథములను ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత(త్రి) లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను. ఇందులో "అనుమతి పత్రము" నమూనా కూడా జత పరచడమైనది.

రసరంజని రంగస్థల గ్రంథాలయము

భాగ్యనగరము * తెలంగాణ * భారతదేశము

# ॥ మనవి ॥

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో గల వివిధ - పద్య, గద్య - నాటకములు, నాటికలు, రంగస్థల గ్రంథములు - ప్రస్తుతం లభ్యములు, అలభ్యములు అయినవి - DTP చేయబడుచున్నవి. అట్లే వివిధ రచయిత(త్రి)ల, ముద్రణాలయముల అనుమతి తీసుకొనక పోయిననూ ఇప్పటికి లభ్యమైన, అలభ్యమైన నాటక గ్రంథములు సేకరించి, ఆ గ్రంథములలో అక్షరములు అస్పష్టతగా ఉండుట వలన, స్పష్టత కొఱకు, అక్షర దోషములు లేకుండ DTP చేసి, PDF లు గా మార్చబడుచున్నవి.

ఈ ప్రయోగము కేవలం తెలుగు నాటక సమాజముల వారికి, నాటక దర్శకులకు, నటీనటులకు, నాటక ప్రియులకు, ఇతర గ్రంథాలయములకు, ముద్రణాలయముల ఉపయోగార్థము చేయబడుచున్నవి.

ఈ DTP చేయబడిన నాటక గ్రంథముల ప్రతులు మాత్రమే A4 సైజు లో "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో పొందవచ్చును. ఇవి PDFలు గా మాత్రమే ఇవ్వబడును. ఈ DTP చేయబడిన నాటక/నాటిక/రంగస్థల గ్రంథములు వ్యాపార దృక్పథంతో చేయుచున్నవి కాదు.

అట్లే ప్రతి గ్రంథము పై "Copyright" చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథమును ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత(త్రి) లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను. ఇందులో "అనుమతి పత్రము" నమూనా కూడా జత పరచడమైనది అని తెలుపుట గమనించగలరు.

ఇది "రసరంజని రంగస్థల గ్రంథాలయము" సంస్థ చేయు తెలుగు రంగస్థల సేవగా రచయిత(త్రి)లు, ముద్రణాలయములు భావించ ప్రార్థన.


రచనల సేకరణ కొనసాగుతున్నది. రచయిత(త్రు)లు తమ విలువయిన రచనలను, సేకరణలను ఫోటో కాపీ రూపములోనయినా సరే మా "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు అందించి సహకరించ ప్రార్థన.

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు సాదరంగాను, అభిమానంతోనూ, తమ వద్ద నున్న నాటక గ్రంథముల ప్రతులను అందించి మమ్ము ప్రోత్సహిస్తున్న, మహానుభావులకు మా హృదయపూర్వక ధన్యవాదములు !

రసరంజని రంగస్థల గ్రంథాలయము.

# ప్రజానాయకుడు ప్రకాశం

నాటకం




మొదలి నాగభూషణ శర్మ

# ప్రజానాయకుడు ప్రకాశం

(ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి ఆత్మచరిత్ర
"నా జీవితయాత్ర" ఆధారంగా వ్రాయబడిన నాటకం)

రచన

**మొదలి నాగభూషణ శర్మ**

ప్రచురణ

**రసరంజని, హైదరాబాద్.**

© రచయిత, 2000

ప్రచురణ : డిసెంబరు, 2000

కాపీలు : 1000

ధర : రూ. 30/-

ముఖచిత్రం : చంద్ర

ముద్రణ : **శ్రీ బాలాజీ ప్రింటింగ్ ప్రెస్**
చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020
ఫోన్ : 7638326

ఈ పుస్తకం దొరికే చోట్లు :

1. **రసరంజని**
ఆంధ్రసారస్వత పరిషత్తు
బొగ్గులకుంట, హైదరాబాద్ - 500 001

2. **రసరంజని**
24, భాస్కర్ అపార్ట్‌మెంట్స్
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

3. **రచయిత**
1-18/2, సరస్వతీ నగర్,
ఉప్పల్, హైదరాబాద్ - 500 039.

4. **విశాలాంధ్ర ప్రచురణాలయం**
విజ్ఞానభవన్, బాంక్‌స్ట్రీట్,
హైదరాబాద్ - 500 001.

# అంకితం

జాతీయతని స్కూలు పాఠాలతో రంగరించి
గోరుముద్దలు తినిపించిన మొదటి గురువు, గాంధేయవాది;
కొన్నివేలమందికి విద్యాభిక్ష పెట్టిన ప్రాతఃస్మరణీయుడు;
నాటకరంగంమీద తొలి అడుగులు వేయించిన నిర్దేశకుడు ;
జీవితాంతం అత్యంత ఆప్తుడు, స్నేహితుడు

మానాన్నగారు

కీర్తిశేషులు **శ్రీ మొదలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ** గారికి

తన పిల్లలూ, పరాయిపిల్లలూ అనే వ్యత్యాసం లేక
వందలాది మంది విద్యార్థులకు మూడు పూటలా కడుపారతినిపించి
వాళ్లకడుపులు నిండితే తన మొహమంతా వెలుగులు నింపుకున్న

మా అమ్మ గారు

**శ్రీమతి మొదలి కామేశ్వరమ్మ** గారికి

వినమ్రంగా
ఈ నాటకం అంకితం

# కృతజ్ఞతలు

ఈ నాటక రచనకు ఆంతర ప్రేరణ ప్రకాశంగారి జీవితం; బాహ్య ప్రేరణ ప్రకాశం గారి "నా జీవితయాత్ర", దానికి తెన్నేటి విశ్వనాధం గారి అనుబంధం. నాటకంలో ఉపయోగించుకున్న పద్యాలు గడియారం వెంకటశేషశాస్త్రి, గుర్రం జాషువా గార్లవి. ఉద్యమగేయాలు గరిమెళ్ల సత్యనారాయణ, మంగిపూడి పురుషోత్తమరావు, బసవరాజు అప్పారావు, కొండపల్లి జగన్నాధదాసు, దామరాజు పుండరీకాక్షుడు, శిష్ట్లా ఉమామహేశ్వరరావు గార్లవి.

ప్రకాశంగారి మీదవచ్చిన అనేక గ్రంథాలు, వ్యాసాలు, సంచికలు -- ముఖ్యంగా శతజయంతి సంచిక – నాకు కావలసిన జీవిత వివరాలనిచ్చాయి... ఎందరో ప్రకాశం గారి సన్నిహితులు నాకు ఉద్వేగస్ఫూర్తినిచ్చారు.

ఈ నాటకాన్ని తమ యింటిబిడ్డలా దాని ఆలనా పాలనా చూసుకున్నారు రసరంజని పాలకవర్గం – హెచ్.జె. దొర, కె.వి. రమణ, జె.వి. సోమయాజులు, చాట్ల శ్రీరాములు, సోమేశ్వరరావు గార్లు – ముఖ్యంగా మా గరిమెళ్ల రామ్మూర్తి. ఈ బిడ్డతో పాటు కేరింతలు కొట్టారు, ఆడారు పాడారు మానట బృందం అంతా. ఆడించారు, పాడించారు మా సాంకేతిక బృందం.

ఉరూరా ఎందరో ప్రేక్షకమిత్రులు యీ ప్రదర్శనను చూడడం గొప్ప అనుభవం అన్నారు. కొందరు మిత్రులు మార్పులు చేర్పులూ చేయించారు. మరికొందరు "ఇది ఇట్లా ఉండకూడదు; అట్లా వుండాలి' అంటూ హితవు చెప్పారు. వీళ్లందరికీ నా సవినయ నమస్కారాలు. ముఖచిత్రం గీసిన ఆప్తుడు చంద్రకు నమస్సులు.

నేను రాసిన ఏ రచనకైనా ప్రథమశ్రోత మా ఆవిడ సరస్వతి. నా శరీరం బాగోగులతోపాటు నా రచనల బాగోగులకు కూడా ఆవిడ మొదటి వైద్యుడు. నా రాత కోతలకు అనువుగా సకలసౌకర్యాలు సమకూర్చే అబ్బాయిలు శరత్, ఆనంద్‌లు – కోడళ్లు – రాధిక, కళ. మనమలు ప్రణవ్, ప్రణీత్, కార్తిక్, అఖిల్.

వీళ్లందరికి నా హార్దికమైన శుభాశీస్సులు.

ఈ నాటక విజయానికి చేదోడువాదోడుగా నిలిచిన మాన్యులందరికీ నమస్సులు.

# నాటకాన్ని గురించి

ఒక ప్రముఖ సమకాలీన రాజకీయ నాయకుణ్ణి గురించి నాటకం రాయడం–అందులోనూ జీవితాంతం ప్రత్యర్థులతో నిరంతర సంఘర్షణల్ని కొనసాగించిన ప్రకాశం పంతులుగారి మీద నాటకం రాయడం – అసిధారా వ్రతమే !

ఒక పేదవాడు స్వయంకృషితో, ఆత్మీయతే ఆలంబనంగా పట్టుదలను పణంగా పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగడం ఎలా సాధ్యమో ప్రకాశంగారి జీవితం విస్పష్టం చేస్తుంది. అటువంటి సాధారణ వ్యక్తి జీవిక కోసం పెనుగులాడుతూనే ఉన్నతిని సాధించగలగడం, ఆ సాధనలో ఎందరో వ్యక్తుల ఆదరాభిమానాలను పొందడం, వాటిని జీవితాంతం మనసులో దాచుకుని, వారి యెడ తన కృతజ్ఞతను ప్రతినిత్యమూ చెల్లించడానికి ఉద్యుక్తుడు కావడమూ – ఇవి అన్నీ ప్రకాశం జీవితం మనకు చూపుతుంది. తల్లీ – కొడుకుల, గురువూ – శిష్యుల అన్యోన్య, ఆదర్శ సంబంధాలకు ప్రకాశం జీవితం ఒక మహత్తరమైన నిదర్శనం. ఈ విలువల విలువను ఈ తరం జనానికి చెప్పాలన్న ఆతృత యీ నాటకం రాయడానికి మొదటి కారణం.

తన సర్వస్వాన్ని దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం త్యాగం చేసిన మనీషి ఆయన. ఆత్యాగానికి – వెనక ముందు ఆలోచించడం లేదు... పెళ్లాం బిడ్డల మాట తలపోయడం ఎరగడు... ఒంగోలు, రాజమండ్రి, మద్రాసుల్లో పెద్ద పెద్ద ఇళ్లు, ఊటీలో బంగళా, నెలకు ఏడెనిమిదివేలు సంపాదించే న్యాయవాద వృత్తి – ఇన్నింటినీ తృటిలో వదిలిపెట్టిన మనిషాయన... ఈ త్యాగానికి ఆయన వెలకట్టలేదు; దాన్ని గురించి తరువాత తరువాత గొప్పలూ చెప్పుకోలేదు...

అటువంటి మహామహుల త్యాగనిరతివల్లే ఇవ్వాళ మనం యీ పాటి స్వాంతంత్ర్యాన్నయినా అనుభవిస్తున్నాం. ఆ కృతజ్ఞతే నన్ను యీ నాటకం రాయించింది. అది రెండో కారణం.

'ఆంధ్రకేసరి' అన్నది ప్రకాశం సార్థక నామం. తుపాకి గుళ్లకు ఎదురొడ్డిన మొండి సాహసం ఆయనది. తాను నమ్మిన సిద్ధాంతాలకోసం గొప్పవాళ్లను కూడా సరకుచెయ్యని మొండి (మంచి) పట్టుదల ఆయనది. ఏభయ్ఏళ్లపాటు ప్రజలతో

మమేకం అయిపోయి ప్రజలే ప్రకాశం, ప్రకాశమే ప్రజలు అనిపించుకోగలిగిన త్యాగమూర్తికి నివాళి యీ నాటకం.

రాజకీయాలు స్వార్థపూరితాలై, పెడమార్గాన పడుతున్న రోజుల్లో నైతిక, నిస్వార్థ రాజకీయాల కోసం తపించిన వ్యక్తి ప్రకాశంగారు. సిద్ధాంతాలను నిలుపుకోవడం కోసం పదవుల్ని కాలదన్నిన ధీరుడాయన. ఇవాళ్టి రాజకీయ సంఘటనల్ని - ఒక్క రాజకీయాలేకాదు - భారతీయ జన జీవనంలో ఏ భాగాన్ని తరచి చూచినా - స్వార్థ రాజకీయాలు - వాటికి అవసరమైన కుమ్మక్కులు, కుతంత్రాలు మనకు ప్రత్యక్షం అవుతున్నాయి. కాని వీటన్నిటికీ పునాదులు స్వాతంత్ర్యం రాకముందు నుంచే భారతదేశంలో వేళ్లూనుకున్నాయని ప్రకాశం జీవిత చరిత్ర చదివితే మనకు అవగతం అవుతుంది. అవాంఛనీయ, అనైతిక శక్తుల ప్రాబల్యం ప్రకాశంగారు సాగించిన జీవిత సమరంలో మనకు ప్రత్యక్షం అవుతుంది. నిస్వార్థ రాజకీయాలకు ప్రతీక అయిన ప్రకాశంగారి మీద నాటకం రాయలని నాకు బలంగా అనిపించడానికి మరో కారణం స్వార్థ రాజకీయ శక్తులు క్రమంగా అన్ని రంగాలలోనూ బలీయం అయి, సామాన్య మానవుడి వ్యక్తిత్వాన్ని నిర్వీర్యం చెయ్యడమే ! అందువల్ల ఈ నాటకం ఆధునిక రాజకీయ నాటకంగా ఉద్దేశించబడ్డ చారిత్రక నేపథ్యం ఉన్న జీవితనాటకం.

అంతేకాదు. తెలుగువాడి ఆత్మ స్థైర్యానికి, పట్టుదలకు, ప్రేమించే ఆర్ద్రమైన మనసుకు, హఠిస్తే ఎవ్వరినీ లెక్క చెయ్యని తనానికి - ఒక్క మాటలో చెప్పాలంటే - అసలుసిసలైన తెలుగుతనానికి బలీయమైన ప్రతీక ప్రకాశంగారి జీవితం.

ఈ నాటకం రాయడానికి - చాలా రోజులుగా నాలో జరుగుతున్న అంతర్మథనం మరొకటి కూడా కారణం. తెలుగువాళ్లు జాతీయ స్థాయిలో - ఏ ఒక్కరంగంలోనూ - నాయకత్వాన్ని సాధించ లేకపోవడానికి గల కారణాలు ప్రకాశం సుదీర్ఘ రాజకీయ జీవితంలో అంతస్సూత్రంగా ఉన్నాయనిపిస్తుంది నాకు. ఆ కారణాలను విశ్లేషించుకొని, ఆపరిస్థితులను అధిగమించి అత్యుత్తమస్థాయిలో గుర్తింపుపొందగల అవకాశాలను సృష్టించుకోవడం ఇప్పటికైనా అవసరం అంటూ తెలుగువారికి సమర్పించుకొనే వినతి పత్రం యీ నాటకం.

ప్రకాశం గారి ఆత్మచరిత్రలో కనిపించే చాలామంది చారిత్రక వ్యక్తుల్ని యీ నాటకంలోనూ ప్రవేశపెట్టాను. వారిని ఇందులో పాత్రల్ని చేసి, ప్రఖ్యాతి చెందిన మరికొందరి సరసన వారిని చేర్చి చరిత్రకు అద్దం పట్టే నేపథ్యాన్ని సృష్టించాను. ఇందులోని పాత్రలు మూడు తరగతులకు చెందినవారు. కొందరు ప్రసిద్ధులయిన చారిత్రక పురుషులు. మరికొందరు నామ మాత్రంగా తెలిసి యీ చరిత్రలో భాగస్వాములయినవారు, మరికొందరు ఇందులో యిమడగల వ్యక్తిత్వం ఉన్నవారు. వీరి సమాహార రూపమే యీ నాటక పాత్రల చరిత్ర.

ఈ చారిత్రక స్పృహను కలగచేయడంలో కొందరు ప్రముఖుల్ని పాత్రలుగా ఎన్నుకున్నా, వారి పాక్షిక చిత్రణమే ఇందులో కనిపిస్తుంది. ఈ ప్రఖ్యాత రాజకీయ నాయకుల ప్రమేయం యీ నాటకంలోను, ప్రకాశం జీవితంలోను ఏయే సంఘర్షణాత్మక సంఘటనల్లో ఉందో వాటిని మాత్రమే ఎంచుకుని ఆ సంఘటనల పూర్వాపరాలను సృష్టించుకొని వాటిని నాటకీకరించాను. కేవలం నా నాటక అవసరాలకు మాత్రమే అలా చేయవలసి వచ్చిందనీ, ప్రకాశంగారి మీద నాటకం రాస్తే – ఆయనే ఆసాంతమూ ముఖ్యపాత్ర ధరిస్తాడు కనుక – మిగిలిన అనేక పాత్రల పాక్షిక చిత్రణం అనివార్యమనీ పాఠకులు గమనించగలరనుకుంటాను. అలా పాక్షిక చిత్రణ చేయవలసివచ్చిన రాజకీయనాయకులంటే నాకుకూడా భక్తి, శ్రద్ధలున్నాయని మాత్రమే నేను ఇక్కడ చెప్పవలసిన విషయం.

ఇటువంటి రాజకీయ నాటకాలలో పాత్రల్ని చిత్రించేటప్పుడు మరొక విమర్శ వచ్చే ఆవకాశం ఉంది. నిత్యజీవితంలో మనకు తెలిసిన వ్యక్తులు, యీ నాటకంలో చిత్రింపబడిన వ్యక్తులు ఒకరుగా ఊహించడం కొంచెం కష్టమే!.... పట్టాభి, రాజాజీలను గురించి బాగా తెలిసినవాళ్లు – వారు అంత బహిరంగంగా సంఘర్షణలకి దిగి పోట్లాడే రకం మనుషులు కారు – అంటారు... నిజమే! కాని నాటకంలో ఇద్దరు వ్యక్తుల మధ్య సంఘర్షణ లేదా రెండు విభిన్న ప్రవృత్తుల మధ్య సంఘర్షణను, రెండు భావాల మధ్య ఉన్న సంఘర్షణను నాటకీకరించేటప్పుడు యీ విధమైన పాత్రల ప్రవృత్తిని. అంతరంగాన్ని, దృక్పథాన్ని బట్టి ఒక్కొక్కప్పుడు వారిచేత సన్నివేశాలకు అనువుగా మాట్లాడించక తప్పదు. ఇది నాటకావసరం.

అలానే మరికొన్ని పాత్రల్ని నిత్య జీవితంలో ఎరిగివున్న వారు – "అయ్యో! వీళ్లు నిజ జీవితంలో యిట్లా లేరు; యిట్లా మాట్లాడలేదు" అని పెదవివిరిచి "యీ పాత్రల్ని మార్చాలి – మరొకర్ని వాళ్లకి ప్రత్యామ్నాయంగా ఉంచాలి" అని చాలా బలంగా, ఆవేశపూరితంగా భావించడానికి అవకాశం ఉంది. ఉదాహరణకి – కంచుమర్తి రామచంద్రరావుగారిని ఈనాటకానికి ఒక కథకునిగా ఎన్నుకొన్నాను. ఆయన గొప్పజమీందారు. ఒక మిత్రుడన్నట్లు 'అసూర్యంపశ్య'. ఆయనను మిగిలిన వాళ్లు 'ఏరా, ఒరే!' అనడం మనకు నచ్చదనుకోండి. అది చారిత్రకనేపథ్యం దృష్ట్యా సంభావ్యమా కాదా అని చూడాలి కాని, నూటికి నూరుపాళ్లు ఇలానే జరిగిందా అనే ప్రశ్న ఉదయించకూడదు. నాటకంలో possibility కన్నా probabilityకే పెద్దపీటవేస్తారు విమర్శకులు.

అలాగే నాటకావసరాల కోసం చాలా సన్నివేశాలను నేను సృష్టించుకొన్నాను. వాటి బీజాలు మాత్రం 'నా జీవిత యాత్ర'లోనే ఉన్నాయి. ప్రకాశం గారి చివరి రోజుల్లో సూర్యకుమారి ఆయన్ని చూడ్డానికి వచ్చిందా? – అని ప్రశ్నించే వాళ్లకి సమాధానం – "రాలేదు, నేనే రప్పించాను" అని. ప్రకాశంగారు ప్రత్యర్థులతో విభేదించిన అన్ని అంశాలను ఆయన ఆత్మచరిత్ర నుంచే గ్రహించాను. అయితే నేను చేసిందల్లా ఆ సంఘర్షణల్ని నాటక సంఘర్షణాలుగా మలచడానికి వీలుగా వేరువేరు ప్రదేశాల్లో, వేరువేరు కాలాల్లో జరిగిన సన్నివేశాల్ని ఏకీకృతం చేయడమే! ఇది చారిత్రక నాటకాల సన్నివేశ రూపకల్పనలో సర్వే సర్వత్రా పాటించే పద్ధతే! అందుకే ఇది చారిత్రక నేపథ్యంలో, చారిత్రక పాత్రలు పాల్గొనే ఒక జీవిత చిత్రణ. ఇది చారిత్రక నాటకం, డాక్యుమెంటరీ నాటకం కాదు.

కొందరు మిత్రులు దీనిని డాక్యుమెంటరీ నాటకం అని ముందుగానే తమకు తాముగా ధృవీకరించుకుని. డాక్యుమెంటరీ నాటకంలో లాగా "ఆ పాత్రలు, సన్నివేశాలు అట్లా లేవే!" అని సందేహించారు. వారందరికీ చెప్పవలసింది ఒక్కటే: ఇది డాక్యుమెంటరీ డ్రామాకాదు. చారిత్రక నాటకం. డాక్యుమెంటరీ డ్రామాలో సంఘటనల్ని యథాతథంగా చిత్రీకరిస్తాం. పాత్రల ప్రతిచర్యా మనకు అవగతం అయి, ఆ పాత్రల అస్తిత్వం మన అనుభవాలకు లోబడి వుండాలి. చారిత్రక నాటకంలో పాత్రల. సంఘటనల మూలాలు చరిత్ర నుంచి గ్రహించినవే! కాని 'చారిత్రకత'

చెడిపోకుండా, అది ఇనుమడించేలా ఆ సన్నివేశాల రూపకల్పన చేయడం చారిత్రక నాటకావసరం. చారిత్రక నాటకంలో ఆయావ్యక్తుల మనస్తత్వాలను ఆయా సంఘర్షణలు రూపుకడుతున్నాయా లేదా అన్న విచక్షణ ముఖ్యం. ఆ నియమిత నేపథ్యంలో ఇలానే జరిగివుండాలి – అని ప్రతి సన్నివేశాన్ని గురించి పాఠకులు అనుకోవాలి.

ఈ చారిత్రక స్పృహ – దీనిని 'చారిత్రకత' (Historicity) అందాం. ప్రతిబింబించే విధంగా రాసిన "ఎపిక్ ప్లే" (కావ్య నాటకం) ఇది. "ఎపిక్ ప్లే" లో అంతర్లీనంగా ఉండే లక్షణాలు ఇందులో చాలా ఉన్నాయి. నాటకం సంఘటనాత్మకం. అంతస్సూత్రంగా ఉండే వ్యక్తి చరిత్రను క్రమానుసారంగా ప్రతి సన్నివేశంలోను చిత్రించడం (ఎపిసోడిక్) దీనికి మూల లక్షణం. ఆ సంఘటనల మీద రచయిత వ్యాఖ్యానాన్ని కథనం ద్వారా చెప్పడం, తద్వారా చారిత్రక పరిణామాల్ని దృశ్యమానం చేస్తూనే ఆధునిక జీవితం మీద అవగాహనను కలగ చేయడం, చరిత్రను వ్యాఖ్యానిస్తూ ప్రేక్షకుల, పాఠకుల దృష్టిని మౌలిక జీవన సత్యాల వైపుకు మళ్లించడం వంటి అంశాలను అవసరమైనంత మేరకు ఈ నాటకంలో వాడుకోవడం జరిగింది. కథనం, పాటలు, పద్యాలు, ప్రొజెక్షన్స్ వంటివి కేవలం కథను సుగమం చేయడానికే కాక, సన్నివేశాల మీద వ్యాఖ్యలు చెయ్యడానికి కూడా ఉపయోగించడం జరిగింది. అందువల్ల నాటకంలోని సంఘటనలు ఎంత ముఖ్యమైనవో, కథనం కూడా అంతముఖ్యమైనదే – నా దృష్టిలో.

ఈ నాటకం రాయడానికి ఆంధ్రదేశంలో జాతీయోద్యమంమీద, ప్రకాశంగారిమీద వచ్చిన దాదాపు అన్ని రచనలూ చదివాను. ఆయన జీవితాన్ని దగ్గరగా గమనించిన వారిని కలిశాను. ఆయన జీవిత సంఘటనలను ఇతిహాసాలుగా చెప్పుకొనేవారి పులకింతలు చూశాను. వారి వారి అనుభవాలు, అనుభూతులు ప్రాయికంగా నన్ను ప్రభావితం చేశాయి. వారందరికీ కృతజ్ఞతలు.

నాటక రచన ఒక ఎత్తు. దానిని ప్రదర్శించడం మరొక ఎత్తు. 45 మంది నటీనటులతో, 15 మంది సాంకేతిక బృందంతో ఆంధ్రదేశంలో చాలా పట్టణాలలోను, ఢిల్లీలోను యీ నాటకాన్ని దిగ్విజయంగా ప్రదర్శించింది రసరంజని. ఈ విజయం వెనుక ఎందరో వ్యక్తులున్నారు. తెరవెనుక నిరంతరం వెన్నుతట్టి నిలబడ్డ రసరంజని

సూత్రధారులున్నారు. సాంకేతిక నిపుణులున్నారు. తెర ముందు నటీనట బృందం ఉంది. వీరిలో ప్రతి ఒక్కరూ యీ నాటక విజయానికి దోహదం చేశారు. నాటక పూర్వాభ్యాసాల సమయంలోను, ప్రదర్శనల సమయాల్లోను మా నట, సాంకేతిక బృందంలోని ప్రతిఒక్కరిలోనూ కనిపించిన ఆత్మీయ, ఏక కౌటుంబిక భావం నన్ను వాళ్ళయెడ మరీ కృతజ్ఞుణ్ణి చేసింది.

ఆంధ్రదేశం గర్వించదగ్గ ఒక మహామహుడి జీవితాన్ని నాటకంగా రాయగలగడం, దాన్ని నలుమూలలా ప్రదర్శించే వీలుకలగడం ఒకగొప్ప జీవితానుభవంగా భావిస్తాను.

అందుకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

**నాగభూషణ శర్మ**

# నట బృందం

(రెండు సంవత్సరాల సుదీర్ఘ ప్రదర్శన యాత్రలో చాలా మంది నటులు కొత్తగా రావడం జరిగింది. ఇప్పుడు నటిస్తున్న వారితో పాటు ఇదివరకు నటించిన నట బృందం వివరాలు)

| | | |
|---|---|---|
| కథకుడు I | : | **మొదలి నాగభూషణ శర్మ** |
| కథకుడు II | : | **బి.పి. ప్రసాద్, జి.వి. సుబ్రహ్మణ్యం, గుంటూరుశాస్త్రి** |
| ప్రకాశం III | : | **చాట్ల శ్రీరాములు** |
| పిళ్లారిసెట్టి నారాయణరావు<br>టి.వి. రాఘవరావు | : | **బి.నారాయణ** |
| ఆత్మకూరి గోవిందాచార్యులు<br>బారిస్టర్ స్వామినాధన్ | : | **యం. ఫ్రాన్సిస్** |
| తల్లి (సుబ్బమ్మ) | : | **బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి** |
| శ్రీరాములు 1 | : | **కుమారి ఆర్. ప్రతిమ** |
| ప్రకాశం 1 | : | **శ్రీమతి హేమమానస** |
| ఇమ్మానేని హనుమంతరావు నాయుడు | : | **దుగ్గిరాల సోమేశ్వరరావు** |
| లక్ష్మమ్మ | : | **బి.హెచ్. కళ్యాణి** |
| రామయ్య | : | **సి. నారాయణస్వామి, బి. వి. రమణ** |
| అయినాల తాతయ్యా నాయుడు | : | **కె.వి. శాస్త్రి** |
| చిలకమర్తి లక్ష్మీనరసింహం<br>కడప కోటిరెడ్డి | : | **క్రమధాటి వెంకటేశ్వర శర్మ** |
| ప్రకాశం II | : | **నడిమింటి జగ్గారావు** |
| శ్రీరాములు II | : | **నటరాజ్, పింగళి గంగాధర్‌రావు** |
| కంచుమర్తి రామచంద్రరావు | : | **తులసీ బాలకృష్ణ, భాగి శివశంకర శాస్త్రి** |
| వార్తాహరుడు / సుబ్బరామయ్య | : | **మల్లాది కుటుంబశర్మ** |
| వెంకటరమణరావు | : | **వై. మల్లికార్జున్, హనుమంతరావు** |
| జానకిరామయ్య | : | **చంద్రకాంత్, ఆర్. జనార్దన్** |
| డాక్టర్ | : | **యస్. మోహన్** |

| | | |
|---|---|---|
| కన్నింగ్ హామ్ | : | వై. అనిల్ కుమార్ |
| పటాలే | : | కె.బి.ఆర్. కృష్ణంరాజు |
| జడ్జి దేవిస్ | : | తులసీబాలకృష్ణ, రమేష్ |
| తెన్నేటి విశ్వనాధం | : | బి. ఆనంద్‌మోహన్, వి.యస్. ప్రకాశరావు |
| సాగి విజయరామరాజు | : | పుండరీకాక్షశర్మ, జి.బి. రామకృష్ణశాస్త్రి |
| కొండా వెంకటప్పయ్య | : | యం. ఆంజనేయులు |
| కామరాజనాదార్ | : | బి. రఘునందన్, టి.వి. సత్యనారాయణ |
| వి.వి.గిరి | : | గరిమెళ్ళ రామమూర్తి |
| రాజాజీ | : | ముట్నూరి కామేశ్వరరావు |
| యన్.జి.రంగా | : | సి. నారాయణస్వామి, ఎన్.ఎల్. నరసింగరావు |
| సూర్యకుమారి | : | సురభి శ్యామల |
| పట్టాభి | : | జి.బి. రామకృష్ణశాస్త్రి, గోపరాజు రమణ |

ఉద్యమ కార్యకర్తలు : **యస్.మోహన్,** కృష్ణంరాజు, మల్లికార్జున్, కుటుంబశర్మ, వేణుగోపాల్, రమేష్, కృష్ణ, బి.ఎల్.మూర్తి, నటరాజ్ రహంతుల్లా, సాకేత్‌రామ్, షారయ్య

పోలీసులు : కీర్తన్, రత్నశేఖర్ రెడ్డి, మహేష్, మహేంద్రకుమార్, రమేష్ కుమార్

## సాంకేతిక బృందం

| | | |
|---|---|---|
| లైటింగ్ | : | జాలీ పుత్తుసరి, సురభి నాగేంద్ర ప్రసాద్ |
| ఆడియో | : | మధు |
| మేకప్ | : | హరిశ్చంద్ర, గోపాలస్వామి |
| పద్యసంగీత సహకారం | : | బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి |
| పద్యగానం | : | క్రమధాటి వెంకటేశ్వర శర్మ |
| గేయగానం, నిర్వహణ | : | యస్. మోహన్ |
| సెట్స్ | : | సురభి పూర్ణచంద్రరావు |
| స్టేజ్‌మేనేజర్ | : | పుండరి. హనుమంతరావు |
| సహాయకులు | : | కీర్తన్, నటరాజ్, మల్లికార్జున్ |
| సహాయ దర్శకుడు | : | బి.పి. ప్రసాద్ |

ప్రయోగ నిర్వహణ : గరిమెళ్ళ రామమూర్తి

**రచన, దర్శకత్వం : మొదలి నాగభూషణ శర్మ**

# పత్రికాభిప్రాయాలు

"ప్రజలే ప్రకాశం ప్రకాశమే ప్రజలు అని నినదించిన ప్రకాశం గారు ఆ నినాదం స్వోత్కర్షకాదనీ, అక్షరసత్యం అనీ నిరూపించే ఘట్టాలతో ఈ నాటకం అడుగడుగునా ఉత్కంఠ భరితంగా సాగింది".

**ఆంధ్రప్రభ, హైదరాబాద్, ఆగస్టు 24, 1999**

నేటి అవకాశవాద, అవినీతి రాజకీయాలకు ఈ నాటకప్రదర్శన ఒక గొడ్డలిపెట్టు.... నేటి రాజకీయ ప్రముఖులకు ఈ నాటకం ఒక కనువిప్పు. సామాన్య ప్రేక్షకులకు స్ఫూర్తి, ఉత్తేజాలను మనసునిండా పంచుతుంది. కళ్ళ నీళ్ళు పెట్టిస్తుంది.

**ప్రజాశక్తి, హైదరాబాద్. ఆగస్టు 26, 1999**

రంగస్థల నాటకకళలో నిష్ణాతులైన శ్రీ మొదలి నాగభూషణ శర్మ దర్శకత్వంలో పరిపూర్ణ నాటకీయతతో ఈ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకొంది.

**విశాలాంధ్ర, సెప్టెంబర్ 8, 1999**

*The director succeeded in projecting various angles of Prakasam's personality, as the man who lived for the country and died for it.... All the sequences were movingly presented.*

The Hindu, September 3, 1999

నేటి యువతకు స్ఫూర్తి "ప్రజానాయకుడు ప్రకాశం" నాటకం.

సంఖ్యాబలమే తప్ప నైతిక విలువలకు చోటు లేని నేటి రాజకీయాలను విమర్శిస్తూ, ప్రజాసేవను చిత్తశుద్ధితో చేయడానికి రాజకీయాలలోకి వచ్చే యువతకు స్ఫూర్తినిచ్చిన నాటకం "ప్రజానాయకుడు ప్రకాశం".

**ఆంధ్రప్రభ, విజయవాడ, ఆగస్టు 13,2000**

రసరంజని సమర్పణలో ఈ అపూర్వ నాటక ప్రదర్శనను యాభై మంది కళాకారులు, పదిహేను మంది సాంకేతిక నిపుణులతో అద్భుతంగా ప్రదర్శించారు.... తెలుగువారందరికి ఎక్కడైనా ఒక మంచి గుర్తింపు తీసుకువచ్చేలా ఈ ప్రదర్శనను

రూపకల్పన చేయడంలో మొదలి నాగభూషణ శర్మ విజయం సాధించారని పలువురు నాటకాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

**ఆంధ్రజ్యోతి, హైదరాబాద్, ఆగస్టు 17, 2000**

"ప్రజానాయకుడు ప్రకాశం" పేరున ప్రకాశం జీవిత గాధను నాటకీకరించి రంగ స్థలంపై ప్రదర్శించి నాటకం అనే దానికి నిర్వచనం చెప్పారు రసరంజని కళాకారులు . . . . నాటక రచన దర్శకత్వం జాతీయస్థాయి ప్రమాణాలు కలిగి ఉన్నాయనడంలో సందేహం లేదు.

**ఆంధ్రభూమి. హైదరాబాద్, ఆగస్టు 17, 2000**

"ప్రజలే ప్రకాశం - ప్రకాశమే ప్రజలు" అన్న టంగుటూరి మాటలకు అక్షరాలా దృశ్యరూపం ఇచ్చింది ఈ నాటకం.

స్వరాజ్య పోరాటకాలంలో తెలుగునేల నలుచెరగులా గుండె గుండెలో ప్రతిధ్వనించిన ఆనాటి దేశ భక్తి గీతాలు, పద్యాలు, ఈ నాటకంలో పొందుపరచడం విశేషం.

**ఆంధ్రప్రభ, విశాఖపట్టణం, అక్టోబర్ 23, 2000**

నటీనటుల ప్రతిభా పాటవాలు హావభావాలు నాటకాన్ని చివరివరకు ఆహూతులను కదలనీయకుండా చేశాయి. సాంకేతిక పరంగా కూడా ఈ నాటకం రక్తికట్టడం విశేషం.

**ఆంధ్రజ్యోతి, విశాఖపట్టణం, అక్టోబర్ 23, 2000**

తెలుగులో మంచి నాటకాలు రావడంలేదనేది నేడు సర్వేసర్వత్రా విన వచ్చే విమర్శ. అయితే ఇటీవల కళాభారతిలో ప్రదర్శించిన "ప్రజానాయకుడు ప్రకాశం" దీనికి మినహాయింపుగా చెప్పవచ్చు. ప్రజలే ప్రకాశం - ప్రకాశమే ప్రజలుగా సాగిపోయిన ఆంధ్రకేసరి జీవితాన్ని నాటకీకరించిన తీరు అభినందనీయం.

**ఆంధ్రప్రభ, విశాఖసిటీ . అక్టోబర్ 23, 2000**

త్యాగనిరతికి నిలువుటద్దం 'ప్రజానాయకుడు ప్రకాశం'

**ఆంధ్రజ్యోతి, విజయవాడ, ఆగస్టు 13, 2000**

అయిదు దశాబ్దాలు తెలుగువారి జీవితాలతో పెనవేసుకుపోయి మమేకమయిపోయిన ప్రకాశం జీవితాన్ని కళ్ళముందు నిలిపిన 'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకం రాజమహేంద్రిపుర ప్రజలను తన్మయత్వం చెందేలా చేసింది.... ఈ నాటక రచయిత, దర్శకుడు అయిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఆంధ్రకేసరి ప్రకాశం నాటకాన్ని రక్తికట్టించడంలో సఫలమయ్యారు.

**ఈనాడు, రాజమండ్రి, అక్టోబర్ 22, 2000**

ప్రతి సన్నివేశాన్ని ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దడంలో రచయిత కృషి ప్రశంశనీయం.... సమష్టి కృషితో ఎంతో పకడ్బందీగా నాటకాన్ని నడిపిన రసరంజని బృందం అభినందనీయం.

**ఈనాడు, విజయవాడ, ఆగస్టు 13, 2000**

అరవై మంది నటీనట సాంకేతిక నిపుణులను ఒకతాటిమీదకి తెచ్చి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితగాథను నాటకంగా మలిచి మెప్పించిన రచయిత, దర్శకుడు మొదలి నాగభూషణ శర్మ ధన్యులు. భావి తరాలకు నాటి జీవన విధానం మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, గురుశిష్యుల అన్యోన్యత వారి ఆత్మబంధుత్వం, దృశ్య పరికల్పన ద్వారా ఆవిష్కరించిన తీరు అమోఘం.

**వార్త, విశాఖపట్టణం, అక్టోబర్ 23, 2000**

***An exemplary play.***

*A well - presented biographical play "Prajanayakudu Prakasam" took theatre buffs here by storm. In a breathtaking performance by the artistes of Rasaranjani of Hyderabad, the play movingly vivified the tumultuous life of Andrakesari Tanguturi Prakasam Pantulu from childhood till his death in 1957.*


The New Indian Express, Vizag, Nov 3, 2000

నభూతో నభవిష్యతిగా జరిగిన ప్రదర్శన

**ఆంధ్రభూమి, హైదరాబాద్, ఆగస్టు 17, 2000**

*Memorable and moving performance.... an acme of design in play production.*

The Hindu. Nov 3, 2000



## ఆచార్య మొదలి నాగభూషణ శర్మ

1935లో జన్మించి, 1960లో అధ్యాపకవృత్తిలో ప్రవేశించిన మొదలి నాగభూషణ శర్మ నాటక రచయిత, దర్శకుడు, నటుడు, విమర్శకుడు, అనువాదకుడు, అధ్యాపకుడు. నలభై సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విశ్వవిద్యాలయాలలోని ఆంగ్లశాఖలోను, నాటక శాఖలలోను ఆచార్యులుగా పనిచేశారు. ఉస్మానియా, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎకడమిక్‌గా డీన్‌గా ఉన్నారు. అనేక భారత విశ్వవిద్యాలయాల లోను, జాతీయ, అంతర్జాతీయ నాటక, జానపద సంస్థలలోను సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

చిన్నతనంలో తండ్రిగారి నేతృత్వంలో నాటక రంగ ప్రవేశం చేసి కాలేజీ రోజుల్లో కన్యాశుల్కంలో మధురవాణిగా ప్రసిద్ధికెక్కారు. నలభై సంవత్సరాలుగా నాటక రచనలోను, దర్శకత్వంలోను సరికొత్త ప్రయోగాలను చేశారు. **విషాదాంతం, జంటపక్షులు, అడ్డదారి, మన్మధుడు మళ్ళీ పుట్టాడు, దొరా! నీసావు మూడింది, కాయితంపులి** వంటి ప్రయోగ నాటకాలకు తెలుగులో ఆద్యులైనారు. ప్రఖ్యాత సంస్కృత, ఆధునిక భారతీయ, పాశ్చాత్య నాటకాలు - **మృచ్ఛకటిక, ముద్రారాక్షసం, భగవదజ్జుకీయం, రాజా ఈడిపస్, మాక్‌బెత్, ఎంపరర్ జోన్స్, వెయిటింగ్ ఫర్ గోడో** వంటి నాటకాలను తానే అనువదించుకొని రంగస్థలంమీద ప్రయోగించారు. 20 ఇంగ్లీషు నాటకాలకు, 50 తెలుగునాటకాలకు దర్శకత్వం వహించారు.

నాటక విమర్శకుడుగా ఇంగ్లీషులోను, తెలుగులోను ముప్ఫయ్ పుస్తకాలను, వందకన్న ఎక్కువ వ్యాసాలను ప్రచురించారు. ప్రపంచ నాటక చరిత్రమీద – ముఖ్యంగా ఆంధ్ర, భారతీయ నాటక చరిత్రల అధ్యయన విశ్లేషణాల్లో అధికారికమైన అవగాహనను పెంపొందించుకున్నారు. **నూరేళ్ల తెలుగు నాటకరంగం, ఆచార్య ఆత్రేయ, కన్యాశుల్కం : నూరేళ్ల సమాలోచనం, బళ్లారిరాఘవ, తెలుగు నవలా వికాసం, తెలుగు సాహిత్యం : గాంధీజీ ప్రభావం, నాటక కర్త చిలకమర్తి** వంటి గ్రంథాలు వారి విమర్శనా పటిమను వెల్లడిస్తాయి. జానపద ప్రదర్శక కళారూపాలను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. ఆంధ్రదేశం నలుమూలలా దిగ్విజయంగా ప్రదర్శిస్తున్న **"ప్రజానాయకుడు ప్రకాశం"** వీరి ఇటీవలి రచన, ప్రయోగం.

నిత్యవిద్యార్థి, అధ్యాపకులకు అధ్యాపకుడు, నిరంతర నాటకాభ్యుదయ కాంక్షి.

## ॥ అనుమతి పత్రము ॥

తేదీ : ............................

ఈ "ప్రజానాయకుడు ప్రకాశం" నాటకము ను ప్రదర్శించుటకు

M/s ......................................................................................................

(సమాజము పేరు)

నాటక సమాజము వారు మా అనుమతి కొరకు మమ్ము సంప్రదించుటచే, ఈ నాటికను వారు అత్యంత శ్రద్ధతో ప్రదర్శించెదరని ఆశిస్తూ, మా అనుమతిని లిఖిత పూర్వకము గా నిస్తున్నాము. వారి ప్రదర్శన దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నాము.

ఇట్లు

మొదలి నాగభూషణ శర్మ

రచయిత

రచయిత చిరునామా :

............................................

.........................................

............................................

............................................

# ప్రజానాయకుడు ప్రకాశం

(ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి ఆత్మచరిత్ర
"నా జీవితయాత్ర" ఆధారంగా వ్రాయబడిన నాటకం)

రచన

**మొదలి నాగభూషణ శర్మ**

ప్రచురణ

**రసరంజని, హైదరాబాద్.**

## || వందేమాతరం ||

రచన

### శ్రీ బంకించంద్ర ఛటోపాధ్యాయ్

వందేమాతరం - వందేమాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలాం

సస్యశ్యామలాం మాతరం

వందేమాతరం - వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం

పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం

సుహాసినీం సుమధుర భాషిణీం

సుఖదాం వరదాం మాతరం

వందేమాతరం - వందేమాతరం

కోటికోటి కంఠ కలకల నినాదకరాలే

కోటికోటి భుజైర్ ధృత కర కరవాలే

అబలా కేయనో మా ఏతో బలే

బాహుబల ధారిణీం నమామి తారిణీం

రిపుదలవారిణీం మాతరం

వందేమాతరం - వందేమాతరం

తిమి విద్యా తిమి ధర్మ తుమి హృది తుమి మర్మ

త్వం హి ప్రాణాః శరీరే

బాహుతే తుమి మా శక్తి హృదయే తుమి మా భక్తి

తో మారయ ప్రతిమా గడి మందిరే మందిరే

వందేమాతరం - వందేమాతరం

త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ

కమలా కమలదళ విహారిణీ

వాణీ విద్యాదాయినీ

నమామి త్వాం

నమామి కమలాం అమలాం అతులాం

సుజలాం సుఫలాం మాతరం

వందేమాతరం - వందేమాతరం

శ్యామలాం సరళాం

సుస్మితాం భూషితాం

ధరణీం భరణీం మాతరం

వందేమాతరం - వందేమాతరం

## || ప్రార్థన ||

శుక్లాంబరధరం విష్ణుం - శశివర్ణం చతుర్భుజం |
ప్రసన్న వదనం ధ్యాయేత్ - సర్వవిఘ్నోపశాన్తయే ||

అగజానన పద్మార్కం - గజానన మహర్నిశం |
అనేకదంతం భక్తానాం - ఏకదన్త ముపాస్మహే ||

సరస్వతీ నమస్తుభ్యం - వరదే కామరూపిణీ |
విద్యారంభం కరిష్యామి - సిద్ధిర్భవతుమే సదా ||

జ్ఞానానంద మయం దేవం – నిర్మల స్ఫటికా కృతిం |
ఆధారం సర్వ విద్యానాం - హయగ్రీవ ముపాస్మహే ||

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః - గురుర్దేవో మహేశ్వరః |
గురుస్సాక్షా త్పరబ్రహ్మ - తస్మై శ్రీ గురవేనమః ||

ఆంగికం భువనం యస్య - వాచికం సర్వ వాఙ్మయం |
ఆహార్యం చంద్ర తారాది - తం వందే సాత్వికం శివం ||

(పై ప్రార్థనా శ్లోకాలతో పాటు మీ తల్లిదండ్రులను, ఇష్ట దైవాన్ని, ఇలవేల్పునీ స్మరించుకొనవలెను)

# ॥ ప్రార్థన ॥

రచన

## శ్రీ చందాల కేశవదాసు

కళ్యాణి రాగము - ధ్రుపద తాళము

పరబ్రహ్మ - పరమేశ్వర - పురుషోత్తమ సదానంద
పరంజ్యోతి - పరాత్పర - పతిత పావన - స్వప్రకాశ

పరబ్రహ్మ - పరమేశ్వర - పురుషోత్తమ సదానంద
పరంజ్యోతి - పరాత్పర - పతిత పావన - స్వప్రకాశ

వరదాయక సకలలోక - వంచిత సుఖదా ప్రమేయ
వరదాయక సకలలోక - వంచిత సుఖదా ప్రమేయ

పాహి - పాహి - మాంపాహి
పాహి - పాహి - మాంపాహి

పరబ్రహ్మ - పరమేశ్వర - పురుషోత్తమ సదానంద
పరంజ్యోతి - పరాత్పర - పతిత పావన - స్వప్రకాశ

# పూర్వరంగం

## కథనం

(ఇద్దరు కథకులు : కంచుమర్తి రామచంద్రరావు, సారంగు భీమశంకరం.)

**కథకుడు 1**

సోదరీ సోదరులకు సాదర నమస్కారం.

**కథకుడు 2**

నమస్కారం.

**కథకుడు 1**

ఇవాళ ఈ రంగ స్థలం ఒక మనిషి జీవితాన్ని
మన ముందు ఆవిష్కరిస్తుంది.

**కథకుడు 2**

ఒక మామూలు మనిషి మహామనీషి కావడం
ఈ జీవిత చరిత్ర సారాంశం.

**కథకుడు 1**

ఒక పనిచేస్తే ఇందువల్ల మనకెంత లాభం
అనుకునే రోజుల్లో
తన సర్వస్వాన్ని ప్రజల కోసం,
ప్రజాస్వామ్య సాధనకోసం
వెచ్చించిన త్యాగధనుడి చరిత్ర.

**కథకుడు 2**

ఈ చరిత్ర వెనక ధైర్యం, ఆత్మస్థైర్యం
పరిశ్రమ, పట్టుదల తెలుగుతనాన్ని
నిలబెట్టే తెగువతనం.
ఎవరెంత భయపెట్టినా,
మభ్యపెట్టినా చెదరని లక్ష్యం.
రాజకీయ చాణక్యం తెలియని అమాయకత్వం.

**కథకుడు 1**

ఎంత ఎదిగినా ఎన్ని పదవులు పట్టం కట్టినా
ఎన్ని కీర్తి కిరీటాలు తొడిగినా
తన మామూలు తనాన్ని మరిచిపోని సామాన్యత్వం.

**కథకుడు 2**

ఒక మహామనీషి మామూలు మనిషిగా బతకడం
ఈ జీవిత చరిత్ర సారాంశం.

**కథకుడు 1**

ఆ మనిషి టంగుటూరి ప్రకాశం .....

**కథకుడు 2**

టంగుటూరి ప్రకాశం...

**కథకుడు 1**

(వెళ్లబోతూ ఆగి) అన్నట్లు –
నా పేరు కంచుమర్తి రామచంద్రరావు
మా వాడి పేరు –

**కథకుడు 2**

సారంగు భీమశంకరం.
మా నివాసం రాజమహేంద్రవరం.

**కథకుడు 1**

ప్రకాశం చిన్ననాటి స్నేహితులం.

రాముడూ, భీముడూ అని మమ్మల్ని

మన్నన చేసేవాడు ప్రకాశం.

**కథకుడు 2**

'ఒరే' అని పిలిపించుకున్న తొలినాటి మిత్రులం.

మేము తనని 'ఒరే' అని పిలవకపోతే

కోపం తెచ్చుకునేటంత జీవికా జీవులం.

**కథకుడు 1**

మేం చూసిన, విన్న, ప్రకాశం కథ యిది.

**కథకుడు 2**

ప్రజానాయకుడు ప్రకాశం కథ.

(నిష్క్రమిస్తారు)

★ ★ ★

# పూర్వరంగం

**మద్రాసు, 1921**

(ప్రకాశం పంతులుగారి బంగళా...)

ఒక్కసారిగా బయట కోలాహలం... బోలో స్వతంత్ర భారత్ కీ జై,

మహాత్మా గాంధీకి జై, ప్రకాశం గారికీ జై... అని నినాదాలు...

ఈ నినాదాల మధ్య ప్రకాశం వస్తాడు....

మెళ్లో దండలు... వెంట పిళ్లారి సెట్టి నారాయణరావు, ఆత్మకూరి గోవిందాచార్యులు... ప్రకాశం వాకిట్లో ఉన్న జనానికి చేతులు వూపి లోపలకు వస్తాడు... చేతులో ఉన్న లాయరు గౌనును కుర్చీమీదకు విసిరేసి)

**ప్రకాశం**

గుడ్ బై మై ఫ్రెండ్, గుడ్ బై .... ఇరవై అయిదేళ్ల మన అనుబంధం నేటితో సరి – గుడ్ బై...

(చుట్టూ ఉన్న వాళ్ల ఆతృతని గమనించినా, తాపీగా)

ఇవాళ్టి నుంచీ నా బారిస్టర్ వృత్తిని వదిలేశాను.

**నారా**

(అసంతృప్తిగా) లాయరు వృత్తిలో వుండి... అర్థాంతరంగా యిటువంటి నిర్ణయాలు తీసుకుంటే (ప్రకాశం అతని వంక సీరియస్‌గా చూశాడు)... అదే ! ఎంతకష్టమో ఆలోచించండి.

**ప్రకాశం**

నారాయణరావు! సంవత్సరం క్రితమే ఈ పని చెయ్యవలసింది – లాలా లజపతిరాయ్, మోతిలాల్ నెహ్రూలు ప్లీడరీలు వదులుకున్నప్పుడే... ఏమిటో ఊగిసలాట. డబ్బుకన్నా,

మనల్ని నమ్మి మన చేతులో కేసులు పెట్టిన వాళ్లంటే సానుభూతి... మళ్లీ గౌను... కోర్టు... వాదనలు... జడ్జిమెంట్లు ! .... ఇవాళ ఈ కేసులో నేనే లాయర్ని... నేనే జడ్జీని కూడా..

**నారా**

కాని ఇన్ని కేసులు చేతినిండా వున్నాయి. నెలకి ఏడెనిమిదివేల ఆదాయం. ఇవన్నీ వదులుకుని, నేనిహ ప్రాక్టీసు చెయ్యను అంటే –

**ప్రకాశం**

(నవ్వి) చూడు, నారాయణరావు ! ఒక పని చేద్దామనుకున్న తరువాత దాని వెనుకముందులు, లాభ నష్టాలు బేరీజు వేసుకోవడం ప్రకాశం పద్ధతి కాదు. ఇప్పుడూ అంతే ! ఇహ కేసులంటావా?.. ఇప్పుడు మనిద్దరం కలిసి ప్రాక్టీసు చేస్తున్నాం కదా! ఇహనుంచి నా ప్రాక్టీసంతా నీది... మన ఇద్దరికీ గురువుగారు నాయుడుగారు. ఆయన చెయ్య మన్న పని ఒకటి నేను చేస్తున్నాను. రెండోది నువ్వు చెయ్యి. సరేనా?

**నారా**

అదేమిటి? నాయుడుగారు –

(వాకిట్లో కోలాహలం ఎక్కువైంది.... గోవిందాచార్యులు బయటకు వెళ్లిచూచి, గబగబా లోపలకు వచ్చి) SLOGANS

**గోవిందాచార్లు**

పంతులు గారూ ! వాకిట్లో జనం వెళ్లేటట్లు లేరు.. మీరు వచ్చి వాళ్లకో రెండు ముక్కలు చెప్పక తప్పదు..

**ప్రకాశం**

గోవిందాచార్లూ ! నేను చేతలవాడినే కాని, మాటల వాణ్ణి కాదోయ్ !

**గోవిం**

నిజమే ననుకోండి ! కాని, మద్రాసు నగరంలో ఇంతమంది లాయర్లున్నారు.. ఇంత పలుకుబడీ రాబడీ ఉన్న మీరొక్కరే మీ వృత్తిని వదిలి మిగిలిన వాళ్లందరికీ మార్గదర్శకం అయ్యారు... తలుచుకుంటే నాకే ఒళ్లు పులకరిస్తోంది...

"యద్యతా చరతి శ్రేష్ఠః తత్తదేవేతరో చరః"

**ప్రకాశం**

ఆ, ఆం !

ఇహ సంస్కృత శ్లోకాలు చెప్పెయ్యకు... (మిగిలిన వాళ్లతో) మా ఆత్మకూరి గోవిందాచార్యులు పెద్ద సంస్కృత పండితుడు..

**గోవిం**

శ్లోకం కాదండి.... వాల్మీకి అన్న శోక కావ్యం ఇది.. మీటింగ్ కి వెళ్లేటప్పుడు మహారాజు లాగా ఫోర్డు కారులో ప్రయాణం.. తిరిగి వచ్చేటప్పుడు కాలినడకన... సర్వస్వమూ త్యాగం చేసిన బుద్ధ భగవానుడిలా -

**ప్రకాశం**

(నవ్వి) నేనంత సన్యాసిని కాలేనోయ్... ఆయన జనం ఆధ్యాత్మిక సంపద కోసం తపిస్తే, నా తపన అంతా పర ప్రభుత్వ పీడన తప్పి, మన ప్రజలు స్వేచ్ఛా వాయువులు ఎప్పుడు పీలుస్తారా అని - అందుకోసం మనం ఏం చెయ్యాలా అని -

('ప్రకాశంగారికీ జై... ప్రకాశంగారికీ జై...' అని నినాదాలు) SLOGANS

**ప్రకాశం**

(వాకిట్లోకి వెడతాడు.. జనం చప్పట్లు) మిత్రులారా ! ఇవాళ నేను ఎంతో ధనాన్ని, కీర్తిని ఆర్జించిపెట్టిన యీ వృత్తిని ఏ సంకోచమూ లేకుండా వదిలిపెట్టాను. నాగపూరులోను, మొన్న మొన్న బెజవాడలోను కాంగ్రెసు యిచ్చిన పిలుపు - త్రివిధ బహిష్కరం - చెయ్యమని. విద్యార్థుల్ని గుమస్తాలని చేసే ఈపరదేశం చదువుల్ని, ఉపాధ్యాయులు అటువంటి ఉద్యోగాల్ని, లాయర్లు తమ వృత్తిని వదులుకోవాలి అని గాంధీగారు పిలుపు నిచ్చారు. అందుకే యీ వృత్తిని వదిలాను. జాతీయ విద్యను నేర్పడానికి జాతీయ విద్యాలయాన్ని ప్రారంభించమన్నారు ఆయన... ఆ ఆదేశం మేరకు నా జన్మ స్థలం ఒంగోలులో నా స్వంతడబ్బుతో ఒక జాతీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్నాను.

(బోలో స్వతంత్రభారత్‌కు జై, మహాత్మాగాంధీకి జై

ప్రకాశం పంతులుగారికీ జై.....)

**ప్రకాశం**

(మెల్లగా లోపలకు వస్తూ) శ్రీరాములు ! రేపు బయలుదేరి ఒంగోలు వెళ్లు.. అక్కడ మన స్నేహితుడు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యం ఉన్నాడు.. మనలాగే లాయరు. జాతీయ భావాలున్నవాడు. మాష్టరు కావాలనుకుని లాయరైనాడు. అతన్ని కలిసి... ఆ జాతీయ విద్యాలయానికి అధ్యక్షుడుగా ఉండాలని చెప్పు... ఆఁ ! అన్నట్టు అక్కడ మన యిల్లువుందిగా ! దాన్ని ఆ విద్యాలయానికి యిచ్చెయ్...

**శ్రీరాములు**

(తల ఊపుతాడు...) అట్లాగే !

**ప్రకాశం**

నారాయణరావ్ ! నాయుడుగారు పోయిన రోజు నీకు జ్ఞాపకం వుందికదూ! ఆ రాత్రి ఆయన "నిటలాక్షుండిపుడెత్తి వచ్చినను రానీ" అన్న పద్యాన్ని ఎన్నిసార్లు పాడించుకున్నారో నా చేత ! పాడించుకున్న తరువాత – "ఈ గయుణ్ణి రక్షించు పంతులూ" అంటూ మగతలోకి పోయారు. ఇంతలో తెలివొచ్చింది... నన్ను పిలిచి, నా ఒళ్లో పడుకుని గయోపాఖ్యా నంలో తనకిష్టమైన పద్యం –

తన దేహము, తన గేహము
తన కాలము, తన ధనంబు తన విద్య జగ
జ్జనములకై వినియోగిం
చిన నరుడే నరుడు వాడె చెందును దివముల్ ॥

అంటూ నా రెండు చెక్కిళ్లూ నిమిరి ఆశీర్వదించారు... నిటలాక్షుండన్న పద్యం నా ప్రవృత్తి కెంత తగిన పద్యమో – యీ పద్యం నాయుడిగారి జీవితానికంత సంకేతం. ఆయన తన సర్వస్వాన్ని మనలాంటి వాళ్లకోసం వినియోగించారు. ఆ రాత్రి నా చేతుల్లో ఆయన ఒదిగిపోయిన క్షణాన్నే అనుకున్నాను –

ఈ దేహం, ఈ గేహం, ఈ ధనం – నా దేశ జనులకోసం వినియోగించాలని... ఇది నాయుడు మాస్టారికి నా కృతజ్ఞతాంజలి. (మాస్టరుగారి ఫోటోకు నమస్కరిస్తాడు.)

అట్లాగే. అమ్మ పోతూ పోతూ 800 రూ॥ యిచ్చింది. ఆ డబ్బు మొదటి పెట్టుబడిగా దేశ స్వాతంత్ర్యం కోసం ఓ పత్రిక పెడతాను.. అలా 'ఈ జీవితం పరుల సేవ కోసంరా' అని చెప్పిన ఆ యిద్దరి రుణం తీర్చుకుంటాను.

## 8

**నారా**

ప్రకాశంగారూ ! లాయరు కావడం మీ జీవిత లక్ష్యం ! దాని కోసం నాయుడుగారు, అమ్మ, అందరూ ఎంత కష్ట పడ్డారో మీకు జ్ఞాపకం లేదూ ? అటువంటిది–

**ప్రకాశం**

నేను కూడా లాయర్ని కావాలనే కలలుకన్నాను. లాయరు వృత్తి స్వేచ్ఛావృత్తి అని నమ్మాను... అమ్మ నన్ను లాయరుగా చూడాలని ఎంత తపించేదో ! దాని కోసం నాయుడుగారూ, మీరందరూ పడ్డ కష్టాలు... (గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ) ఆ రోజులు – ఆ కష్టాలు, ఆ కన్నీళ్లు; ఆ ఆశలూ, ఆ అనుభవాలు....

(క్రమంగా లైట్లు డిమ్ అవుతాయి)

★ ★ ★

# ఒకటో దృశ్యం

## కథనం

**కథకుడు 1**

కాలం అనాది. అది నిరంతర వాహిని.

**కథకుడు 2**

మానవ జీవన వాహినిలో గతం
నది పుట్టిన చోట ఊరే నీటి బుగ్గ వంటిది.

**కథకుడు 1**

నిండుగా ప్రవహించే ఈనాటి మహానదం
దారిలో కలుస్తూ వస్తున్న
వేయివేల సెలయేళ్ల కలయిక.

**కథకుడు 2**

ఆప్యాయామృతాన్ని అందించే అమ్మ –

**కథకుడు 1**

జాతీయతని నిజాయితీతో రంగరించి ఇచ్చే గురువు.

**కథకుడు 2**

హితులూ, సన్నిహితులూ –
అందరి సహకారంతో
ముళ్లబాటను రాచబాటగా మార్చుకుంటాడు
దృఢ మనస్కుడు.

**కథకుడు 1**

న్యాయవాద వృత్తిని వదిలేవరకు ప్రకాశం జీవితం

ఈ ప్రభావాంబుధ రాసుల సమ్మిశ్రణం.

★ ★ ★

**ఒంగోలు, 1884**

(రంగస్థలం మీద వివిధ ప్రదేశాలను చిన్న చిన్న వస్తువుల ద్వారా సూచిస్తూ విభిన్న అంతరాలు.. ప్రస్ఫుటంగా కనిపించేవి రెండు ప్రదేశాలు... ఒక పక్క పూటకూళ్ల ఇల్లు.వెనకగా ఒక తలుపు. దానిమీద గోడకు "బ్రాహ్మణ భోజనశాల" అని బోర్డు... దాని పక్కగా వరండా అరుగు. దాని మీద ఒక బెంచీ -

మరో ప్రదేశం నాయుడుగారి యింటి ముందు గది - పాతమంచం, రెండు కొయ్య కుర్చీలు... పెళ్లినాడు నాయుడుగారు వాళ్లావిడ తీయించుకున్న ఫోటో... మరోపక్క స్కూలు... మునిసిపల్ మిషనరీ స్కూలు అని బోర్డు. వీటికి దూరంగా 'మునసబు కోర్టు' అనీ, దాని కింద Munsif Court అని రాసి వుంటుంది... పూటకూళ్లయిల్లు. ఇంటి ముందు ప్రకాశం తల్లి సుబ్బమ్మగారు తెల్లవారు ఝామున కళ్లాపి చల్లుతూ మేలు కొలుపులు పాడుకుంటోంది.. రాగానే తూర్పు వైపుకు తిరిగి నమస్కరిస్తూ, స్వప్రోక్షణం చేసుకుని)

ఆది దేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే ॥
తం సూర్యం జగతానాధం జ్ఞాన ప్రాకాశ్య మోక్షదమ్
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

(పాడుతూనే లోపలికి పోయి బొక్కెనతో నీళ్లుతెచ్చి, కళ్లాపి చల్లుతూ)

కేశవయని నిన్ను వాసిగ భక్తులు వర్ణించుచున్నారు లేరా
వాసవ వందిత వసుదేవనందన వైకుంఠ పురవాస లేరా
కృష్ణా, తెలవార వచ్చెనూ ॥

మాధవయని నిన్ను మానవులందరు మన్నింపుచున్నారు లేరా
మందర గిరిధర మణిభూషణాధార మందార ధారుడ లేరా ॥

కృష్ణా, తెలవార వచ్చెనూ ॥

(లోపల ఏదో చప్పుడు)

ఒరేయ్ ! శ్రీరాములూ !... ('ఆ' అని లోపల్నుంచి సమాధానం)

అన్నయ్యని కూడాలేపు....

(ముగ్గు తీసుకు వచ్చి వేస్తూ)

తెల్లవార వచ్చె ప్రాగ్దిశ యందున భాను డల్లదె లేచె - మేలుకో -
కల్లగాదు దిక్కులెల్ల ప్రకాశించె ముల్లోకనాథుడ - మేలుకో -

(లోపలికి పిలుస్తూ)

ఒరేయ్ ప్రకాశం ! దేవుళ్లందరికీ మేలుకొలుపులయినాయి.... ఇహ నీకు కూడా పాడాలా? ఒరేయ్ శ్రీరాములూ ! ఆ వెధవాయిని గూడా లేపు.... బిగ్గరగా లేపేవు ! తమ్ముడు జానకి రాముడు నిద్రపోతున్నాడు... లేస్తే ఒక్కపనీ చేసుకోనివ్వడు.

**శ్రీరాములు**

(నిద్రలేచి, మొహం కడుక్కుని తుడుచుకుంటూ వస్తాడు...) అమ్మా ! మరేమోనే ... మరేమోనే... అన్నయ్య -

**తల్లి**

ఏమిట్రా నాన్చుతావ్ ! ... అన్నయ్య - ఏమైంది?

**శ్రీరాములు**

మరేమోనే.... అన్నయ్య... లేడు....

**తల్లి**

లేడు ! ... పొద్దున్నే పెత్తనాలా దొరగారికి? పొద్దున్నే ఎక్కడి కెళ్లాడురా !! మళ్లా కొంప మీదికేం తెస్తాడో !

**శ్రీరాములు**

అదేం లేదమ్మా ! మరేమోనే - అన్నయ్య -

**తల్లి**

(దగ్గరగా వెళ్ళి, ఉరుముతూ చూసి) అన్నయ్య ఏం చేశాడు? చెబుతావా లేదా? (అని చెవి పుచ్చుకుంటుంది)

**శ్రీరాములు**

(ఏడుపు లంకించుకుని) అన్నయ్య రాత్రసలు యింటికే రాలేదే!

**తల్లి**

ఆ మాట చెప్పి ఏడవ్వేం? (అని ఒకటి తగిలిస్తుంది).. ఈ బాధలు నేను పడలేనమ్మా ! ఆ మహారాజు - ఆయన దోవన ఆయన పోయినారు- నా నెత్తిన యీ జంఝాటం పెట్టి... రాత్రంతా యింటికి రాకుండా యీయన వెలగబెడుతున్న రాచకార్యాలేమిటట? ... పుట్టినప్పట్నుంచీ యీ వరసన ఏడిపిస్తున్నాడు ! - ఇవ్వాళ ఇంటికి రానీ, చెబుతాను (అంటూ దడ దడ లోపలికి వెడుతుంది.)

(రెండో వైపు నుంచి ప్రకాశం వస్తాడు. 12 ఏళ్ల వయసు... భారీ పిల్లాడు... అభిన్యుడి వేషంలో ఉన్నాడు. నక్కుతూ, జంకుతూ వస్తాడు... శ్రీరాములు ... అన్నయ్యని చూసి)

**శ్రీరాములు**

అమ్మో ! అన్నయ్య -

(ప్రకాశం త్వరగా వచ్చి తమ్ముడి నోరు మూస్తాడు, చెప్పొద్దంటూ.. ఇద్దరూ మెల్లగా మాట్లాడుకుంటారు)

**ప్రకాశం**

అమ్మ ఎక్కడుంది?

**శ్రీరాములు**

ఇప్పుడే లోపలికి వెళ్ళింది.

**ప్రకాశం**

బాగా కోపంగా వుందా?

**శ్రీరాములు**

అమ్మో ! కనిపిస్తే నంచుకు తింటుంది.

**ప్రకాశం**

(తేలిగ్గా తీసిపారేస్తూ) ఆఁ ! ప్చ్ ! ....

(తల్లి వస్తున్న చప్పుడు ...లోపల పాడుకుంటూ వస్తుంది. ప్రకాశం "అమ్మో! అమ్మ" అనుకుంటూ తడికపక్కన దాక్కుంటాడు)

**తల్లి**

(పిండిన చీరెల్ని, పిల్లల బట్టల్ని ఒక బొక్కెనలో వేసి ఆర వెయ్యడానికి తీసుకువస్తుంది. ఆ బుజంమీద, యీ బుజం మీద కూడా బట్టలున్నాయి ... వస్తూనే) పెద్దవాడవుతున్నాడు. చేతికి అంది వస్తాడని గంపెడంత ఆశతో నెట్టుకొస్తున్నాను... నాకు సాయం చెయ్యడం పోయింది, ఏ నిమిషాన ఇంటి మీదకి ఏం తగాదా తెస్తాడోనని భయమే గదా !

(బట్టలు ఆరవేస్తూవుండగా ప్రకాశం తల్లికి కనిపించకుండా మెల్లగా వచ్చి తల్లి వెనకాల దాక్కుంటాడు. శ్రీరాములు నవ్వే ప్రయత్నం చేశాడు. ప్రకాశం ఉరిమి చూడ్డంతో నవ్వుదాచుకుంటాడు.)

ఇరవై నాలుగు గంటలు వెధవ సావాసాలే కదా ! ఆ పంతుళ్లు కూడా వీడికి ఝుడిసి మార్కులు వేస్తున్నారేమో?

**శ్రీరాములు**

(విడిచిన బట్టలు అందిస్తూ) ఏమీకాదు... మరేమోనే... అన్నయ్య బాగా చదువుతాడని వాళ్ల క్లాసు పిల్లలంతా చెబుతారే !

**తల్లి**

బాగా చదివేవాడయితే నాకీ అవస్థేం నాయనా? ఏదో మీ నాన్నగారు - వీళ్లని ఇంగ్లీషు చదువుల్లో పెట్టాలే... లేకపోతే బతుకు తెరువు లేదు-అనేవారు. అందుకే అన్న వమ్ముకుంటూ మీకు చదువులు చెప్పిస్తున్నాను.... నాకీ చెర నుంచి విముక్తి ఎప్పుడో?

(శ్రీరాములు చేతిలో విడిచిన బట్టలున్నాయి.. వాటిని తీసుకుందామని పక్కకు తిరిగితే శ్రీరాములు ఎక్కడో చూస్తూ ఒక చేత్తో నోరు మూసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు.)

**తల్లి**

ఏమిట్రా ఆ ముసి ముసి నవ్వులు? మీకంతేలే ! పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటం... నువ్వు గూడా మీ అన్నయ్యలాగే తయారైతే నేనే నుయ్యో గొయ్యో చూసు కోవాలి... వీడికి బుద్ధెప్పుడొచ్చేనో?... వెధవ ! ఏమనడాని కైనా కనిపిస్తేనా? (బట్టలు ఆరేయడం అయింది).. ఇహ పదరా !... ఆ వెధవ కడుపుచేత్తో పట్టుకువస్తాడు... రాత్రేమయినా కతికాడో లేదో...

(శ్రీరాములు వెనక్కి తిరిగి వుండడంతో అటువైపు చూస్తుంది.. ఆరేసిన బట్టల వెనక నీడ.. బట్టల్ని సరిచెయ్యడానికని వెళ్లి ప్రకాశం చెవి పట్టుకుని బయటకు లాగుతుంది.)

**తల్లి**

వెధవా ! రాత్రంతా - (ప్రకాశం ఇవతలికి వచ్చాడు. వాడి వేషం చూసి నిర్ఘాంత పోతుంది.)

ఈ వేషమేమిట్రా ?

**ప్రకాశం**

అమ్మా ! రాత్రి -

**శ్రీరాములు**

నాటకం వేశాడే అన్నయ్య!

**తల్లి**

నువ్వయినా చెప్పలేదు. వెధవా ! మీరిద్దరూ తోడు దొంగలే!... ఇహ నాకు చేతకాదురా, నాయనా ! ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను...

**ప్రకాశం**

అది కాదే అమ్మా ! నిన్న మార్కులు చెప్పారుగా ! ... నాకే అందరికన్న ఎక్కువ మార్కులు !.. హెడ్ మాస్టరు గారేమో - ప్రకాశం ! ఇవ్వాళ నువ్వు నాటకంలో వెయ్యాల్రా అన్నారే - ఆ నాటకం మా స్కూలు పుస్తకం లోదే ! నాకు కంఠో పాఠం....

**శ్రీరాములు**

అమ్మా ! అన్నయ్య అభిమన్యుడుగా బలే చేశాడే ! అయిపోగానే ఎట్లా చప్పట్లు కొట్టారో తెలుసా?

**తల్లి**

ఏడ్చావు లే !....

**ప్రకాశం**

నిజంగా అమ్మా !... అందుకే హెడ్ మాస్టరుగారు వాళ్లింటికి భోజనానికి పిలిచారు, మమ్మల్ని.. పొద్దు పోయిందని నేనే మన రాముడూ వాళ్లింట్లో పడుకున్నాను...

**తల్లి**

ఇహ లోపలికి పోయి ఆ పగటి వేషం తుడుచుకుని స్నానం చేసిరా... రాత్రి ఏ వేళనగా భోజనం చేశావో !

**ప్రకాశం**

నీకు చూపించాలనే ఉంచుకున్నానే ! ఇప్పుడు చెరిగిపోయింది కాని రాత్రి భలే బాగుందే ! మా మాస్టర్లంతా 'బాగా చేశావురా ప్రకాశం' –అన్నారే !

**తల్లి**

ఇవన్నీ చెయ్యడం బాగానే వుంది గానీ... ఆ ధ్యాసకాస్త చదువు మీద పెట్టరా తండ్రీ ! నీకా మెటిక్కి లేషనయిపోతే – (లోపలికి వెళ్లడానికి వెనుతిరుగుతుంది)

**ప్రకాశం**

రాత్రి మిషన్ స్కూల్లో మాస్టారట – నాయుడుగారట – బొద్దు మీసాలు ఆయనా ... 'బాగా చేశావోయ్ అబ్బీ ! ... నాతో నాటకాలు వెయ్యి, నీకు మెట్రిక్యులేషన్ దాకా నేను చదువు చెప్పిస్తాను' – అన్నాడే !

**తల్లి**

(ఆశతో తిరిగి వస్తూ) నిజంగా అట్లా అన్నాడ్రా ! పోనీలే, ఆయన కడుపు చల్లగా – అటువంటి ధర్మాత్ములుండబట్టే ప్రపంచం యింకా యిట్లా వుంది !

నేను నాటకం వేస్తున్నంతసేపూ ఆయన 'ఆహా.. భలే.. అంటూనే వున్నారే!'... నేనిట్లా బాణం ఎక్కుపెట్టి ముందుకొచ్చి - (నాటకంలో తన భాగాన్ని వినిపించడం మొదలు పెడతాడు.)

ఓరీ ! కౌరవ కులపాంశనులారా ! మగంటిమి చూపెదమని భీకర ప్రతిజ్ఞలు చేసి, నేడు భీరువులై రణ రంగము నుండి పారిపోయెదరేల?... దుర్ఘట కార్ముక సంచలన పరిభ్రమణాది వైశద్యము లెరిగిన పాండు సూతి - అభిమన్యుడు - మీ కురురాజు గర్వమణంచవచ్చినాడు... పారిపోకుడు... (నవ్వి) ఓ రాజ రాజా!

(అభిమన్యుడి నిష్క్రమణ... ఆ ప్రదేశంలో చీకటి... రెండో ప్రదేశంలో వెలుగు... అభిమన్యుడి మాటలు మంద్ర స్థాయిలో వినిపిస్తూ వుంటాయి...)

★ ★ ★

# రెండో దృశ్యం

**ఒంగోలు, 1884**

(నాయుడుగారి యిల్లు. నాయుడుగారు, ఆయన భార్య లక్ష్మమ్మ)

(అభిమన్యుడి మాటల్ని నాయుడుగారు వింటూ ఉంటారు.)

**ప్రకాశం**

ఓరీ ! కౌరవసేనాపతులారా ! అధికార ధన మదోన్మత్తులై దురభిమాన గ్రస్తుడైన రాజరాజునకు సహాయముగా వచ్చిన మీ సేన అంతయు చెల్లా చెదరైనది.... పారిపోకుడు.. నిరుపమాన సత్యదీక్షా పరతంత్రులు పాండవులను యుద్ధమున కీడ్చి యిప్పుడీ బేలతనమేమి?... రండు.. రండు...

**నాయుడు**

(మెల్లగా) ఆ కుర్రవాడి పేరేమని చెప్పాను?

**లక్ష్మమ్మ**

ఎవరి పేరు?

**నాయుడు**

అరె ! చిటికలో నాతో నేస్తం కలిపేశాడు... ఆ కొత్త నేస్తం పేరు... రాత్రి నాటకంలో వేశాడు...

**లక్ష్మమ్మ**

ప్రకాశమా?

**నాయుడు**

అతన్ని పంతులూ అని పిలిచాను... అభిమన్యుడి వేషం వేశాడు... ఓ ! దున్నేశాడనుకో ! నేను చెబుతున్నాను గదా, లక్ష్మీ! – అతనికి గొప్ప భవిష్యత్తు వుంది.

**లక్ష్మమ్మ**

నాటకాల్లోనా? చదువులోనా?

**నాయుడు**

నాటకాల్లో బాగా వేసేవాడు, చదువులో కూడా బ్రహ్మాండంగా ఉంటాడోయ్.. నన్ను చూడరాదూ !

**లక్ష్మమ్మ**

ఆఁ ! రోజూ చూస్తూనే వున్నా!... ఇంతకీ ఎవరబ్బాయెూ ఏమిటో తెలియకుండా...

**నాయుడు**

తెలుసుకొనియే వచ్చితిని బాలా ! అతడు ప్రకాశమను చిన్నవాడు – చదువులలో మేటి, ఆటలలో మేటి, నాటకములలో అతనికెవ్వరూ రారుసాటి – (నవ్వుతూ) ఇక అల్లరిలో నందువా? మేటిమేటి –

**లక్ష్మమ్మ**

అటువంటివాణ్ణి మీరు నాటకాల్లోకి దింపితే !

**నాయుడు**

మనం దింపడమేమిటోయ్ ! అతనిప్పటికే మోకాలిలోతు దిగివున్నాడు... మరి కొంచెం ముందుకు తీసుకు వెళ్లడమే మనం చెయ్యగల సాయం !

**లక్ష్మమ్మ**

(నవ్వుతూ) మీరు – ముందుకి ! ... తను దూరకంతలేదు, మెడకో డోలని–

**నాయుడు**

ఆ.... ఆ.... నవ్వినా నాపచేనే పండును – అని సామెత... పాపం! వాళ్లమ్మగారు మునసబు కోర్టు కెదురుగా పూటకూళ్లు పెడతారుట! చాలా సామాన్యమైన సంసారం. ఇదుగో లక్ష్మమ్మా ! అతన్ని మెట్రిక్యులేషన్ దాకా చదివిస్తానని యీ ఐమ్మానేని హనుమంతరావు నాయుడు మాటిచ్చేశాడోయ్!

**లక్ష్మమ్మ**

అనేశారూ అంతమాటా ! ఇంకా ఆమాట మీనోటంట రాలేదేమా అని చూస్తున్నాను.

**నాయుడు**

నువ్వు అట్లాగే అంటావుగాని, అతని అభిమన్యుడి నటనకు ఒళ్లంతా పులకరించి పోయిందనుకో... నేను అర్జునుణ్ణయి ఆ పడిపోయిన అభిమన్యుణ్ణి యుద్ధ రంగం నుంచి బయటకు తీసుకురావాలి - అన్నంత ఆరాటం !!

(అభిమన్యుడు కనుల ముందు నటిస్తూ కనిపిస్తాడు... నాయుడుగారు చూస్తూ వున్నారు.... ఇది నాయుడుగారి దృశ్యపరికల్పనం)

ఓరీ ! కౌరవాధములారా !... ముఖాముఖి యుద్ధము చేయనేరక చాటు నుండి బాణములు వేయుట ఏమిమగంటిమిరా - ఆహో, రాజరాజా ! భావి భారతదేశమున అసమర్థులయిన కీర్తి కాంక్షాపరులు తమ అధికారమును నిలుపుకొనుటకు ఏమి చేయవలయునో నీవు చూపితివి! అధర్మ యుద్ధము...

ఓహో సర్వసాక్షీ ! చూడుమీ రణధర్మచ్యుతులైన కౌరవకిరాతులను.. అయ్యో... కర్ణుడు... శల్యుడు... కృపాచార్యుడు... దుశ్శాసనుడు... తుదకు రాజరాజు...

అబ్బా.... అమ్మా ! సెలవు... ఉత్తరా ! పోయివచ్చెదను... తండ్రులారా, సెలవు... మాతృ దేశము కొరకు ప్రాణము లర్పించుటకు ఎన్ని జన్మము లెత్తవలయును?

ఎవడు స్వారాజ్యము నిమిత్త మెన్ని రక్త
బిందువులు ప్రీతి వసుధ కర్పింప గలుగు -
వాడు.... వాడు... భూలోకమున అన్ని వర్షశతము
లమరుడై యుండు... కీర్తి కాయంబుతోడ.

(హోరున చప్పట్లు... నాయుడుగారు చప్పట్లు కొట్టి కళ్ళు తుడుచుకుంటాడు)

★ ★ ★

# మూడో దృశ్యం

**ఒంగోలు, 1885**

(రామయ్యగారు - పక్కింటి ముసలాయన, సుబ్బమ్మగారు. ఆవిడ వాకిట్లో కూర్చుని విస్తళ్లు కుట్టుకుంటూ వుంది. ఆవిడ వెనక శ్రీరాములు.)

**రామయ్య**

నాకు తెలీకడుగుతాను, సుబ్బమ్మ తల్లీ! మన యిళ్లల్లో జరగాల్సిన పనులేనా ఇవి? పొద్దస్తమానం ఆ నాటకాలేమిటి? ఆ పోకిరీలతో స్నేహం ఏమిటి?... ఇహ వీడికి చదువేం అబ్బేను?

**తల్లి**

బాగానే చదువుతాడని నాయుడుగారు చెప్పారే!

**రామయ్య**

ఏం చదువుతున్నాడో యేమిటో? ఆ అడక్కి ఆదినారాయణ కొడుకు పుస్తకాలు చించినందుకు నిన్న స్కూల్లో నుంచి మన వాణ్ణి డిస్మిస్ చేశార్టగా! ఆ మేజిస్ట్రేటు సూర్యనారాయణ వెళ్లి హెడ్ మాస్టారితో చెప్పి మళ్లీ చేర్పించార్ట!

**శ్రీరాములు**

అన్నయ్యా ఊరికే చించాడాయేమిటి? ఆ సూరిగాడు ఊరికే కొడతాడమ్మా! ఎప్పుడూ పూటకూళ్లమ్మ కొడుకు, పూటకూళ్లమ్మ కొడుకు అని ఎగతాళి చేస్తాడే!

**తల్లి**

ఈ పిల్లలకి చెబుతూనే వుంటాను బాబూ, నవ్విన నాపచేనే పండుతుందిరా అని. పైగా ఆ పిల్లాడు మాత్రం ఏమన్నాడు? నేను చేస్తున్న పనేగా? కష్టపడి నీతిగా

చేసే ఏ పనీ తప్పుకాదురా, నాయనా అని చెప్పాను, పిల్లలకి. కాని పసి మనసులు. కొంచెం గాలొచ్చినా లేతాకు రెపరెపలాడిపోతుందిగా బాబు గారూ !

**రామయ్య**

ఇంతకీ వాడేడీ ? "ఇవ్వాళ వారానికి రాలేదు.. చూసిరండీ" అని మా ఆవిద అంటేనూ –

**తల్లి**

అద్దంకి వెళ్లాడు బాబూ – పరీక్షకి డబ్బు కట్టాలి.. మా అల్లుడేమన్నా సర్దుతాడేమోనని... తెల్లారుఝామున లేచి వెళ్లాడు.. పిచ్చి తండ్రి !

(వాకిట్లోనుంచి "పంతులూ" అని నాయుడుగారి కేక. ఆయన లోపలికి వచ్చాడు).

(వస్తూ) పంతులూ ! (నాయుడు శ్రీరాముల్ని చూసి) శ్రీరాములూ ! అన్నయ్య లేడా?

**తల్లి**

(లోపలికి తప్పుకుంది)

**రామయ్య**

అద్దంకి వెళ్లాట్ట –

**నాయుడు**

(తల్లితో) స్కూల్లో ఇవ్వాళ ఆరునెల్ల పరీక్షా ఫలితాలు చెప్పారండీ ! ప్రకాశం క్లాసు ఫస్టు వచ్చాడు.. స్కూల్లో చూస్తే కనిపించలేదు. చెప్పి పోదామని వచ్చాను.

**తల్లి**

(అక్కడనుంచే) మీ మేలు మరిచిపోలేం బాబూ !

**నాయుడు**

నేను చేస్తున్నదేముందమ్మా? అంత తెలివి గలవాడికి ఎవరైనా సహాయం చేస్తారు.

**తల్లి**

తన మంచితనమే ప్రపంచమంతా ఉందనుకునేవాళ్లు నిత్య ధనవంతులని చెప్పేవాడు మానాయనగారు...

**నాయుడు**

వెడతానమ్మా !... రాత్రికొకసారి కనిపించమని చెప్పండి... వస్తానండీ... (అని రామయ్యకి నమస్కారం చేసి వెళ్లిపోతాడు.)

**రామయ్య**

(ఆయన వెళ్లిన వైపే చూస్తూ) మనకీ నాటకాలకీ చుక్కెదురమ్మా.. మా ఆవిడ చూసిందట మనవాడి ఆడవేషం.. సీతా కళ్యాణంలో సీతమ్మవారుట ! చిదిమి దీపం పెట్టొచ్చునండీ.. అంటుంది మా ఆవిడ – (ప్రకాశం వస్తాడు... దిగులుగా ఉన్నాడు)

**శ్రీరాములు**

అన్నయ్యొచ్చాడమ్మా !

**తల్లి**

మా తండ్రే... ఇప్పుడే అనుకుంటున్నాం. ఇంకా రాలేదేమిటా అని... నాన్నా! అక్కా, బావా అంతా కులాసానా?

**ప్రకాశం**

(నిరుత్సాహంగా) అంతా బాగానే వున్నారమ్మా !

**తల్లి**

వెళ్లిన పని ఏం చేసుకొచ్చావ్?

**ప్రకాశం**

ప్చ్.. (తల అడ్డంగా తిప్పి లోపలికి వెళ్లబోయాడు...)

**తల్లి**

(వెడుతున్నవాడికి అడ్డంగా నిలబడి) ఒరే కన్నతండ్రీ! అంత నిరుత్సాహ పడిపోకురా... నువ్వట్లా వుంటే మీ అమ్మకి కాళ్లూ చేతులూ ఆడవు.

**ప్రకాశం**

పరీక్ష ఫీజు కట్టడానికి రేపే ఆఖరు రోజమ్మా ! 3 రూపాయలు ఎక్కడా పుట్టలేదమ్మా!... కట్టకపోతే సంవత్సరం చదువూ పోయినట్టేనమ్మా !

**తల్లి**

అట్లా పోనిస్తానుట్రా... ఇప్పుడే వస్తానుండు (అని లోపలికి పోయి ఒక గోతం సంచీ చేతులో పట్టుకుని బయటకు వచ్చి) శ్రీరాములు ! నాతో రా !

**ప్రకాశం**

ఎక్కడికమ్మా !

**తల్లి**

పనిమీద వెళ్లేటప్పుడు ఎక్కడికని అడగకూడదు. ఇప్పుడే వస్తాను, ఆగు... (తల్లి వెడుతుంది)

**రామయ్య**

ఒరే, ప్రకాశం ! అన్నట్టు, మీనాయుడు మాస్టారు వచ్చి వెళ్లారు రా.

**ప్రకాశం**

అలాగా ! ... అమ్మ పొరపాటున ఆయనకి పరీక్ష ఫీజు సంగతి –

**రామయ్య**

చెప్పలేదులే.. నీకు ఆరునెల్ల పరీక్షల్లో ఫస్టుమార్కు వచ్చిందట – చెప్పడానికి వచ్చారు.

**ప్రకాశం**

అంతా ఆయన చలవే ! ఆయన ఒక్కసారి చెబితే చాలు.

**రామయ్య**

అంత తెలివిగలవాడా?

**ప్రకాశం**

అబ్బో ! ఆయన దగ్గరకి ఎఫ్. ఏ., బి.ఏ. వాళ్లు కూడా వచ్చి చదువుకుంటారు. (తల్లివచ్చింది) ఎక్కడికెళ్లావమ్మా? (తల్లి 3 రూపాయలు తీసి యిస్తుంది.) ఎక్కడివమ్మా?

**తల్లి**

అవన్నీ నీకెెందుకురా? వెళ్లి పరీక్ష డబ్బు కట్టు.

**ప్రకాశం**

అట్లా వీల్లేదమ్మా ! చెప్పి తీరాలి.

**తల్లి**

మీ అమ్మ దొంగతనం చేసి తెచ్చిందని భయమా?

**ప్రకాశం**

అమ్మా ! మాటమార్చకు.. నువ్వు చెప్పకపోతే నేను రేపు ఫీజు కట్టను...

**శ్రీరాములు**

అమ్మ పట్టుబట్ట తీసుకుని, అప్పయ్యగారు డబ్బులిచ్చా రన్నయ్యా !

**ప్రకాశం**

అమ్మా ! పట్టుబట్ట తాకట్టు పెడితే మడి కట్టుకోవడం ఎట్లా? వడ్డన ఎట్లా?

**తల్లి**

కాసేపు తడిబట్ట కట్టుకుంటే సరిపోదుట్రా !

**ప్రకాశం**

అమ్మా !....

**రామయ్య**

సుబ్బమ్మ తల్లీ! ఈ పిల్లల కోసం నువ్వు పడే ఆరాటం చూస్తే –

**తల్లి**

(నవ్వి) మీరు మరీ చెబుతారు బాబుగారూ ! ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమా – అని. రేపు వాడో పెద్ద ప్లీడరీ అయితే, నేను కూచుని తిననూ.... నాన్నా ! లే ! యాభై మైళ్లు నడిచొచ్చావ్ ! పాపిష్టిదాన్ని ! ఈ ఆలోచన నాకు నిన్ననే రాకూడదూ ?

**రామయ్య**

ప్రకాశం ! ఈ మూడోఫారం కాగానే ఏ పోలీసుద్యోగమో చూసుకో కూడదూ? అమ్మకు కాస్త వెసులుబాటు –

**తల్లి**

అట్లా వద్దు బాబుగారూ ! వాడికి ప్లీడరీ చదవాలని వుంటే చదివించాల్సిందే!

**రామయ్య**

ఆ ప్లీడరీనే ఎందుకని?

**ప్రకాశం**

ఇంకోళ్ల మీద ఆధారపడకుండా ఉండే ఉద్యోగం యిదేనని మా నాయుడుగారు చెప్పారు... ఎప్పటికయినా నేను ఆ మునసబు కోర్టు ప్లీడర్లలా ప్లీడర్ని కావాలి.... ఏవమ్మా?...

**తల్లి**

ఎందుక్కావురా తండ్రీ ! గొప్ప ప్లీడరీ చదువుతావు... నువ్వు నల్లకోటు వేసుకుని వీధి వెంట నడుస్తూ వుంటే చూడ్డానికి ఈ కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తూ వుంటానురా! నా తండ్రే !! నా బాబే !! (దగ్గర తీసుకుంటుంది)

★ ★ ★

# నాలుగో దృశ్యం

## కథనం

**కథకుడు 1**

జీవితమంతా ఆకస్మిక ఘటనావళి.

Life is a series of accidents.

**కథకుడు 2**

చుట్టపు చూపుగా ఒంగోలు నుంచి
నాయుడుగారి కుటుంబం రాజమహేంద్రవరం వెడుతుంటే
నాలుగురోజులు గడపడానికి ప్రకాశమూ వెళ్లాడు.

**కథకుడు 1**

వెళ్లాడు కాదు; వచ్చాడు - అను.

**కథకుడు 2**

అదే - వచ్చాడు.
వచ్చినవాడు తిరిగి వెళ్లకుండా ఉండి పోయాడు.

**కథకుడు 1**

ఆ గురుశిష్యుల సంబంధం అటువంటిది.

**కథకుడు 2**

అది పరమాద్భుత రసోల్లాసిని
ఆనంద నిష్యందిని.

★ ★ ★

**రాజమండ్రి, 1886**

(రాజమండ్రిలో నాయుడు గారియిల్లు. నాయుడు, లక్ష్మమ్మ, అయినాల తాతయ్య నాయుడు)

**నాయుడు**

(కొంచెం కోపంగా) రాజమండ్రి ఇప్పుడు వెళ్లొద్దు అంటే నా మాట విన్నావు గాదు. తీరా చుట్టపు చూపుగా వచ్చాక, ఇక్కడే ఉద్యోగం అన్నావు !! ఈ తాతయ్య నాయుడు నాకో ఉద్యోగం కూడా చూసి పెట్టాడు.. అక్కడ ఒంగోలులో – అన్నీ అట్లాగే వుంచి –

**లక్ష్మమ్మ**

అక్కడున్నంతకాలం చెవిని యిల్లు కట్టుకుపోరితే విన్నారా? ఆ ఒంగోలు విడిచి రానంటే రానని... ఇప్పుడు చూడండి. ఉద్యోగమూ వచ్చింది; అయిన వాళ్లమధ్య ఉండడమూ జరిగింది.

**అయినాల**

ఇక్కడ మీకే యిబ్బందీ ఉండదక్కయ్యా ! మా స్కూల్లోనే ఖాళీ రావడం, బావగారికి ఆ ఉద్యోగం యివ్వడం – అంతా కాకతాళీయం... ఏలూరు లక్ష్మీ నరసింహం గారి స్కూల్లో మాస్టరుగిరీ అంటే ఆషామాషీ కాదు.

**నాయుడు**

ఎక్కడైనా మాస్టరుగిరీ నేనయ్యా !

**అయినాల**

నువ్వే చూస్తావుగా !.. ఇహ స్కూలుకి బయలుదేరు.. ఇవ్వాళే స్కూలు తెరిచేది... జ్ఞాపకం లేదా?

**నాయుడు**

ప్రకాశం ఏడీ?

**అయినాల**

నాకు ఎదురు పడ్డాడు.. మళ్లీ యిప్పట్లో చూడనుగదా, ఒకసారి గోదావరి గట్టుకు వెళ్లొస్తాను – అన్నాడు.

**లక్ష్మమ్మ**

ఏమిటో ! ఒంగోలు వెళ్లడం అతనికి బొత్తుగా యిష్టం లేదు.

**అయినాల**

అతను కూడా యిప్పుడే ప్రయాణంట?

**నాయుడు**

ఏమిటో ! ఉండమనడానికి మనసు రాకుండా ఉంది... వెడతానంటే మనసు గుడుసుళ్లు తిరుగుతోంది.

**లక్ష్మమ్మ**

చాలు, ఊరుకోండి... ఏమిటా బెంబేలుపడ్డం? మీ మీసాల గడుసుదనం అంతా ఒంగోలులో పెట్టివచ్చారాయేం?... అతన్ని కూడా మెట్రిక్యులేషన్ కాగానే ఇక్కడికే రమ్మందాం...

(ప్రకాశం వస్తాడు.. దిగులుగా ఉన్నాడు)

**అయినాల**

మీ మాస్టరుగారు స్కూలుకు బయలుదేరుతున్నారు... నీ కోసమే చూస్తున్నారు...

**ప్రకాశం**

నేను కూడా బయలుదేరుతాను మాస్టారూ... ఇప్పుడే రెండు పడవలున్నాయట. (లోపలికి వెళ్లి గుడ్డల సంచీ తెచ్చుకుని) మాస్టారూ ! మీరు లేని ఒంగోలుకు వెళ్లడానికి నాకు యిష్టంగా లేదండీ !...

**నాయుడు**

మళ్లీ సెలవులివ్వగానే వచ్చేయి.

**లక్ష్మమ్మ**

అమ్మగారికి నమస్కారాలు చెప్పు...

**నాయుడు**

మన వాళ్లందర్నీ అడిగానని చెప్పు. (జేబులో నుంచి డబ్బులు తీసి యిస్తూ) వెళ్లగానే ఉత్తరం రాయి. జాగ్రత్తగా చదువుకో...

**ప్రకాశం**

వెళ్లొస్తా మాస్టారూ !... వస్తానమ్మా... (వెడతాడు)

**నాయుడు**

(కనిపించేవరకూ చూస్తూ నిలబడి, విషాదంగా) కణ్వుడు పడ్డ అవస్థలో పడ్డాను.

కొందలమందెదెందము శకుంతల తానిపుడేగునం చయో !
క్రందుగ బాష్పరోధమున కంఠమునుంజెడె; దృష్టి మాంద్యముం
బొందె; ఒకింత పెంచిన తపోధనులే యిటుకుంద, ఎంతగా
కుందుదురో తమంతగను కూతులబాయు గృహస్థులక్కటా !...
(శ్రీ కందుకూరి వీరేశలింగంగారి అనువాదం)

**లక్ష్మమ్మ**

(తానూ విచారంగా వుంది... అయినా తెచ్చి పెట్టుకున్న నవ్వుతో) మీ శకుంతల అత్తవారింటికి వెళ్లడం లేదండీ, పుట్టింటికి వెడుతోంది.. అయినా ఆ బుర్ర మీసాలతో మీరు కణ్వుడేమిటీ?... ఎవరన్నా చూస్తే నవ్వుతారు.. ఆఁ ! ఇహ స్కూలుకు పదండి...

**నాయుడు**

ఎదురురా... (ఇద్దరూ వెడతారు... లైట్లు ఆగి వెలుగుతాయి... మధ్యాహ్నం... ఒంటిగంట..... సంగీతం... నాయుడు లోపలికి వస్తాడు...లక్ష్మమ్మ ఆశ్చర్యపోతుంది)

**లక్ష్మమ్మ**

ఇవాళ స్కూలు లేదా?

**నాయుడు**

లేకేం? ఇవ్వాళ మొదటిరోజుకదా ! సంతకం పెట్టి ఉదయం ఉండి వచ్చేశాను...

**లక్ష్మమ్మ**

ఎట్లా వుందండీ స్కూలు?

**నాయుడు**

బాగానే వుంది. థియిస్ట్ స్కూలు కదా ! మిషనరీ స్కూలు కంటె నయం.

**లక్ష్మమ్మ**

పోనీలెండి... మొత్తానికి రాజమండ్రి వచ్చిపడ్డాం... పిలిస్తే పలికే జనం ఉన్నారు.

**నాయుడు**

నువ్వేమో మీ వాళ్లున్నారని సంబరపడుతున్నావ్ !

**లక్ష్మమ్మ**

మీరేమో ప్రకాశం ఉండదని బెంగపడుతున్నారు !

**నాయుడు**

లక్ష్మీ ! నీకు మాత్రం లేదూ ఆ బెంగ -

**లక్ష్మమ్మ**

నిజమేనండీ ! ఇంట్లో పిల్లలకన్నా ఎక్కువగా ఉండేవాడు. ఏం కావాలన్నా 'అమ్మగారూ!' అని పిలిచి చేసి పెట్టేవాడు.

**నాయుడు**

నాకు తమ్ముడుంటే మాత్రం ఇంతకంటె దగ్గరగా ఉండేవాడా?

**అయినాల**

(వస్తూ) అదేమిటి బావా ! ఇంటర్వల్‌లో నిన్ను మాస్టర్లందరికీ పరిచయం చేద్దామని స్టాఫ్‌రూంకి వచ్చాను. నువ్వు సెలవు పెట్టి వచ్చావుటగా !

**నాయుడు**

అవునోయ్... మనసేం బావులేదు...

**అయినాల**

బావా ! నీకు చెప్పవలసిన వాణ్ణి కాదు... ఎవరో పరాయి వాళ్ల పిల్లవాడు. చనువు కొద్దీ నాలుగు రోజులు వుండి వెళ్లాడు.. దాని కంతగా -

**నాయుడు**

అతను శిష్యుడూ, నేను గురువూ కాదోయ్... ఏనాటి అనుబంధమో... వాళ్లది అసలే ఏమీ లేని సంసారం... అతని చదువు అర్ధాంతరంగా ఆగిపోతుందేమో నని

- నన్ను తప్ప - వాళ్ల అమ్మని కూడా ఏమీ అడిగేవాడు కాదు. (గాద్గదికం అయిపోతాడు)

**లక్ష్మమ్మ**

ఊరుకోండి.... వాళ్ల అమ్మగారికి మాత్రం పిల్లాడు కళ్ల ఎదుట ఉండాలని ఉండదూ?

**నాయుడు**

(ఉత్తరీయంతో కళ్లు ఒత్తుకుని) అంతేలే ! (అని చెప్పుల్లో కాళ్లు పెడుతూ ఉంటాడు)

**ప్రకాశం**

(తొందరగా వస్తూ) మాస్టారూ !

**నాయుడు**

(ఆశ్చర్యంగా) అదేమిటోయ్ !

**ప్రకాశం**

వచ్చేశాను మాస్టారూ ...

**నాయుడు**

ఎట్లా?

**ప్రకాశం**

నేను వెళ్లేటప్పటికి పడవలు రెండూ వెళ్లిపోయాయట... ఇహ పదిరోజుల దాకా పడవలేదుట.

**లక్ష్మమ్మ**

మంచిదే అయిందిలే... మీ మాస్టారు నువ్వు వెళ్లి పోయావని ఊరికే దిగులు పడుతున్నారు...

**నాయుడు**

పోనీ నువ్వుకూడా ఇక్కడే వుండిపోకూడదూ?

**ప్రకాశం**

ఎట్లా మాస్టారూ?

**నాయుడు**

అక్కడ మాత్రం నీకు ఎవరున్నారు? అమ్మ – తమ్ముళ్లు... వాళ్లు కొన్నాళ్లపాటు అక్కడే వుంటారు.

**ప్రకాశం**

కానీ బోలెడంత ఖర్చు – భోజనానికి, స్కూలుకి, ఫీజులకి –

**నాయుడు**

మిగిలినవన్నీ అక్కడా వున్నాయి. ఇక భోజనానికి... నాలుగిళ్ల లో వారాలు అడుగుతాను. కాదనరు... స్కాలర్‌షిప్ తేలిగ్గా దొరుకుతుంది... మిగిలినవన్నీ చూడ్డానికి నేనున్నానుగా !

**ప్రకాశం**

నాకంతకంటె ఏం కావాలి మాస్టారూ? (లక్ష్మమ్మతో) ఇవ్వాళ పడవ ఉండివుంటే నా జీవితం ఏమయివుండునో అమ్మ గారూ!

**లక్ష్మమ్మ**

(నవ్వి) ఇద్దరూ ఒకటే పోలిక ! సరే ! అబ్బాయిని నాళం వారి సత్రానికి తీసుకుపోయిరండి. పొద్దుట్నుంచీ ఏమీ తినలేదు పిల్లాడు.

**నాయుడు**

అవును గదూ ! పదవోయ్ పంతులూ (బుజం మీద చెయ్యి వేసి కులాసాగా తీసుకుపోతాడు.)

★ ★ ★

# అయిదవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

తొలి యౌవనంలో భవిష్యత్తు
ఆకృతిలేని అగమ్య స్వప్నం.
వర్తమానం దాని చెలికాడు
అనుభవం దాని బానిసీడు.

**కథకుడు 2**

మరి కొంత కాలానికి భవిష్యత్తు
గడిచిపోతున్న వర్తమానానికి
చేరువౌతున్న చేదునిజం.

**కథకుడు 1**

కొంతకాలం నాటకాలే జీవితం

**కథకుడు 2**

కొంతకాలం నాటకాలు, న్యాయవిద్య

**కథకుడు 1**

మరి కొంతకాలం న్యాయవిద్య, రాజకీయం.

**కథకుడు 2**

కొత్త కొత్త అనుభవాలను ఆహ్వానించే
రసిక జన మనోభిరామంలా

ఉరకలు వేసే యౌవనానికి
అన్నిటా మగటిమి చూపాలని ఆతృత.

**కథకుడు 1**

ఒక పక్క మాస్టారు ఏమైనా చేస్తారని ధీమా

**కథకుడు 2**

మరో పక్క ఆయన ఇంత చేస్తున్నారే అని బెంగ.

**కథకుడు 1**

ఆశ నిరాశల అల్లికలో
జీవితం సాలెగూడు.
అందులో చిక్కు కోకుండా
తప్పించుకోవడం కాదు మన ఆశయం.
సాలె పురుగు గూడు కట్టడంలో ఉన్న
పట్టుదలే మనకాదర్శం.

**కథకుడు 2**

ఆదర్శం నిజమై, కలవాస్తవమై
చిన్ననాటి కలల సౌధంలోకి
ధీమాగా పోతున్న రాకుమారుడికి
నల్లగౌను న్యాయవృత్తి
నవ్వుతూ ఆహ్వానం పలికింది.

★ ★ ★

**రాజమండ్రి, 1892**

(రాజమండ్రిలో నాయుడు గారియిల్లు, వెనుక ఒక టేబుల్ మీద ఒక నటరాజు విగ్రహం... ముందు నాయుడు, ప్రకాశం, అయినాల, చిలకమర్తి. రాత్రి ఆడిన నాటకం తాలుకు బట్టలు మడతలు పెడుతూ ఉంటారు.)

**అయినాల**

రాత్రి నాటకం బ్రహ్మాండంగా వుంది ప్రకాశం ! ఇన్నిసార్లు వేశాదు యీ గయోపాఖ్యానం నాటకం ! ముందు చిత్రరేఖ వేషంలో కరుణరసం, ఆ తరువాత అర్జునుడి వేషంలో వీర రసం ! ఓహ్ ! రాత్రయితే మరీ అమోఘం !

**ప్రకాశం**

రాసింది మా చిలకమర్తి లక్ష్మీ నరసింహ కవి. నడపించింది ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారు! - బాగుండకేం అవుతుంది?

**చిలకమర్తి**

రాత్రి ఆనందాచార్యులు గారు కూడా బాగా మెచ్చుకున్నారు... వెడుతూ వెడుతూ నాతో మరీ మరీ చెప్పారు... ఆ కుర్రాడికి మంచి భవిష్యత్తు ఉందీ అని -

**ప్రకాశం**

(నవ్వుతూ) భవిష్యత్తు దేన్లో - నాటకాలలోనా?

**నాయుడు**

ఏం? కాకూడదా?

**ప్రకాశం**

అబ్బే ! అందుకు కాదండీ !...

**నాయుడు**

ఆయన ఎందుకామాట అన్నా - మనకు దీవెనలనే అనుకోవాలి.... ఆనందాచార్యులు గారంటే - గొప్ప జాతీయ వాది, కాంగ్రెసు ప్రెసిడెంటు. గొప్పలాయరు.. అన్నిటినీ మించి సహృదయుడు...

**అయినాల**

పనప్పాకం ఆనందాచార్యులుగారు మీ నాటకం చూడ్డానికి వస్తున్నారా అని అందరూ ఆశ్చర్యపడేవాళ్లే ! చివరికి న్యాపతి సుబ్బారావు పంతులుగారు కూడా...

**నాయుడు**

అర్జునుడు పాడిన 'నిటలాక్షుండు' పద్యానికి ఎంతో ఆనందించారట ! పక్కనే ఉన్నతోలేటి వెంకటసుబ్బారావు గారితో ఇదీ పద్యం చదవడమంటే - అన్నారట. పాత్రని ఎలా ఆవిష్కరించాడయ్యా యీ కుర్రాడు - అని సంతోషించార్ట ! !

**ప్రకాశం**

నాదే ముంది మాస్టారూ? మీరెట్లా చదవమంటే అట్లా చదివాను అంతే ...

**చిలకమర్తి**

ఏదీ, ఆ పద్యం ఒక్కసారి చదువు....

**ప్రకాశం**

నిటలాక్షుండి పుడెత్తి వచ్చిను రానీ అన్నదమ్ముల్నను
న్విటతాటంబుగ బాసిపోయినను పోనీ, కృష్ణుడేవచ్చి వ
ద్దిటు పార్థాయననీ ! మరేమయినగానీ, లోకముల్ బెగ్గిలం-
బటు దర్పంబున నిల్చి యాగయుని ప్రాణంబేను రక్షించెదన్.

**నాయుడు**

(వెంటనే అందుకుంటూ) (నాటకం ఫక్కీలో) మహానుభావా ! రాచపుట్టుకకు సార్థకత తెచ్చినారు తమరు :

తన దేహము, తన గేహము
తన కాలము, తన ధనంబు, తనవిద్య, జగ
జ్జనములకై వినియోగిం
చిన నరుడే నరుడు, వాడె చెందును దివముల్...

ఏం పద్యమండీ ! గయుడి అప్పటి మనః స్థితికి, అర్జునుణ్ణి వేడుకోవడంలో ఉన్న కరుణ రసదృష్టికి గొప్పతార్కాణం..

**చిలకమర్తి**

నిటలాక్షుందు పద్యం – అర్జునుడిలోని రాజస ప్రవృత్తిని – ఎవరిని ఎదిరించి అయినా సరే క్షత్రియ ధర్మం నిలబెడతాను – అని సవాలు చేస్తూ పాడిన పద్యం.. నాయుడుగారు పాడిన పద్యం గయుడి సత్త్వ దృష్టికి అద్దం పడుతుంది... గయుడిది ముందు తామస ప్రవృత్తే ! కాని కృష్ణుడు – తన ఏలిక – తన్ను చంపుతానని శపథం చేసే సరికి తాను నిజమైన గంధర్వ ప్రవృత్తిని – కళా ప్రవృత్తిని – వ్యక్తం చేస్తూ సాత్త్విక భావ దృష్టిని అలవరుచుకున్నాడు... చూస్తే ధర్మరాజుకు రాసిన యీ పద్యం గయుడికే ఎక్కువ నప్పింది. అవి వాళ్ల పాత్రలకే కాదు – మనుషులకు కూడా అట్లా అతుక్కు పోయాయి...

**అయినాల**

ఇప్పటికి గాని దాని అంతరార్థం నాకు బోధపడలేదు.

**నాయుడు**

అందుకే ఆయన కవి, నాటకకర్త అయినారు; నువ్వూ నేను ఒట్టి నటులమే!

**చిలకమర్తి**

ఒట్టి నటులేమిటండీ ! గట్టి నటులు... ఆయన రాత్రి భారత దేశం స్థితిని గురించి మాట్లాడారు గదండీ ! అప్పుడు నాకో పద్యం తట్టిందండీ !

**నాయుడు**

చదవండి -

**చిలకమర్తి**

భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లహారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు - మూతులు బిగియగట్టి.

**ప్రకాశం**

చాలా బావుంది..... ప్రస్తుత మనస్థితికి చక్కని వ్యాఖ్యానం! రాత్రి పాడి వుంటే ఆనందాచార్యులుగారు సంతోషించేవారు.

**చిలకమర్తి**

ఆయన ఉపన్యాసం అయిం తర్వాతనే ఈ పద్యం రాయాలనిపించింది.

**నాయుడు**

ఓహ్ ! బావుందండీ !.... బిపిన్ చంద్రపాల్ గారు రేపు రాజమండ్రి వచ్చినప్పుడు ఆ సభలో ఈ పద్యం చదవాలండీ చిలకమర్తి వారూ !

**చిలకమర్తి**

ఎంతమాట! తప్పకుండా!

**ప్రకాశం**

ఆనందాచార్యులుగారి ఉపన్యాసం వింటే ఆయనలా వాదించ గల శక్తి వుంటే బావుండును - అనిపించింది.

**నాయుడు**

అది ప్లీడర్ని కావాలన్న నీ తపనకు నిదర్శనం.

**చిలకమర్తి**

ఇంకా ఎన్నాళ్లు? వచ్చేవారం ఈ పాటికి మదరాసులో 'లా' కాలేజీలో చేరుతున్నావు !... సగం ఆనందాచార్యులు గారివి అయిపోతావు !

**అయినాల**

మిగిలిన సగం?

**చిలకమర్తి**

అంటే జాతీయవాదిగాననా? అది నాయుడుగారి సొత్తు... ఆయనలా విద్యార్థుల్లో జాతీయ భావాలు వెదజల్లే మాస్టర్లేరీ?

**నాయుడు**

ప్రకాశం ! నువ్వు మదరాసు వెడుతున్నావు, ప్లీడరీ చదవడానికి !! లాయర్లని, కోర్టులో జరిగే కార్య కలాపాల్ని చూసి ఎంతగా నేర్చుకుంటావో - అలానే నిస్వార్థంగా దేశం కోసం ఎవరు ఎలా సేవ చేస్తున్నారో గమనించు. ముందు వృత్తిలో రాణింపు... దాని తరువాత నీ వాళ్లసంగతీ, సంఘం సంగతీ, దేశం సంగతీ -

**చిలకమర్తి**

అందులో ప్రకాశం మీ శిష్యుడేనండీ !

**ప్రకాశం**

ఈ శిష్యరికం ఇల్లాగే కలకాలం ఉండాలని, మీ భావాలని సరిగ్గా అమలు చేయగల ధైర్యం పట్టుదల నాకు రావాలని ఆశీర్వదించండి మాస్టారూ !

(పాదాభివందనం చేస్తాడు... నాయుడు ప్రకాశాన్ని లేవనెత్తి కౌగలించు కుంటాడు... అందరి కళ్లూ చమరిస్తాయి...)

★ ★ ★

# ఆరవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

రాణ్మహేంద్రవరం న్యాయవాదుల కామధేనువు.

**కథకుడు 2**

హేమా హేమీలప్పటికే కుదురుకున్న ప్లీడర్లు.

**కథకుడు 1**

న్యాపతి సుబ్బారావు, నేతి సోమయాజులు,
ములుకుట్ల అచ్యుత రామయ్య వగైరా...

**కథకుడు 2**

ప్రతి ఒక్కరూ 'లా' ని ఔపోసన పట్టిన అగస్త్యులే !

**కథకుడు 1**

రెండేళ్లలో వాళ్లకు మించిన ప్రాక్టీసు సంపాదిస్తే
ఎవరికి మాత్రం కడుపుమండదు?

**కథకుడు 2**

వాదనలో కొట్టలేని ప్రకాశాన్ని,
రాజకీయాల్లో కొట్టాలని ప్రయత్నం.

**కథకుడు 1**

మూడేళ్లు ఓడిపోయి, నాలుగో ఏడు
మునిసిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయిన ప్రకాశం గెలుపును
గెజెట్‌లో పడకుండా ఆపారు పెద్దలు.

**కథకుడు 2**

లా మెంబరు ఫోర్బ్స్‌తో ముఖాముఖీ పోట్లాడితే గాని
ఛైర్మన్‌గా ఒప్పుకోని సిగ్గుచేటుతనం
ఇప్పుడేకాదు, అప్పటికే మన వారసత్వం !

**కథకుడు 1**

వాస్తవాన్ని వాస్తవం అని నిరూపించడానికి
ఎంత కష్టపడాలి ఈ దేశంలో !

★ ★ ★

**రాజమండ్రి, 1904**

(ప్రకాశం ఇంట్లో - ప్రకాశమూ, బారిస్టర్ స్వామినాధన్)

**ప్రకాశం**

(చికాకుగా) బారిస్టర్ స్వామినాధన్ ! ఇదేమి బారిస్టరీ అండీ! మీరు ఒక్కమాట మాట్లాడలేదు. "No points to argue, case dismissed" అని డేవిస్ జడ్జిమెంటు చెబితే ఆర్యుమెంటు చెప్పకుండా కేసు ఎట్లా డిస్‌మిస్ చేస్తారని ఒక్కమాట అనలేక పోయారు మీరు !

**స్వామినాధన్**

మిస్టర్ ప్రకాశం ! నేను చెప్పే మాటదా వినండి...

**ప్రకాశం**

ఏమిటండీ మీరు చెప్పేది? మనం ఏం అడిగాం? నా క్లైంట్ ఏలూరి లక్ష్మీ నరసింహం గారి మీద ప్రత్యర్థులు పెట్టిన కేసును ఇక్కడ విచారించ కూడదు- అని. అంతేనా?

**స్వామి**

కాని మీ క్లైంట్ చెప్పింది అబద్ధమని పోలీసులు ప్రూవ్ చేస్తుంటే...

**ప్రకాశం**

మిస్టర్ స్వామినాధన్ ! ఇప్పుడు hearing కేసు మీదకాదండీ! కేవలం ఈ కేసును ఈ వూళ్లో కాక మరోవూళ్లో విచారించాలి అని మన వాదం... ఎందుకు?

ఈ కేసును ఆయనమీద పురమాయించినవాళ్లు పెద్ద మనుషులు, పలుకుబడి వున్నవాళ్ళు. వాళ్ళు న్యాయం జరక్కుండా చూస్తారని మాకు అనుమానం. అదీ మన argument... అంతేనా? ఈ మూడు ముక్కలూ కూడా చెప్పలేకపోతే...! Oh! I am thoroughly disappointed.. నేను సెకండు గ్రేడు ప్లీడర్ని కావడం వల్ల జిల్లా జడ్జి దగ్గర కేసులు చెయ్య కూడదు గనక మద్రాసు నుంచి మిమ్మల్ని పిలిపించాను.

**స్వామినాథన్**

I am sorry, Mr. Prakasam. దీని మీద High Court లో revision petition పెడదాం... నేను ఏమీ ఫీజు తీసుకోకుండా ఈ కేసులో argue చేస్తాను.

**ప్రకాశం**

ఇది ఫీజుకు సంబంధించింది కాదండీ... నా మీద నా clients కి వుండే నమ్మకానికి సంబంధించింది...

**స్వామి**

Mr. Prakasam ! మీరు ఏమీ అనుకోనంటే మీకొక్క మాట చెప్పాలి... మీలో మంచి argumentative power వుంది... quick decision వుంది. మంచి repartee వుంది. వాక్చాతుర్యం ఉంది. మీరెందుకు బారిస్టర్ చదవ కూడదు?

**ప్రకాశం**

బావుందండోయ్ ! నావంటి సెకండ్‌గ్రేడ్ ప్లీడరేమిటి, బారిస్టరు కావడమేమిటి? వేలకువేల రూపాయలు ఖర్చుపెట్టే తాహతు నాకెక్కడిది?

**స్వామి**

వేలకువేలు అక్కర్లేదండి... ఆరువేలు చాలు... నేను నెలకు ఆరు పౌండ్లతో manage చేస్తిని. మీరు O.K. అనండి.... నేను కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తాను...

**ప్రకాశం**

ఆరేడు వేలయితే ఫరవాలేదనుకుంటాను..

**స్వామి**

మళ్లీ వెనక్కు వెళ్లకండి.. మీవంటి dashing nature వున్న వాళ్లే ఈ వృత్తిలో రాణిస్తారు.. మీరు ఈ కేసు కోసం మదరాసు వస్తారుగా, అప్పుడు వివరాలన్నీ మాట్లాడుకుందాం. వస్తాను, Good day !

**ప్రకాశం**

అలాగే !...... (స్వామినాథన్ వెళ్లిపోతాడు)

**శ్రీరాములు**

నువ్వు తప్పకుండా బారిస్టర్ చేసి రావాలి అన్నయ్యా!

**ప్రకాశం**

అరె ! మనకెట్లాకుదురుతుందిరా?... ఇప్పుడిప్పుడే ఈ వృత్తిలో నిలదొక్కు కుంటున్నాను... వీలుంటే తరవాత చూద్దాం.

**శ్రీరాములు**

అన్నయ్యా ! మూడేళ్లలో యీ వూళ్లో కల్లా పేరున్న ప్లీడర్ వయ్యావు.. మునిసిపాలిటీ అధ్యక్షుడివైనావు.. వేడిలో వేడి.. ఇప్పుడే వెళ్లొస్తే బావుంటుందేమో నన్నయ్యా ! నాకింకా రెండేళ్ల చదువుంది కనుక మేమంతా రాజమండ్రిలోనే వుంటాము.

**ప్రకాశం**

అరే ! అర్థం లేకుండా మాట్లాడకు... అమ్మని మొన్ననే ఒంగోలు నుంచి తీసుకొచ్చాం... అమ్మనీ, వదిన్నీ వదిలి వెళ్లడం ఎలా? ముందు డబ్బు కావాలిగా?

**శ్రీరాములు**

ఎంతన్నయ్యా ! ఆరు వేలేగా !

**ప్రకాశం**

ఒరే పిచ్చి తండ్రీ ! నిన్నటి దాకా ఆరు కాన్లు లేవురా మన దగ్గర...

**శ్రీరాములు**

అన్నయ్యా ! జీవితంలో ఒక్క కానీ కూడా లేకుండా రిస్క్ తీసుకున్న నీకు ఇదొక లెక్కా?.. నేను అమ్మతో మాట్లాడుతానుగా – అమ్మా ! (పిలుస్తాడు)

**ప్రకాశం**

అరె, లేడికి లేచిందే పరుగైతే ఎలా? ఆలోచిద్దాం –

**శ్రీరాములు**

అన్నయ్యా ! నీకు బారిస్టరు చదవాలని వుంది - నాకు తెలుసు... ఎన్నాళ్లు యీ రాజమండ్రి? నీ తెలివి తేటలకి ఇది చాలా చిన్న ఊరు... ఇంకా పెద్ద వూళ్లో... ఇంకా...

**ప్రకాశం**

ఏడిశావులే ! పెద్ద పెద్ద అనకు - మనం అంత పెద్ద వాళ్లం కాదు..

(కంచుమర్తి రామచంద్రరావు వస్తాడు, 'ప్రకాశం' అని పిలుస్తూ)

రారా, రాముడూ!

**కంచుమర్తి**

ఏమయింది ఇవ్వాళ్టికేసు?

**ప్రకాశం**

నీళ్లుగారి పోయింది... ఏమి బారిస్టర్లురా ! డిగ్రీలేకాని నోట మాట లేదు.

**కంచుమర్తి**

అదేమిటి?

**ప్రకాశం**

ఆ స్వామినాధన్‌ని తెచ్చామా మదరాసు నుంచి. ఒక్కమాట మాట్లాడితే ఒట్టు.

**శ్రీరాములు**

రాముడన్నయ్యా ! ఆ స్వామినాధనే -అన్నయ్యన్ని - నువ్వు బారిస్టరు చదువు, బాగా పైకొస్తావ్, అన్నాడు... అన్నయ్యే, చూద్దాంలే అంటున్నాడు.

**కంచుమర్తి**

పోనీ వెళ్లి రారాదురా !

**ప్రకాశం**

బోలెడంత డబ్బుతో కూడిన వ్యవహారం !

**కంచుమర్తి**

ఎంతవుతుందేం?

**ప్రకాశం**

ఆరేడు వేలు అవుతుందన్నాడు... కాని రాముడూ ! ఇప్పుడే ఈ వృత్తిలో నిలదొక్కుకుంటున్నాను. అమ్మా, మా ఆవిడా, శ్రీరాములు, జానకిరామయ్య - అందరం ఒక చోట స్థిమిత పడుతున్నాం... ఇప్పుడు...

**కంచుమర్తి**

మేమంతా లేమురా?.... ఇంతేనా స్నేహానికి విలువ? అందరూ ఇక్కడే వుంటారు. నువ్వింకేం ఆలోచించకు... ఏర్పాట్లు చూసుకో...

**ప్రకాశం**

అరె ! అసలు సంగతి చూసుకోవద్దూ?

**కంచుమర్తి**

డబ్బేనా?... నీకు ఎంత ఖర్చయినా అందులో సగం నేనిస్తాను. సరా? మరో సగం మీ clients లో ఎవరినైనా అడుగుదాం.. అన్నట్టు మాగంటి లక్ష్మణ దాసున్నాడుగా! మనవాడు! నువ్వంటే పంచ ప్రాణాలు... నేను రేపే చాటపర్రు వెళ్లొస్తాను...

**తల్లి**

(వస్తూ) ఒరే ప్రకాశం ! ఇవాళ భోజనాలకి రారా? (రాముడితో) ఏరా నాయనా, మరీ నల్ల పూసవై పోయావు?.. నాన్నగారు పోయాక ఇంటి భారమంతా నీ మీదే పడ్డదిరా నాయనా ! జాగ్రత్త... నాన్నగారి పేరు నిల బెట్టాలి.

**కంచుమర్తి**

మీరంతా ఉండగా నాకు భయమేమిటి పిన్నీ !... ఒరే ! అమ్మతో చెప్పావా?

**ప్రకాశం**

ఏదిరా, ఇప్పుడే స్వామినాథన్ వెళ్లాడు.. వెడుతూ యీ ముక్క అని వెళ్లాడు. అప్పట్నుంచీ శ్రీరాములు నన్ను చెండుకు తింటున్నాడు.

**తల్లి**

ఏమిట్రా అది?

**ప్రకాశం**

అమ్మా -

**కంచుమర్తి**

నేను చెబుతానాగరా !... పిన్నీ ! ఇందాక స్వామినాథన్ అని మద్రాసు నుంచి ఓ పెద్ద వకీలు వచ్చాడు...ఆయనంటాడూ, ప్రకాశం ఇంగ్లండు వెళ్లి పెద్ద చదువులు చదివొస్తే మంచి భవిష్యత్తు ఉంటుందీ - అని.

**తల్లి**

ఒరే ! ఇప్పుడు మనకేం తక్కువరా ?

**కంచుమర్తి**

కాదు పిన్నీ ! ప్రకాశం తెలివితేటలకి బారిస్టరు అయి తీరా.. అప్పుడుకాని ఆ సుబ్బారావు పంతులుగారికీ, వాళ్ళకీ తెలిసి రాదు అన్నయ్యంటే ఏమిటో !... ఎంతపని - సంవత్సరన్నర.. ఇట్టే తిరిగివస్తుంది...

**ప్రకాశం**

కొంచెం కుదురుకున్నాక చూద్దామంటే వీళ్లు వినడంలేదమ్మా! ... మళ్లీ మీరు ఎవరిదగ్గరకో వెళ్లివుండాలా?

**తల్లి**

ఇప్పుడా బెంగలేదురా నాకు... ఎక్కడ వున్నా రాజాలా మన డబ్బు పెట్టుకునే వుంటాం... కాని పెద్ద చదువులంటు న్నారు... ఇంగ్లాండు అంటున్నారు.. అంతడబ్బు

**ప్రకాశం**

రాముడు సగం యిస్తానన్నాడమ్మా !... మిగిలింది నా client ఎవరన్నా -

**తల్లి**

నువ్వింకా పైకి వస్తానంటే నాకు మాత్రం ఆనందం కాదురా! ఆయనగారు బతికివుంటే ఎంతో సంతోషిద్దురు ! ... నిన్ను ఇంగ్లీషు చదువులో పెట్టాలని ఆయన పడ్డ ఆరాటం ! సంసారాన్ని ఎక్కడో వుంచి ఆయన పడ్డపాట్లూ !... ఇవన్నీ తలుచుకుంటే - ఆయన ఆశలు యీ రకంగా ఫలిస్తున్నాయని నాకు ఆనందమేరా నాయనా! కానీ -

**ప్రకాశం**

ఏమిటమ్మా?... నీకు ఏ మాత్రం ఇష్టం లేకపోయినా నేను వెళ్లను...

**తల్లి**

అది కాదురా!... అక్కడ అంతా మద్యం - మాంసం...

**ప్రకాశం**

(నవ్వి) ఆ భయం నీకు వద్దమ్మా ! నీ ప్రకాశం యిక్కడ ఎట్లా వున్నాడో అక్కడా అట్లానే వుంటాడు... సరా ?

**తల్లి**

అయితే ఇంకేంరా? శుభంగా వెళ్లిరా!

ఇహ భోజనాలకి లేవండి ... (రాముడితో) రారా ... నాయనా...

(ఫేడ్ అవుట్)

★ ★ ★

# ఏడవ దృశ్యం

**రాజమండ్రి, 1905**

(రాజమండ్రిలో ప్రకాశం యిల్లు.... తల్లి, మేనమామ, నాయుడు, చిలకమర్తి, అయినాల.... అందరూ ప్రకాశం విదేశ యాత్ర నుంచి రావడం కోసం ఎదురు చూస్తూ వుంటారు).

**అయినాల**

ఇంగ్లండు వెళ్లినవాళ్లు తిరిగి రారనీ, పాడై పోతారనీ రాజమండ్రి అంతా గగ్గోలు పుట్టించారే, ప్రకాశం వస్తున్నాడుగా! ఇప్పుడేమంటారో అనమనండి.

**చిలకమర్తి**

ఆ సనాతనహిందూసమాజం జనం మరీను... మొన్న వాళ్ల గుమస్తా కనిపించి మీ ప్రకాశం మతం పుచ్చుకుంటాడుటగా – అని అడిగాడు.... నాకు మండింది...

**అయినాల**

హిందూసమాజం సుబ్బారావు పంతులుగారి ఒంట్లో బాగు లేదుట, డాక్టరు గారు చెప్పారట, అందుకోసం సముద్రయానం చేసొచ్చార్ట!... ప్రకాశం అంతకన్న ముఖ్యమైన పనిమీదే వెళ్లాడు..

**నాయుడు**

ప్రకాశాన్ని, అతని కుటుంబాన్ని వెలి వెయ్యాలని సనాతన హిందూ సమాజం వాళ్లు అనుకుంటున్నార్ట ! విన్నారా చిలకమర్తి వారూ !

**చిలకమర్తి**

ఇటువంటి కుందేలు చప్పుళ్లకి సింహాలు భయపడతాయిటండీ?...

**తల్లి**

ఏమిటో, పిల్లాడు పైచదువులకి వెడుతున్నాడంటే సంబర పడ్డానుగాని, ఆంక్షలు, వెలివెయ్యడం అంటే భయంగా వుంది. (వాకిట్లో కారు ఆగిన చప్పుడు, హడావుడి) (గొంతు తగ్గించి) బాబూ ! దూరదేశం నుంచి ప్రయాణం చేసి అలిసిపోయి వస్తున్నాడా! ఈ విషయాలేమీ వాడితో ఇప్పుడే చెప్పకండేం?... ('అలాగే' అని తల ఊపుతారు నాయుడుగారు, చిలకమర్తి)

(ప్రకాశం వస్తాడు.. బాగా పసిమి అయినాడు... ఆంగ్ల పద్ధతిలో సూటు, బూటు. వెంట కంచుమర్తి శ్రీరాములు - ఉన్నారు....)

**ప్రకాశం**

అరె ! అందరూ యిక్కడే వున్నారే ! (నమస్కారం చేస్తూ) మాస్టారుగారూ, ఆరోగ్యం ఎట్లా వుంది?

**నాయుడు**

బాగానే వుందయ్యా

**ప్రకాశం**

కవిగారూ ! బావున్నారా ?

**చిలకమర్తి**

బావున్నానయ్యా!

(తల్లి లోపలికి వస్తుంది)

**ప్రకాశం**

ఎట్లా ఉన్నవే అమ్మా?

**తల్లి**

నాకేరా, గుండ్రాయిలా వున్నాను... నువ్వే చిక్కి సగం అయిపోయావు...

**ప్రకాశం**

అదేమిటే ! నేను లావయివచ్చానన్నారు రాముడూ, భీముడూ.

**తల్లి**

వాళ్ల మొహం, వాళ్లు అలాగే అంటారు. తల్లి మనసుకు తెలుసు నువ్వు చిక్కావో, బలిశావో !

**ప్రకాశం**

నిజమేనయ్యా ! శరీరం బలిసిందేమో కాని, మనసు చిక్కి పోయిందే ! మిమ్మల్ని వదలి ఉండడం, గోదావరి నీళ్లూ, రాజమండ్రి వీధులూ - ఇవన్నీ తలుచుకుంటే ఎందుకు లండన్ వచ్చానా అని అనిపించేది.

**తల్లి**

(రహస్యం చెబుతున్నట్లు) నాయనా ! కోడలు పిల్ల -

**ప్రకాశం**

ఇప్పుడే వస్తాను మాస్టారూ - (ప్రకాశం లోపలికి వెళతాడు).

**నాయుడు**

(ప్రకాశం వెళ్ళిన వైపుకే చూస్తూ) తాతయ్య నాయుడూ ! మన ప్రకాశం ఏమీ మారలేదయ్యా!

**శిష్యుడు**

ఎలా మారతాడు బావా? ప్రకాశం నీ శిష్యుడు. ఇంగ్లండే కాదు, ప్రపంచమంతా తిరిగొచ్చినా ఏమీ మారడు. (ప్రకాశం తిరిగి వచ్చాడు).

**నాయుడు**

పంతులూ ! చదువు బాగా జరిగిందా?

**ప్రకాశం**

చాలా బాగా జరిగింది మాస్టారూ... అమ్మగారు, పిల్లలు ఎట్లా వున్నారు?

**నాయుడు**

బాగానే వున్నారు. నువు ఎప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నారు.

**ప్రకాశం**

(చిలకమర్తితో) కొత్త నాటకాలేమన్నా రాశారా?

**చిలకమర్తి**

కొత్తగా ప్రసన్నయాదవం అని ఓ నాటకం రాశాను... అందులో సత్యభామపాత్రని నిన్ను తలుచుకుంటూనే రాశాను...

**అయినాల**

ఇంకేం నాటకాలు వేస్తాడు? ఇహ కోర్టులో నాటకాలే! కాకపోతే రాజకీయాల్లో సూత్రధారిగా...

**కంచుమర్తి**

అంతకంటె ముందు మనవూరి సనాతన హిందూ సమాజం వాళ్లు ఆడే నాటకంలో విలన్ పాత్ర ధరించ బోతున్నాడు. (ఆ విషయాలు మాట్లాడొద్దని అయినాల- కంచుమర్తికి సంజ్ఞ చేస్తాడు)

**ప్రకాశం**

ఏమిటండీ? నన్ను వెలివేస్తున్న విషయం చెప్పొద్దనేనా? రాముడు దోవలోనే చెప్పాడు నాకీ విషయం... వీళ్ల కెట్లాగయినా బుద్ధి చెప్పాలంటారు రాముడూ, భీముడూ...

**శ్రీరాములు**

వీరేశలింగంగారూ ఆ మాటే అన్నారన్నయ్యా !

**ప్రకాశం**

చూద్దాం... ముందు వాళ్ల దగ్గర నుంచి నాకు తాఖీదు అంద నివ్వండి...

**నాయుడు**

అక్కడ 'లా' చదువు, కోర్టులేనా - ఇంకా ఇతర వ్యాపకాలు -

**ప్రకాశం**

దేశ స్వాతంత్ర్యాన్ని గురించిన చర్చలూ, ఆలోచనలేనండీ అక్కడ కూడా. లండన్‌లో ఇండియా సొసైటీ వుంది... నే నందులో చేరాను.

**కంచుమర్తి**

ఏం చేస్తారు వాళ్లు?

**ప్రకాశం**

పెద్ద పెద్ద వాళ్ళని పిలిపించి ఉపన్యాసాలు చెప్పిస్తారు. దానికి ముఖ్యుడు దాదాభాయ్ నౌరోజీ... ఆయన చూపులకి ఇంగ్లీషు వాడు... కాని మనసునిండా భారతదేశాన్ని గురించిన తపనే! మన పూర్వకాలం రుషుల్ని జ్ఞప్తికి తెస్తాడండీ !

ఇరికించి ఎట్లానయినా జైల్లో పెట్టించాలని చూసిన మహానుభావులు – మళ్లీ ఇక్కడే ప్రాక్టీసు పెట్టడమంటే చిరాకుగా వుంది.

**నాయుడు**

మరి?

**ప్రకాశం**

మద్రాసులో పెడదామని.

**నాయుడు**

మద్రాసులోనా?

**కంచుమర్తి**

అక్కడ యిప్పటికే చాలా మంది ప్రాక్టీసు లేని బారిస్టర్లున్నారు, నీకు తెలియదూ?

**ప్రకాశం**

ఒరేయ్ రాముడూ ! శ్రీరాములూ ! ఎంతమంది ఉంటేనేరా? మన అదృష్టం మనది... నేను చెబుతాను చూడు –

**కంచుమర్తి – శ్రీరాములు**

కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి...

(అందరూ నవ్వుతారు)

**నాయుడు**

ప్రకాశం కేసరి... అటువంటి మదగజాల్ని ఇక్కడా కొట్టాడు; మద్రాసులోనూ కొడతాడు.

**ప్రకాశం**

ఇదంతా మీరిచ్చిన ధైర్యమే మాస్టారూ! ఆ రోజున ఒంగోలు నుంచి రాజమండ్రి రావడం జ్ఞాపకం ఉందా? ఇప్పుడు ఇక్కడి నుంచి మద్రాసుకు... నాతో పాటు మీరంతా..

**నాయుడు**

పంతులూ ! .... ఎంత ఎదిగిపోయావు !...నీ గురించిన నా ఆశల్ని, ఆశయాల్ని ఎంత నిజం చేశావ్ !! (అని దగ్గరకు తీసుకుంటాడు)

(వాకిట్లో ఎవరో "టంగుటూరి ప్రకాశం గారున్నారా?" అని పిలుపు)

మా లా కాలేజీ మాస్టర్లకంటె ఆయన దగ్గరే ఎక్కువ నేర్చుకున్నాను... ఆ మొహం మీద ఏమి వర్చస్సు ! ఆ కళ్లల్లో ఏమి వెలుగు!!

ఆయన అన్నాడొకసారి మమ్మల్నందర్నీ పిలిచి –

(ఈ acting area darken అవుతుంది... మరో elevated area లో లైట్లు.... అందులో దాదాభాయి)

**దాదాభాయి**

"Breathes there the man with soul so dead
Who to himself hath never said,
This is my land, my native land!"

I hope you have all heard those immortal lines of Sir Walter Scott. Every Indian should breath Indian air, talk Indian tongue, dream Indian dreams. Tell as many people as you can about our Sweet land - the land of wisdom, the land of philosophy and poetry and the land that allowed free thought and action...

**కంచుమర్తి**

(నవ్వి) 'లా' చదవడానికి పోయి రాజకీయాలు నేర్చుకొచ్చావన్న మాట! ఇంకా ఎన్నాళ్లుందిరా చదువు?

**ప్రకాశం**

ఎంతా? ఎనిమిది నెలలే?

**అయినాల**

అయిపోయాక ప్రాక్టీసుకు మంచి యిల్లు చూడాలి రాముడూ!

**కంచుమర్తి**

ఆ మాట ప్రకాశాన్ని చెప్పనీ.

**నాయుడు**

ఏం? ఎందుకు చెప్పదు?

**ప్రకాశం**

ఏం లేదు మాస్టారూ... నేను ఇక్కణ్ణుంచి వెళ్లేటప్పుడు ఎటు వంటి పరిస్థితులున్నాయో మీకు తెలుసు.. ఇక్కడి యీ రాజకీయాలు ! నన్ను కేసుల్లో

**ప్రకాశం**

ఎవరు?

**వార్తాహరుడు**

నన్ను కాకరపర్తి పీఠాధిపతులు పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ బోధానంద సరస్వతీ స్వాములవారు పంపారండీ ! పీఠాధిపతులు యీ సంజాయిషీ పత్రాన్ని మీకిచ్చి రమ్మన్నారు !... దీనికి తగిన సమాధానాన్ని వెంటనే స్వయంగా స్వామి వారికి సమర్పించమన్నారు ! (వారిలో వారికి కలకలం... అందరి ముఖాల మీద కోపం)

**అయినాల**

సంజాయిషీ పత్రం ! ప్రకాశానికి !!.... ఏమని రాశాట్ట? (శ్రీరాములు ప్రకాశం నుంచి సంజాయిషీ పత్రం తీసుకుని చదువుతాడు)

**శ్రీరాములు**

"కాకరపర్తి పీఠాధిపతులు పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ బోధానంద సరస్వతీ స్వాములవారు టంగుటూరి ప్రకాశానికి పంపిన తాఖీదు..."

**చిలకమర్తి**

ప్రకాశానికి తాఖీదా?....

**అయినాల**

(ఆ సంజాయిషీ పత్రాన్ని తీసుకుని, చదువుతూ) "మీరు ఈ మధ్యనే సముద్రయానం చేసి వచ్చారని విన్నాం... సముద్రయానం హిందూ మతానికి విరుద్ధం కనుక, తగిన ప్రాయశ్చిత్తం లేనిదే హిందూ సంఘంలో కలవకూడదు... మీరు తగిన ప్రాయశ్చిత్తం చేసు కోకపోతే హిందూ సంఘము నుంచి బహిష్కరింపబడుదురని తెలియచేయడమైనది. ఇందు విషయమై తగిన కర్మకాండ జరుపవలసిన అవసరము ఉన్నందున ఈ తాఖీదు అందిన వెంటనే మా ఎదుట నీవు హాజరు కావలసిందిగా ఆజ్ఞ.

ఇట్లు కాకరపర్తి పీఠాధిపతి."

**చిలకమర్తి**

న్యాపతి సుబ్బారావుగారు డాక్టరు సలహాపైన సముద్రయానం చేసి రావడానికి ఒప్పుకున్నది ఈయనే గదూ ! ఆయన శిష్యులకొక న్యాయం, పరాయివాడికొక న్యాయమా !

మనం కూడా మన అభిప్రాయం రాస్తే సరి !... ఇటువంటి తాఖీదులతోనే మనం కూపస్థ మండూకాల్లా ఉండిపోయాం... శ్రీరాములూ... కాగితం తీసుకుని సమాధానం రాయి.

"అయ్యా ! శంకర పీఠాధిపతిగారూ ! మీరెవరో నాకు తెలియదు.... మా పెద్దలెవరూ మీ అధికారాన్ని అంగీకరించిన దాఖలాలు లేవు... సముద్రయానం చెయ్యడం నేరమని మీ ఆరోపణ? నేను దాన్ని అంగీకరించడంలేదు...

పైగా నన్ను మీ ముందు హాజరు కమ్మని ఆజ్ఞనిచ్చారు... మీకు అటువంటి ఆజ్ఞ యిచ్చే అధికారం లేదు. మరొకసారి ఇటువంటి ఉత్తరం వస్తే మీ మీద క్రిమినల్ కేసు పెట్టవలసి వస్తుంది.

ఇట్లు

టంగుటూరి ప్రకాశం"

(ఉత్తరం తెచ్చిన అతనితో ) ఈ ఉత్తరం తీసుకొనిపోయి మీ పరివ్రాజకాచార్యుల వారికివ్వండి...

★ ★ ★

# ఎనిమిదవ దృశ్యం

## కథనం

### కథకుడు 1

ఏటివాలున పడి హాయిగా పోయే
కోటికోట్ల జనం మధ్య
ఏటికి ఎదురీదే మనషులే కొద్ది

### కథకుడు 2

అందులో ప్రకాశం మేటి.

### కథకుడు 1

ఒంగోలులో ప్రాక్టీసు వద్దని రాజమండ్రి
రాజమండ్రి కాదని మదరాసు

### కథకుడు 2

బారిస్టరుపాసయి మదరాసులో ప్రాక్టీసు
మూడేళ్లలో బార్‌కి నాయకుడు
లాజర్నల్ సంపాదకుడు

### కథకుడు 1

వాలస్, నేపియర్, శంకరన్ నాయర్, అబ్దుల్ రహీమ్ -
ఈ న్యాయాధిపతుల అన్యాయం పోకడల్ని
అణుమాత్రం కూడా సహించని అరిభయంకరుడు

**కథకుడు 2**

కేసుల పనుల మీద దేశమంతా తిరుగుతున్నా
మనసు మాత్రం జాతీయోద్యమం వైపు

**కథకుడు 1**

మనసు జాతీయోద్యమం వైపు మళ్లుతున్నా
మనిషి నిలువెల్లా మాతృమూర్తి వైపు

**కథకుడు 2**

మాతృమూర్తి - మనసు కోవెలలో
అనురాగ ధూప దీపాల మధ్య
ఆత్మ నివేదన అందుకునే అమ్మ -
ఆశీర్వదించే అమ్మ .....

★ ★ ★

**మద్రాసు, 1908**

(ప్రకాశం ఇంట్లో ముందు ఆఫీసు గది... దాని కెదురుగా మరోగది మనకు కనిపిస్తూ వుంటుంది... ఆయన దగ్గర అసిస్టెంటుగా పనిచేస్తున్న వెంకటరమణరావు ఏదో వివరణ చెబుతున్నాడు.... ప్రకాశం కళ్లు ఎదురుగా వున్న గుమ్మంమీదనే వున్నాయి... చాలా restless గా వున్నాడు... ఎదురుగుండా గదిలో డాక్టరు ఎవరినో పరీక్ష చెయ్యడం మసకగా కనిపిస్తుంది....)

**వెంకటరమణ**

(డాక్యుమెంటు చూపిస్తూ) నాయర్‌కు యీ హత్యకు సంబంధం లేదని మొదటి ముద్దాయి యిచ్చిన వాఙ్మూలం స్పష్టం చేస్తున్నది... హత్య జరిగిన కోయంబత్తూర్ స్టేషనులో మన ముద్దాయి వుండడం కాకతాళీయం.. ఇది వరకే పంజాబులో ఉద్దంసింగ్ vs. State లో సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పు మనకు అనుకూలంగా ఉంది సర్... ఇది కేసు history.

**ప్రకాశం**

తరువాత చదువుతాను రమణరావు.... మనసేం బాగులేదు.

**వెం.రావు**

ఏం జరిగిందండీ?

**ప్రకాశం**

ఉదయం అమ్మ గుడికి వెళ్లొస్తూ వాకిట్లో పడిపోయింది. డాక్టరు పరీక్ష చేస్తున్నాడు.. ఇది వరకు కూడా ఇట్లా nervous breakdown అప్పుడప్పుడూ వచ్చేదట - శ్రీరాములు చెబుతున్నాడు... ఏమవుతుందో?

**వెం.రావు**

పెద్దావిడ... She has lived a successful life...

**ప్రకాశం**

Successful life కాదు రమణరావు ! Meaningful life !! ఆవిడ మా కోసం చేసిన త్యాగాలు, పడ్డ కష్టాలు తలుచుకుంటే -

**వెం.రావు**

మరి యివ్వాళ Panagal Rajah గారి కేసు hearing కి వస్తున్నది, Sir.

**ప్రకాశం**

Adjournment కోసం పిటీషన్ పెట్టు.... I can't possibly leave her and come to the court...

**జానకిరామయ్య**

అన్నయ్యా ! టెలిగ్రాం వచ్చింది. (ఇస్తాడు)

**ప్రకాశం**

(చదువుతూ) "Don't fail to attend Surat Congress - to decide our strategy - Lala Lajpat Rai".

**వెం.రావు**

వెళ్లాలా?

**ప్రకాశం**

చూద్దాం... రేపు సాయంకాలం కదా ప్రయాణం. అప్పుడు అమ్మ స్థితిని చూసి decide చేద్దాం.. (లోపలికి వెడుతున్న జానకి రామయ్యని చూసి) ఒరేయ్ జానకీ ! అమ్మ దగ్గరికి వెళ్లడం లేదేరా పొద్దుట్నుంచీ?

**జానకి**

(బిక్కమొహంతో) భయమేస్తోందన్నయ్యా -

**ప్రకాశం**

ఛీ ! భయమెందుకురా? అమ్మ రేపటికల్లా కులాసాగా ఉండదూ? ఇంకా నీ చదువు కావాలి... మీ యిద్దరికీ పెళ్లిళ్లు చెయ్యాలి... ధైర్యంగా ఉండాలోయ్... (అంటూనే గాద్గదికం) పో ! పోయి అమ్మదగ్గర కూచో -

**జానకి**

నువ్వు కూర్చుంటే అమ్మకు ధైర్యంగా వుంటుంది, అన్నయ్యా! రాత్రి అమ్మ ఎందుకో నిద్రపోలేదసలు... సగం రాత్రి వేళ నన్ను లేపింది... మంచినీళ్లివ్వమంది... తాగుతూ... "నా రోజులు దగ్గరి కొచ్చినయ్‌రా" అంది... (ఏడుస్తాడు)

**వెం.రావు**

ఊరుకో జానకి రామయ్యా ! అమ్మకేమీ కాదు.

**ప్రకాశం**

వాడికి అమ్మలోకం తప్ప మరో లోకం తెలియదయ్యా ! (వెంకటరమణరావు వెడతాడు)

**కంచుమర్తి**

(చేతులో పేపర్లు... అందరూ సీరియస్‌గా వుండడం చూసి) ఏమయింది? ఏమయిందిరా ప్రకాశం?

**ప్రకాశం**

రాముడూ - అమ్మకి బాగాలేదు... లోపల డాక్టరు test చేస్తున్నాడు.

**కంచుమర్తి**

పొద్దున్న బావుందికదరా ! వదిన కాఫీ ఇస్తానంటే నువ్వసలే ఒట్టి మనిషివి కాదు, కూర్చో అంది.. తానే ముగ్గురికీ కాఫీ కలిపింది.

**ప్రకాశం**

మామూలుగా తొమ్మిది గంటల వేళ గుడికి వెళ్లింది- రోజూ లానే. వస్తూ మన మెట్ల మీద పడిపోయింది... లేవదీస్తే కాలూ, చెయ్యి ఎత్తలేక పోయింది.. ఎత్తుకుని మంచం మీద పడుకో బెట్టాం నేనూ, శ్రీరాములూ -

**కంచుమర్తి**

ఇంతేకదా ! slight paralytic stroke అయివుండాలి... పెద్దతనం-

**ప్రకాశం**

పెద్దతనం కన్నా... మా కోసం ఆవిడ పడ్డ కష్టమే –

**కంచుమర్తి**

అన్నట్లు సుంకురామ చెట్టి స్ట్రీట్‌లో నటేశన్ యిల్లు చూసిరమ్మన్నావుగా ! బావుంది ..అడ్వాన్స్ ఇచ్చి వచ్చాను.. ఇవిగో పేపర్స్ !

**ప్రకాశం**

అమ్మకి ఆ యిల్లు ఎంత నచ్చిందో ! మా వినోదరాయుడు పాలెంలో యిల్లులాగా వుందని ఎంత ఇదైపోయిందో ! ఆ యిల్లు ఆవిడ కోసమే కొందామని... అమ్మకి తగ్గగానే ఆ యింట్లోకి వెళ్లాలి... (డాక్టరుగారు వస్తారు)

**ప్రకాశం**

(దగ్గరకుపోయి) డాక్టర్...

**డాక్టర్**

ప్రకాశంగారూ ! stroke చాలా severe గా వచ్చింది... ఇంజక్షను ఇచ్చాను.. కాసేపటికి కొంచెం బావుండొచ్చు... Nervous system చాలా weaken అయిపోయింది... మరోసారి stroke వస్తే కష్టం... చాలా జాగ్రత్తగా ఉండాలి....

**ప్రకాశం**

మందులు?

**డాక్టర్**

ఆ ఇంజక్షను చాలు... రేపు మార్నింగ్ మరోటిస్తాను.. nerves smoothen అయి ఆవిడ నిద్రపోతే తొందర్లోనే improve కావచ్చు. Let's wait and see. రేపొచ్చి చూస్తాను. (బయలుదేరుతాడు.)

**ప్రకాశం**

(వెనుకనుంచి) డాక్టర్ ! .... రేపురాత్రికి బయలుదేరి Surat Congress కి వెళ్లాలి. వెళ్లమంటారా? వద్దంటారా?

**డాక్టర్**

ప్రకాశంగారూ ! ఏమిటి మీ పిచ్చి? మీరుండి చేసేదేం లేదు... పెద్దదయిందావిడ... చూద్దానికి మేం అందరం వున్నాం. Immediate గా problem లేదు... అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలి... అవసరం అయితే కబురు చెయ్యండి. (వెడతాడు.)

(జానకిరామయ్య డాక్టర్ box తీసుకుని ఆయన వెనకాల వెడతాడు. కాసేపు ఎవ్వరూ మాట్లాడరు)

**శ్రీరాములు**

(లోపలికి వస్తూ) అన్నయ్యా ! అమ్మచూపులు అదోలా ఉన్నాయి. నాకేదో భయంగా ఉందన్నయ్యా ! అమ్మ – (ఏడుస్తాడు)

**ప్రకాశం**

ఛా ! (దగ్గరకు తీసుకుని) డాక్టరుగారు చెప్పింది విన్నావుగా!... పెద్దదయి పోయింది, మనకందరికీ చేసి చేసి..

**శ్రీరాములు**

ఇంతవరకు ఏ కష్టం వచ్చినా అమ్మను తలుచుకుని "అమ్మా, Lead kindly Light" అని ప్రార్థించేవాణ్ణి ! ఆ కష్టం నుంచి గట్టెక్కేవాణ్ణి... ఇప్పుడు.. (బిగ్గరగా) అమ్మా ! Lead, kindly Light.... (ప్రకాశం, శ్రీరాములూ ఇద్దరూ కౌగిలించుకుని ఏడుస్తారు... జానిక రామయ్య వచ్చి ఇది చూసి బెంబేలు పడతాడు.)

**జానకి**

(ఏడుస్తూ) అన్నయ్యా !

**ప్రకాశం**

(తమాయించుకొని) ఏమీలేదురా... ఏదో జ్ఞాపకానికొచ్చి... పదండి... అమ్మ దగ్గరకి వెడదాం... రాముడూ ! నాలుగు రోజులు ఉండేటట్లు వచ్చావా?

**కంచుమర్తి**

అమ్మకి యిట్లా వుంటే ఎట్లా వెళ్లగలనురా?

**ప్రకాశం**

రేపురాత్రి టిక్కెటు కాన్సిల్ చెయ్యమని గుమాస్తాతో చెప్పు...

**కంచుమర్తి**

ఎందుకురా? నేనున్నాను.. శ్రీరాములున్నాడు... వదిన వుంది... నువ్వు వెళ్లినా అయిదారు రోజులేగా? డాక్టరు గారేమో ఫరవాలేదన్నారు...

**శ్రీరాములు**

అవునన్నయ్యా ! ఇన్ని ఏర్పాట్లు చేసుకుని మానుకోడం ఎందుకు? పైగా లాలా లజపతిరాయ్ గారి టెలిగ్రాం... రాముడన్నయ్య ఉన్నాడుగా !

(లోపల ఏదో కింద పడ్డచప్పుడు.. ఏమైంది, ఏమైంది... అని అందరూ గదిలోకి వెడతారు... లేవబోయినతల్లి మంచం మీది నుంచి పడిపోయింది... అందరూ కలిసి మంచంమీద పడుకోబెడతారు)

**ప్రకాశం**

అమ్మా ! నువ్వెందుకు లేచావే !..

**తల్లి**

(ఆయాసపడుతూ) నీ దగ్గరికే రావాలని... డాక్టరే మంటాడు?

**ప్రకాశం**

నరాల బలహీనత.. ఏమీ లేదు. అన్నాడు.. బాగా విశ్రాంతి తీసుకోవాలన్నాడు.

**తల్లి**

విశ్రాంతికాక నాకేమిటి?.. పెద్దవాడా ! రేపురాత్రికి –

**ప్రకాశం**

లేదమ్మా ! వెళ్లను...

**తల్లి**

వెర్రి నాగన్నా ! నేనప్పుడే ఏమీ అయిపోనురా... కోడలి కడుపున కాయ కాస్తోంది.. మీ నాన్నగారు పుడుతున్నారురా!.. వాణ్ణి (చెంపలు వేసుకుని) ఆయన్ని చూసికాని పోను.. సరా? (ఆయాసం)

**శ్రీరాములు**

అమ్మా ! నువ్వాయసపడకు... డాక్టరుగారు విశ్రాంతి చాలా అవసరమన్నారు.

**ప్రకాశం**

అమ్మా ! జానకిరాముడు బెంగపడుతున్నాడు. వాణ్ణి చూడమ్మా!

**తల్లి**

ఒరే జానకీ ! ఇటురా (ఏడుస్తూ తల్లి పక్కకు పోయి కూర్చుంటాడు) ఒరే చిన్నీ ! శ్రీరాముల్ని, నిన్ను చూస్తే నాకు దిగులు లేదురా ! మీకిద్దరికీ అన్నయ్య వున్నాడు... అన్నయ్యని చూస్తేనే రా నాకు దిగులు. వాడికెవ్వరూ లేరు..

**ప్రకాశం**

(దూరంగా అటువైపు తిరిగి, ఏడుస్తూ) అమ్మా !

**తల్లి**

(పిలుస్తూ) ఒరేయ్ !... జడ్జీల ముందు ఘుమికీలు తీస్తావుటగా! అంత బెంబేలు పడతావేరా? నువ్వు మనవాళ్లందర్నీ కనిపెట్టుకుని వుంటావ్. నాకు తెలుసు.. మన పాలిటి దేవుడు - మాస్టరుగారిని వాళ్ల పిల్లల్ని కూడా చూడు.

**ప్రకాశం**

మాస్టరుగార్ని తీసుకురమ్మని భీమ శంకరాన్ని పంపానే !

**తల్లి**

నాకు తెలుసురా !... మనిషి మొట్టమొదట నేర్చుకోవాల్సిన గుణం కృతజ్ఞత. (లేవడానికి ప్రయత్నిస్తుంది)

**కంచుమర్తి**

(పట్టుకుంటాడు) పిన్నీ !

**తల్లి**

(మెల్లిగా లేచి, తలగడ కింద చీరెకు కట్టిన డబ్బుతీసి. ప్రకాశాన్ని తన పక్కన కూర్చోమని సైగ చేసి) ఒరే బాబూ ! నువ్వు బోలెడంత సంపాదిస్తున్నావ్ ! ఇది నీకు అక్కర్లా.. ఇదుగో ! ఇవి ఎనిమిది వందల రూపాయాలు.. కాస్త డబ్బే!... మీకు ఎప్పటికి ఏం అవసరం వుంటుందో అని దాచి పెట్టాను... ఈ డబ్బుతో దేశానికి ఉపయోగపడే మంచిపని చెయ్యి.

**ప్రకాశం**

అమ్మా ! నువ్వు మాకు జన్మనిచ్చావు.. మాకు తల్లీ, తండ్రీ, అన్నా, తమ్ముడూ సర్వస్వం అయి పెంచావు... మా కోసం పూలమ్మిన చోట కట్టెలమ్మావు ! అవన్నీకాక యీ డబ్బు కూడబెట్టి -

**తల్లి**

ఒరే ! అవన్నీ మీకోసం చెయ్య లేదురా! నా కోసం - నా కోసం చేసుకున్నాను... ఈ సుబ్బమ్మ కొడుకులు పనికి రాని వాళ్లని అందరూ అనుకుంటారేమోనని కడుపు కట్టుకుని పెంచాను.. ఆ స్వామి దయ దలిచి నాయుడు బాబును నా తండ్రికి చూపించాడు.. ఈ రోజు కోసమే ఎదురు చూస్తున్నాను. కోడలి కడుపున కాయకాస్తే ఇహ.. నిశ్చింతగా పోతాను..

(దగ్గుతెర... ఆయాసం.. శ్రీరాములు నీళ్లు తెచ్చి మెల్లగా ఆమె గొంతులో పోస్తాడు.. జానకిరామయ్య కంచుమర్తి కౌగిలిలో ఒదిగిపోతాడు.. చేతిలో వున్న 800 రూపాయిలు చూసుకొని ప్రకాశం భోరున ఏడుస్తాడు...)

★ ★ ★

# తొమ్మిదవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

న్యాయవాద వృత్తిలో నైతిక మూల్యాలు ఆలంబనగా
తల్లి పరోపకారత్వం ఉద్దీపనగా
నాయుడుగారి నిర్భయ జాతీయత స్థాయీ భావంగా
దేశభక్తి రసస్ఫూర్తిని ఆవిష్కరించుకున్నాడు ప్రకాశం.

**కథకుడు 2**

గాంధీజీ సత్యాగ్రహ ప్రమాణ పత్రం మీద మొదటి సంతకం ప్రకాశం
వందేమాతర వీరుడు బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలకు ఆధ్యక్షం ప్రకాశం.

**కథకుడు 1**

1921. న్యాయవాద వృత్తిని వదిలి జాతీయోద్యమ సైనికుడైనాడు.
ఉద్యమానికి అద్దంపట్టే 'స్వరాజ్య' పత్రిక పెట్టాడు.

**కథకుడు 2**

పేరున్న జర్నలిస్టు పేరు చెప్పు –
ప్రతివాడూ 'స్వరాజ్య'లో ఓనమాలు దిద్దినవాడే !
జి.వి. కృపానిధి. ఖాసా సుబ్బారావు, కోటంరాజు పున్నయ్య, చలపతిరావు...

**కథకుడు 1**

1922. పన్నుల నిరాకరణోద్యమం, పెదనందిపాడులో.

**కథకుడు 2**

బ్రిటిషువాడి ఫిరంగి గుండుకు తన ఉక్కు గుండెను పణం పెట్టి
ఎదురు సవాలు చేశాడు తెలుగువాడు.

**కథకుడు 1**

అది నినదించిన పెదనందిపాడు; ఎదురొడ్డిన మించాలపాడు.
ఒకచోట పర్వతనేని వీరయ్య; మరోచోట కన్నెగంటి హనుమంతు.
ఎన్నో... ఎన్నెన్నో... చరిత్ర పుటల్లో చెరిగిపోని రక్తాక్షరాల సంతకాలు....

**కథకుడు 2**

1928. ఎక్కడ చూసిన ప్రకాశమే. తెలుగు వారి ఏకైక నాయకుడు.

**కథకుడు 1**

రాజకీయ రంగంలో రణశూరుడు
త్యాగంతో పునీతుడై నిష్కామ ధవళ వస్త్రం ధరించి
సత్యాగ్రహ యజ్ఞానికి ఋత్విక్కయి వెడుతున్న సామ్యవాది ప్రకాశం

**కథకుడు 2**

ఉన్నది సర్వస్వం - కాస్తా కూస్తానా? -
దేశం అంతటా వెలలేని ఆస్తులు
దబ్బూ, దస్కం - కీర్తీ - ప్రతిష్టా -
బంగారు గుడ్లు పెట్టే న్యాయవాద వృత్తీ -

**కథకుడు 1**

అన్నిటినీ వదులుకొని
చిరిగిన చొక్కా - పస్తున్నా వెరకని డొక్కా
చేతులో చిల్లికానీ అయినా వుండని
ఆర్తజన కుబేరుడు ప్రకాశం...

**కథకుడు 2**

సైమన్ కమీషన్, ఉప్పు సత్యాగ్రహం - ఏదయితేనేం?
ప్రతి ఉద్యమ నిర్వహణంలోనూ తానే నాయకుడు, తానే సేవకుడు -

**కథకుడు 1**

ముందు నిలిచి, గుండెనిచ్చి
నా తరువాతే నా వాళ్లమీద అత్యాచారం
అని గర్జించే నాయకుడెవడున్నాడీ దేశంలో?

**కథకుడు 2**

ఈ ఉద్యమ చరిత్ర ప్రకాశం ఉద్విగ్న చరిత్ర.

**కథకుడు 1**

ప్రకాశం ఉజ్వల చరిత్ర.

★ ★ ★

**మద్రాసు, 1928**

(నాలుగు వైపుల నుంచి గుంపులు గుంపులుగా జనం చేరతారు.
గోబాక్ సైమన్ – సైమన్ గోబాక్" అని అరుస్తూ. ఉద్యమ కార్యకర్తలు పాడుకుంటూ వస్తారు)

**కార్యకర్తలు**

కొయ్యోడ కొయ్యోడ కొయ్యోడ
ఓ రయ్యో కొయ్యోడ ॥
ఓ రయ్యో జాను సైమనూ
గో బాక్ టు లండనూ ॥ (సైమన్ ... గో.. బాక్.. నినాదాలు)
సైమనూ – నువు తిరుగుటపా కట్టరో రయ్యో కొయ్యోడ
నీకేమి పోయె కాలంరో రయ్యో కొయ్యోడ
నువ్వూరూరు తిరుగుతావ్‌ట కొయ్యోడ
నువ్వు చెప్పిందే యేదమంట కొయ్యోడ
ఏడ్గురు తెల్లోళ్లు కలిసి
ఏడుకోట్ల ఇండియన్ల
జాతకాలు చెబుతార్రా కొయ్యోడ
చాలు చాలింక నీ పొగరు

ఈ దేశమంటె నీకింత

చిన్న చూపు దేనికిరో　　　　రయ్యో కొయ్యోద ॥

ఎటు చూసిన టంగుటూరె　　　　అయ్యో కొయ్యోద ॥

ఈ మదరాసును ఊపేసిన　　　　”

మొనగాడె అతగాడుర　　　　”

ఆయన ముందుండి నడిపిస్తే　　　　కొయ్యోద

ఇట్టి సైమన్లు గియిమన్లు

మట్టి కొట్టుకు పోతార్రో　　　　రయ్యోకొయ్యోద ॥..

(సైమన్ ... గో... బాక్... అంటూ నినాదాలు)

(గుంపులు గుంపులుగా జనం చేరుతున్నారు... అందులో కొందరు జైజై నినాదాలు చేస్తున్నారు... ఛీఫ్ ప్రెసిడెన్సీ మాజిస్ట్రేట్ పటాలే - పోలీస్ కమీషనర్ కన్నింగ్ హామ్, ఒక తెల్ల జడ్జి దేవిస్, పోలీసులు వస్తారు. దూరంగా నినాదాలు.. జనం పరుగెడుతున్న చప్పుడు...)

**పటాలే**

ఏమిటా చప్పుడు, పోలీస్ కమీషనర్?

**కన్నింగ్‌హామ్**

జనం అంతకంతకీ ఎక్కువవుతున్నార్ మిస్టర్ మాజిస్ట్రేట్..

**పటాలే**

మీరేమంటారు జస్టిస్ దేవిస్?

**దేవిస్**

The crowd is surging... People from all sides assembling near the Fort.. మీరు జాగ్రత్తగా ఉండవలె, మాజిస్ట్రేట్ గారూ !

**పటాలే**

వాళ్లందర్నీ ఒకచోట గుమిగూడవద్దని చెప్పండి. 144వ సెక్షను ఉన్నదని చెప్పండి.

**పో.కమీషనర్**

అందరూ ఇక్కడ్నుంచి వెళ్లిపొండి.. ఒకచోట ఉండకూడదు.. 144వ సెక్షను విధించాం.. Disperse (ఇంకా జనం వస్తూ వుంటారు)

**డేవిస్**

ఏమిది? ఒక్కరూ పోవడము లేదు... మద్రాసు మద్రాసంతా బజార్లలోనే వున్నదా యేమి? (తెరలో గలభా.. సైమన్ గో బాక్ అని అరుపులు... సైమన్ డౌన్ డౌన్... స్వరాజ్యం మా జన్మ హక్కు... నినాదాలు)

**డేవిస్**

ఇంకా ఊరుకుంటారేమి పటాలేగారూ? ఏదో ఒక చర్య తీసుకోవాలి....

**పో.కమీషనర్**

మీరంతా ఎక్కడి వాళ్లక్కడ నుంచి వెళ్లకపోతే కాల్పులు తప్పవు... Go away... Disperse... Otherwise the police will open fire వెళ్లండి, వెళ్లండి...

(మళ్లీ గలభా... తోసుకుంటూ వుంటారు... పోలీసులు రంగంలోకి దిగారు... ఇద్దరు ముగ్గుర్ని కొట్టారు.. వాళ్ల నినాదాలు.. ఇంకా జనం...)

**డేవిస్**

వాళ్లు మన మీదికే వస్తున్నట్లున్నారు, Mr. Patale... Do something (మళ్లీ నినాదాలు.)

**పటాలే**

గాలిలోకి పేల్చండి...

**డేవిస్**

గాలిలోకి, ఆకాశంలోకి పేలిస్తే వాళ్లు ఊరుకుంటారా అండీ? (నినాదాలు, మరీ దగ్గరగా)

**పో.కమీషనర్**

Attention ! (బూట్లు attention చప్పుడు) Take Positions... Ready to shoot!... (అందరూ పొజిషన్స్‌లో నిలబడ్డారు) అందరూ వెళ్లిపోండి. ఏ క్షణాన్నయినా కాల్పులు జరపొచ్చు.. (ఆకస్మాత్తుగా ఒక గన్ పేలింది.. ఒక యువకుడు 'అమ్మా' అంటూ పడిపోయాడు. జనమంతా 'అయ్యో' 'కాల్చారు' 'చచ్చిపోయుంటాడు'

'అయ్యో ! పిల్లాడే పాపం' 'వీళ్ల జిమ్మడ'.... అంటారు. జనం కుర్రవాడి చుట్టూ గుమి కూడతారు...)

**గుంపులోఒకడు**

(కోపంగా) ఎవ్వరూ ఏమీ అనకుండా ఎందుకు కాల్చావయ్యా!

**రెండోవాడు**

ఒట్టి పుణ్యానికి కాల్చావు గదయ్యా !

**మూడు**

పిల్లాడి ప్రాణాల్ని నీ ఎదాన పెట్టు కున్నావు కదయ్యా!.. నీకు పిల్లలు లేరూ?

**మరొకడు**

కాసిని నీళ్లు తీసుకురండి...

**పో.కమీషనర్**

కామోష్... ఎవ్వరూ దగ్గరకు రాకండి.. మళ్లీ కాల్పులు జరుపుతాం... వెళ్లండి, వెళ్లండి... Get away... disperse (ప్రకాశం వచ్చాడు.. ప్రకాశం, విజయరామరాజు, కొండా వెంకటప్పయ్య వచ్చారు)

**ప్రకాశం**

ఏం జరిగింది Commissioner?

**పో.కమీషనర్**

Alert చేసి, disperse కమ్మన్నాం... కాలేదు..

**ప్రకాశం**

అందుకని నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు... నల్లవాడి ప్రాణాలంటే మీకంత తేలిగ్గా ఉన్నాయా కమీషనర్?... షూట్ చెయ్యడానికి ఆర్డర్స్ ఉన్నాయా?

**పో.కమీషనర్**

Yes, Sir, Chief Presidency Magistrate Mr. Patale...

**పటాలే**

Mr. Prakasam! నేను గాలిలోకి షూట్ చెయ్యమన్నాను... జనాన్ని భయపెట్టడానికే! కాలుస్తారనుకోలేదు...

**ప్రకాశం**

What a shame ! నేనా చనిపోయిన అతన్ని చూడాలి. (రెండడుగులు వేస్తాడు)

**పో.కమీషనర్**

No, Sir... చూడ్డానికి వీలులేదు..

**ప్రకాశం**

What ! నేను చూసి తీరాలి. (మరో రెండు అడుగులు వేస్తాడు)

**కానిస్టేబుల్**

(తుపాకిని ఆయన గుండెలకు ఎదురుగా గురిపెట్టి) మీరు మరో అడుగు ముందుకు వేస్తే మిమ్మల్ని షూట్ చెయ్యవలసి వుంటుంది.

**ప్రకాశం**

చంపరా, చంపు... షూట్ చెయ్యి... దమ్ములుంటే షూట్ చెయ్యరా ! (అని గుండె చూపుతాడు)

**కొండా**

ఎంత ధైర్యంరా నీకు?

**రాజు**

ఆయన ఎవరునుకున్నావురా?... ఆయన ప్రకాశం పంతులు గారురా ! ఆయన్ని చంపుతావురా?.. ఆయన ఆంధ్రకేసరి రా... చంపు.. ఎట్లా చంపుతావో చంపు.

(జనం అంతా 'ప్రకాశం పంతులుగారికి జై. ఆంధ్రకేసరికి జై, అంటూ నినాదాలు చేస్తారు)

**ప్రకాశం**

(మెల్లగా ఆ యువకుడి శవాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని) ఒరేయ్, వీడు మన వాలంటీరు పార్ధసారధి రా!! ఒరేయ్ ఒరేయ్ పార్ధసారధి ! ఇక్కడి కెందుకువచ్చావురా?.. ముసలాళ్లందర్నీ ఈ పాపిష్టి ప్రభుత్వం కింద బతకమని శపించి నువ్వు స్వేచ్ఛగా వెళ్లిపోయావు కదూ ! నువ్వురా వీరుడివి.. you are a martyr!! (కమీషనర్ ప్రకాశం వైపు తిరిగి) కన్నింగ్ హామ్ ! నువ్వేం చేశావో తెలుసా? You have nipped a rose in the bud !! పాపం ! ఆ అమాయకుడు

మిమ్మల్నేం చేశాదురా ! (ప్రకాశం పార్ధ సారధిని తీసుకుని ముందుకు నడుస్తాడు. ఆయన వెంట గుంపు రాను రానూ పెద్దదై పోతుంది... అందరూ - స్వతంత్ర భారత్ కీ జై' ఆంధ్ర కేసరీ జిందాబాద్... పార్ధసారధీ అమర్ హై...)

(ఈ నినాదాలను చీల్చుకుంటూ)

పరిపాలించు ప్రభుల్ ప్రజాతతి శిరః పంక్తుల్ విదారించి యం
బరమంటన్నెగ జిమ్ము కాలమున సమ్రాడ్వర్గ ముద్రాంతమై
పరవన్ రొమ్మిడి యగ్నిగో ళికలకున్ వారించి మా యాంధ్రకే
సరి గర్జానినదంబు చావదు సహస్ర బ్రహ్మ కల్పాంతముల్...

– శ్రీ జాషువా

★ ★ ★

# పదవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

జనం నాడి పట్టుకోవడంలో గాంధీ గారిది ప్రత్యేకత.

**కథకుడు 2**

పన్నుల నిరాకరణ, సైమన్ రాకకు వ్యతిరేకత
ఇవి ఉద్యమాలే - కాని ప్రజల జీవితాల లోలోతుల్ని తరచలేదు
వాళ్ల జీవన తంత్రుల్ని మీటలేదు

**కథకుడు 1**

ఉప్పు ప్రతిమనిషి భుక్తికీ ప్రాణం - అది రుచి.
దాని అవసరం సామాన్యుడికి తెలుసు

**కథకుడు 2**

సామాన్యుడి అవసరాన్ని రాజకీయంలో ఉపయోగించడం గాంధీకే తెలుసు.

**కథకుడు 1**

అందుకే ఉప్పు సత్యాగ్రహం సమతా సత్యాగ్రహం
సామాన్యుల్ని సమర వీరుల్ని చేసిన సత్యాగ్రహం

**కథకుడు 2**

మద్రాసు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి లేదని
రాజాజీ వేదారణ్యం వెడితే
మద్రాసే యుద్ధభూమి - ముందుకు నడవండంటూ
ప్రజలందర్నీ ఆయత్తం చేసిన ప్రజానాయకుడు ప్రకాశం.

**కథకుడు 1**

ఉదయవనం కాంపులో - ఉప్పు తయారీ శిబిరం
మదరాసు ఉద్యమంతో దక్షిణ భారత సమరం.

★ ★ ★

**మద్రాసు బీచ్, 1930**

(ఉదయవనం కాంపునుంచి ప్రకాశం నాయకత్వాన ఊరేగింపు.. ప్రకాశం, కాశీనాథుని, గద్దె రంగయ్యనాయుడు, దుర్గాబాయి ప్రభృతులు.. ముందు కోలాటం పాటలో అబ్బాయిలు, అమ్మాయిలు..)

బృందగానం

పోదాము - స్వరాజ్య లక్ష్మి పెండ్లి చూడ
రారే రమణులార - రారే సదయులార ॥ పోదాము ॥
ముత్యాల ముగ్గులు - రత్నాల తోరణాల్
మాణిక్యాల పంట - మన లక్ష్మి పెండ్లి... ॥ పోదాము ॥
సంద్రమే పెళ్లిల్లట - సదస్యులు దేవతలంట
ఉప్పే తలంబ్రాల్ట - మన లక్ష్మి పెండ్లికి ॥ పోదాము ॥
గాంధి వశిష్టంట - కస్తురమ్మ ముత్తైదంట
పరమాత్మ సాక్షిటా - మన లక్ష్మి పెండ్లికి ॥ పోదాము ॥

(శ్రీ బసవరాజు అప్పారావు)

(సముద్రం దగ్గరకి పోతారు...)

**ప్రకాశం**

సోదరులారా ! మద్రాసు వీర పౌరులారా !! ఉదయవనం కాంపును ఉత్తమంగా నడుపుకుంటున్నాం. ఈ ఉప్పు సత్యాగ్రహాన్ని శాంతియుతంగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ఎన్నో రకాలుగా మనల్ని రెచ్చగొట్టి, హింసా మార్గంలోకి దించడానికి ప్రయత్నిస్తున్నది.. మనం అందరం అప్రమత్తులమై ఉండాలి... ఎవరు ఏం చేసినా, మనం ఉలకద్దు. పలకద్దు.. మన లక్ష్యం ఒక్కటే - ఉప్పు చెయ్యడం, ఉప్పు పోగు చెయ్యడం. అందరూ బయలు దేరండి..

(నీటిని లోతట్టు ప్రాంతాలకు తరలించి ఉప్పుచేస్తూ వుంటారు కొందరు.. మరి కొందరు మెరకగా ఉన్నచోట ఉప్పును పోగు చేస్తూ వుంటారు..)

జనం : పోగు చెయ్... పోగు చెయ్
పోగు చెయ్... పోగు చెయ్
ఉప్పు చేసుకుంటేను ముప్పులొస్తాయంట
ఉప్పయినా లేకుండా ఉంటామా?
ఉప్పు చేస్కుంటేనే చస్తామా? ॥ పోగు చెయ్ పోగు చెయ్ ॥
ఉప్పు చేస్కుందాము ఉరిశిక్ష వేసినా
ఉప్పు చేయుట మానుకుంటామా?
ఉప్పయినా లేకుండా తింటామా?
ఉప్పు చేస్కుంటేనే చస్తామా? ॥ పోగు చెయ్ ॥
ఉప్పు కల్లూ వేసి ఉడుకుడుకు గంజీతో
దప్పి కార్తుందంటె తప్పేమీ?
ముప్పు లెన్నొచ్చినా పోతామా?
ఉప్పు కూడా వీడి సొమ్మేనా? ॥ పోగుచెయ్ పోగుచెయ్॥

(దూరంగా మిలటరీ మార్చ్ వినబడుతుంది.. అది దగ్గరకు వచ్చిన కొద్దీ పాటల స్థాయి పెరుగుతుంది.. వాళ్లు దగ్గరకు రావడం చూసి)

**ప్రకాశం**

సోదర సోదరీమణులారా !

నిత్య జీవితానికి అన్నం ఆధారం. అన్నానికి ఉప్పు ఆధారం... అటువంటి జన్మాధారమైన ఉప్పుమీద పన్ను వెయ్యడం మన జాతికే అవమానం.. మనం ఉప్పు చేస్తున్నందుకు ఎవ్వరికీ భయపడవలసిన అవసరం లేదు.. నిలుచున్న చోటనే ఉండి మన పని మనం చేసుకుపోదాం...

(అందరూ బోలో స్వతంత్ర భారత్‌కు జై, మహాత్మాగాంధీకి జై, ఆంధ్రా కేసరికి జై అంటూ నినాదాలు. పోలీసులు దగ్గరగా వచ్చారు.)

(జనం అందరూ హర్షధ్వానాల మధ్య "ఉప్పు చేశాం! ఇదుగో.. ఉప్పు పోగు చేశాం ఇదుగో –" అంటూ అరుస్తారు.

**ఒకకార్యకర్త**

ఉప్పు చేశామిదుగొ చూడండి - శ్రీ గాంధి చెప్పిన

ఉప్పు చేశామిదుగొ చూడండి ”

ఉప్పు చేశామిదుగో దేవతలుప్పరంబుననుండి హర్షము

లుప్పతిల్లగ పుష్ప వర్షము గుప్పుచును ఆశీర్వదింపగ ॥ఉప్పు ॥

దండి పుణ్యక్షేత్రమున - ఉద్దండ సాహసుడగు మహాత్ముడు

దండి బలవతు లాంగి లేయులు బెందువడి తెలతెల్లవోవగ ॥ఉప్పు ॥

(మార్చ్.. ఉప్పు చెయ్యనివ్వకండి... ఆ కుండలు బద్దలు కొట్టండి...” అని పోలీసు ఆర్డరు.. పాట ఇంకా బిగ్గరగా)

ఉప్పు చేశామిదుగో చూడండి - శ్రీ గాంధి చెప్పిన

ఉప్పు చేశామిదుగో చూడండి...

**పోలీసులు**

లేవండి... అందరూ ఇక్కణ్ణుంచి పొండి.. చలేజావ్...

పాట (అందరూ)

ఉప్పు చేశామిదుగో చూడిండి..

**పోలీసులు**

మారో మారోమారొ మారో మారో...

పొండి పొండయ్యా పొండి దెబ్బ లెందుకు తింటారు?

లెండి లెండయ్యా లెండి.. మీగ్గాదు చెప్పేది?

ఊఁ మారో మారో మారో...

**పాట (అందరూ)**

మదరాసు నగరము యుద్ధ సన్నద్ధమ్ము కాదని

మాన్యులందరు తరలిపోవగ

ఉక్కుపిడుగై టంగుటూరే ఉప్పు పన్నును ధిక్కరించెను ॥ఉప్పు చేశా ॥

**పోలీసులు**

పొండి పొండయ్యా పొండి దెబ్బలెందుకు తింటారు?

లెండి లెండయ్య లెండి... మీ గ్గాదుచెప్పేది?

**జనం**

ఉప్పు చేశామిదుగొ చూడండి...

**పోలీసులు**

మదమెక్కి ఈళ్లంతా చేత్తుండారీ గోల

యదవలంట్రా మనం చూత్తూరు కుంటాన్కి?

మారో మారో మారో మారు...

(వందే మాతరం.. వందే మాతరం అని నినాదాలు)

**ప్రకాశం**

భయపడకండి... ఈ పోరాటం ధర్మ పోరాటం.. ఈ పోరాటం ఆగదు.. దేశంలో ఉన్న జనం అందర్నీ జైలు పాలు చేసినా యీ శాంతి సమరం ఆగదు.. ఈ సత్యాగ్రహం ఆగదు.. ఈ తెల్లదొరతనం మాకొద్దని నిర్భయంగా నినదించండి...

**పాట**

మాకొద్దీ తెల్లదొరతనము - దేవ

మా కొద్దీ తెల్ల దొరతనము

మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె॥మాకొద్దీ॥

పన్నెండు దేశాలు పండుచున్నవి గాని

పట్టెడన్నమె లోపమండి?

ఉప్పు ముట్టుకుంటె దోషమండి

నోట మట్టికొట్టి పోతాడండీ

అయ్యో, కుక్కలతో పోరాడికూడుతింటాడండి ॥మాకొద్ది॥

నూటనలుబదినాల్గు నోటికి తగిలించి

మాటలాడ వద్దంటాడు

మమ్ము పాట పాడవద్దంటాడు

తనను దాటి వెళ్లవద్దంటాడు.

అయ్యో చేటు తెచ్చుకు మమ్ము చెడిపోవమంటాడు॥మాకొద్దీ॥

(శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ)

(ఈ పాట జరుగుతుండగా ప్రకాశం అరెస్టు జరుగుతుంది.. దుర్గాబాయి ముందుకు వస్తుంది. ఒక వాలంటీరు ఆమె తలమీద గాంధీ టోపీ పెడతాడు.. అందరూ జయ జయ ధ్వానాలు చేస్తారు.. దుర్గాబాయి 'మా కొద్దీ తెల్ల దొరతనము' పాట అందుకుని పాడుతూ ఉంటుంది. అందరూ పాట అందుకుని పాడుకుంటూ నిష్క్రమిస్తారు.)

★ ★ ★

# పదకొండవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

ఉద్యమానికీ ఉద్యమానికీ మధ్య
శాసనసభలూ, మంత్రిత్వాలు విరామం లాంటివి.

**కథకుడు 2**

కొందరికి విరామం; కొందరికి ఆరాటం..
మరి కొందరి కంతటా అవిశ్రాంత పోరాటం.

**కథకుడు 1**

ఉద్యమాలకు దూరంగా ఉండే వినాయకులు
మంత్రిత్వాలు వచ్చేసరికి ముందు వరుసలో నిలుస్తారు

**కథకుడు 2**

రాష్ట్రమంతటా అభ్యర్థుల్ని ఎంపిక చేసిన రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు
ఎక్కడ నిలబడాలీ – అని
అసలు నిలబడనివ్వాలా వద్దా అని మీమాంస.

**కథకుడు 1**

రాష్ట్రం అంతా నిరసన తెలిపితే కాని
ప్రకాశానికి రాలేదు మద్రాసు సీటు.

**కథకుడు 2**

1936. ఎన్నికలు జరిగాయి.

ఆంధ్రులు ముప్పాతిక మువ్వీసం గెలిచారు.

అందరూ ఆమోదించే నాయకుణ్ణి ఎన్నుకోవడం కోసం కలిశారు !

**కథకుడు 1**

ఆంధ్రులందరికీ ఆమోద యోగ్యమైన నాయకుడా?

ఈ గడ్డమీద పుట్టిన ప్రతివాడూ నాయకుడేగా ?

**కథకుడు 2**

మూడు సార్లు కలిశారు. ఏకగ్రీవం కుదరదని ఏకగ్రీవంగా తీర్మానం.

**కథకుడు 1**

ఆ నాటి రాత్రి – తెలుగువాణ్ణి మద్రాసు ప్రధానిగా

ఎన్నుకోవడంలో విఫలమైన ఆ రాత్రి –

ఆంధ్రుల అఖిల భారత నేతృత్వాన్ని

చేజేతులా అంధకారమయం చేసింది.

**కథకుడు 2**

అందుకే రాజాజీ చెన్నరాష్ట్ర ప్రధాని

**కథకుడు 1**

ఇవ్వక తప్పక ప్రకాశానికి రెవిన్యూ మంత్రిత్వం.

**కథకుడు 2**

ప్రకాశం ప్రకాశమే ఎక్కడైనా

జమీందారీ రద్దుకోసం – రైతుల సంక్షేమం కోసం

18 సంపుటాల రైతు భారతం కూర్చాడు.

వ్యతిరేక శక్తుల ఆజన్మాంత శత్రుత్వానికి కూడా సిద్ధపడి

జమీందారీ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టాడు.

★ ★ ★

**మదరాసు అసెంబ్లీ, 1936**

(అసెంబ్లీలో ప్రకాశం గారు... సభాపతి సాంబమూర్తిగారు, ప్రధాని రాజాజీ మాత్రం వెలుగులో - (ప్రకాశంగారు మాట్లాడుతూ వుంటారు)...

**ప్రకాశం**

అధ్యక్షా ! ఈ విధాన సభ వారు నియమించిన ఉపసంఘం పక్షాన రెండు నెలల కిందట ఆ సంఘ నివేదికను మీకు సమర్పించాను. 15 నెలలపాటు రాష్ట్ర మంతటా తిరిగి ఎందరో రైతుల, జమీందారుల, ప్రజల అభిప్రాయాలను సేకరించాం.. వాటిని క్రోడీకరించి 18 సంపుటాల్లో యీ జమీందారీ సమస్యమీద సర్వ విషయాలను నిక్షిప్తం చేశాం. ఈ నివేదికను శాసన సభకు అంద చేసే ముందు, కొందరు తమ హక్కులకు భంగం వాటిల్లుతుందన్న భయంతో దీన్ని రహస్యంగా ఉంచవలసిందంటూ ప్రయత్నాలు చేసినారు.. వారి ప్రయత్నాలు, పాపం, ఫలించలేదు.. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఈ ముఖ్యమైన బిల్లును - రాష్ట్రంలోని 5 లక్షల జమీందారీ రైతులకు అత్యంత ప్రాధాన్యమయిన యీ నివేదికను సభముందు రాకుండా చేయాలని సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేశారు. అవి కూడా ఫలించలేదు.

అధ్యక్షా ! ఈ నివేదికలో - పండించే రైతులదే భూమి అనీ, నీటి వనరులన్నీ ప్రభుత్వానివనీ, అందరికీ సమంగా యీ వనరులు అందవలెననీ ఇటువంటి అనేక అంశాలను మీ ముందుంచాము. వీనిని ఆమోదిస్తే భారతదేశంలో గ్రామ స్వరాజ్యానికి రైతు రాజ్యానికి మనమే అంకురార్పణ చేసినట్లవుతుంది..

దీనిని అమోదించవలసిందిగా మిత్రులకు మనవి చేస్తున్నాను.

(ఫేడ్ అవుట్)

★ ★ ★

# పన్నెండవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

1942. ప్రపంచ యుద్ధం... మంత్రిత్వాల రాజీనామాలు -
సమష్టి సత్యాగ్రహంతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టనని
వ్యక్తి సత్యాగ్రహం చెయ్యండన్నాడు గాంధీ.

**కథకుడు 2**

వ్యక్తి సత్యాగ్రహం ఏమిటని ఆగ్రహించాడు రాజాజీ.

**కథకుడు 1**

చెన్నరాష్ట్రంలో వ్యక్తి సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్లిన ప్రథముడు ప్రకాశం....

**కథకుడు 2**

1942 ఆగస్టు... గాంధీ గారి కొత్త పిలుపు.
క్విట్ ఇండియా. భారతదేశం విడిచిపో..

**కథకుడు 1**

ప్రజలు కోరుకునే ఆశయం నినాదమై దావానలంలా వ్యాపించింది.

**కథకుడు 2**

హింస జరిగినా ఫరవాలేదని గాంధీగారన్నారని ఎక్కడో పుట్టిందో కాగితం

**కథకుడు 1**

దాన్ని ఆంధ్రా సర్క్యులర్ అన్నారు.

**కథకుడు 2**

పట్టాభి, కళా వెంకట్రావుల సంయుక్త చాణక్యం
అనుకున్నారు దాన్ని!

**కథకుడు 1**

తనకూ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకు దానితో ప్రమేయం లేదని
స్పష్టం చేశాడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు ప్రకాశం.

**కథకుడు 2**

అది పరాకాష్ట - ఇద్దరు నాయకుల మధ్య సయోధ్య పూర్తిగా చెడిపోవడానికి.

**కథకుడు 1**

1946. మళ్లీ ఎలక్షన్లు. మళ్లీ కాంగ్రెసుకు మెజారిటీ -

**కథకుడు 2**

రాజకీయాలకు దూరంగా వున్న రాజాజీ
మళ్లీ నాయకత్వానికి తయారు.
ఆయనకు మద్దతు గాంధీగారు.

**కథకుడు 1**

ప్రకాశాన్ని ఈసారి కూడా రానివ్వకూడదని ప్రత్యర్థి వర్గం పట్టుదల
కొండా వెంకటప్పయ్య, తెన్నేటి విశ్వనాథం,
సాగి విజయరామరాజు, కడప కోటిరెడ్డి ప్రభృతుల ఆందోళన.

★ ★ ★

**మద్రాసులో బొప్పన హనుమంతరావుగారియిల్లు, 1946**

(బొప్పన హనుమంతరావుగారి యింట్లో ప్రకాశంగారి గది.. గదిలో విశ్వనాథం, కోటిరెడ్డి, కొండా వెంకటప్పయ్య, విజయరామరాజు ఉన్నారు.. విశ్వనాథం అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.. బయట ప్రకాశం పంతులు గారికీ జై, కామరాజు నాడారుకు జై ...... ప్రకాశంగారే ముఖ్యమంత్రి కావాలి, ఆంధ్రకేసరి జిందాబాద్.. అంటూ నినాదాలు)

**విశ్వ**

చూడండి వాళ్ల ఆనందం ! ఆ కోలాహలం !! ఆ జనం చూడండి - ఒక్క ఆంధ్రులేనా? మలబారు జిల్లా అంతా యిక్కడే వుంది. కోలారు నుంచి వెయ్యి మంది వచ్చారు. సేలం జిల్లానుంచి - రాజాజీగారి జిల్లా - నాలుగువేల టెలిగ్రాంలు... అందరూ ఒకటే మాట - ప్రకాశంగారే రాష్ట్ర ప్రధాని కావాలి అని -

**వి.రాజు**

ఈ ప్రజల స్పందన చూసి తమ నిర్ణయాలు తీసుకోమనండి గాంధీగారిని -

**కొండా**

కళ్లుండీ చూడలేనివారు కొందరు -

**కోటి**

చెవులుండీ వినబడనివారు మరి కొందరు -

**కొండా**

ఒక పక్క గిరిగారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాని ఎన్నిక జరపండీ అని కాంగ్రెసు అధ్యక్షుడి ఆదేశం ఏమిటి? మరో పక్క రాష్ట్ర ప్రధానిగా ఒక్కడిపేరే - ఒక్క రాజాజీ పేరునే ప్రతిపాదించండి.. ఫలితం నాకు తెలియ చెయ్యండి- అని కాంగ్రెసు అధ్యక్షుడి తాఖీదు ఏమిటి?

**వి.రాజు**

కాంగ్రెసు అధ్యక్షులేం చేస్తారండీ ? ఈ బొమ్మకు వెనకాల సూత్రం గాంధీగారు.

**కోటి**

ఢిల్లీ నుంచి ఎటువంటి ఒత్తుడులు వచ్చినా, ప్రకాశం గారిని జారిపోవద్దని చెప్పాలి. విశ్వనాధంగారూ! మీరే -

**విశ్వ**

ఈసారి అట్లాజరగదులెండి. అధిష్టానం చేస్తున్న యీ అవమానాలకి ఆయనా బాధపడుతూనే వున్నారు.

**వి.రాజు**

ప్రకాశంగారు అంత చేదయిపోయారా? ఆయన చేసిన త్యాగాలు వీళ్ల కళ్లకి ఆనడం లేదా? ఇందర్ని విరోధుల్ని చేసుకుని ఆ జమీందారీ బిల్లు ప్రవేశపెడితే,

దాన్ని గురించి నవ్వుతూ మాట్లాడి బుట్ట దాఖలు చేసిన పెద్ద మనిషికి గాంధీగారి మద్దతా?

**కొండా**

నాకెందుకు బాధో తెలుసా?.. పాతికేళ్ల పాటు దేశంకోసం పోరాడిన మనిషిని, లక్షలాది మంది ప్రజలు ప్రేమించి, ఆరాధించే మనిషిని - నలుగురు మనుషులు కలిసి అభాసు పాలు చేస్తున్నారే - అని!

**కోటి**

మరి అధిష్ఠాన వర్గం కూడా నిజం చూడాల్సింది పోయి, ఒకరి పక్షానే మాట్లాడితే ఎలా?

**వి.రాజు**

ఆశ్రయించినవారికే యిస్తారండీ వరాలు...

**కొండా**

(టేబుల్ మీద ఉన్న కాగితాల్లో నుంచి ఒక కాగితాన్ని వెలికి తీసి) ఇదా కాంగ్రెసు అధ్యక్షుడయినవాడు పంపవలసిన ఉత్తరం? "18వ తేదీన జరిగే పార్టీ సభకు వచ్చే శాసన సభ్యులకు ఈ సందేశం అంద చేయవలసినది... పరిస్థితులన్నీ చక్కగా ఆలోచించి సి.రాజగోపాలచార్యులు గారిని మీ నాయకునిగా ఎన్నుకోవలసిందని ఇందు మూలముగా నేను సలహాయిస్తున్నాను."

**వి.రాజు**

ఈయనకి యీ సలహా యిచ్చిందెవరో?

**కొండా**

ఇదుగో ! ఇందులోనే వుంది – "'ఈ సలహా యివ్వడంలో మహాత్మాగాంధీగారు, వల్లభాయి పటేలుగారు నాతో ఏకీ భవిస్తున్నారు.

ఇట్లు

మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్, .కాంగ్రెసు అధ్యక్షుడు"

**విశ్వ**

ఎప్పుడయితే ముఖ్యమంత్రిని పైనుంచి దిగుమతీ చేసే పద్ధతి వచ్చిందో, అప్పుడే ప్రజాస్వామ్యం చచ్చిపోయిందన్నమాట !

**కొండా**

ఇంకా ప్రజాస్వామ్యం పుట్టలేదండీ -

**వి.రాజు**

పుట్టకుండానే - అంటే - పురిటి నెప్పుల్లోనే సంధికొట్టిందన్న మాట ! (బయట కోలాహలం... ~~బోలో స్వతంత్ర భారత్‌కీ జై, ఆంధ్ర~~కేసరికి జై... ప్రకాశం పంతులు గారికీ జై, కామరాజా నాడార్ గారికీ జై... అంటూ నినాదాలు... జయ జయ ధ్వానాలు... ప్రకాశంగారు, నాడార్‌గారు మెడల నిండా దండలతో ప్రవేశిస్తారు. అందరూ ప్రకాశం గారికి నమస్కరిస్తారు... నాడార్ గారికి నమస్కరించి ఆహ్వానిస్తారు.)

**నాడార్**

లెక్కింపు అయిపోయిందబ్బా!... రాజాజీ కావాలనే వారు 38 మంది, వ్యతిరేకులు 148 మంది... ఇప్పుడు తేలిపోయింది గదా !

**రాజు**

ఇదండీ అసలైన ప్రజల తీర్పు.

**విశ్వ**

ప్రజాస్వామ్యమంటే ఇదీ !

**కోటిరెడ్డి**

ఇప్పుడైనా పై వాళ్లకి తెలిసొస్తుందంటారా?

**నాడార్**

తెలియక ఏమౌతది రెడ్డిగారూ?

(ఇంతలో గిరిగారు "ప్రకాశంగారూ... ప్రకాశం గారూ" అని పిలుస్తూ హడావుడిగా ప్రవేశిస్తాడు.)

**విశ్వ**

ఏమిటి గిరిగారూ? ఏమిటి హడావుడి?

**గిరి**

హడావుడే విశ్వనాధంగారూ ! అబ్దుల్ కలాం అజాద్‌గారు మరో టెలిగ్రాం పంపారు. (టెలిగ్రాం చూస్తూ) "నాయకులుగా ఉండడానికి ఒకరి పేరే పంప నవసరం

లేదు.. ఎక్కువ పేర్లు సూచించి పంపితే ఏదో ఒక పేరు మేము యిక్కడ ఖాయం చేస్తాము" అని.

**నాదార్**

ఏమీ ! మనమిక్కడ ఖాయం చెయ్యలేం కాబోలునే !

**రాజు**

కాదండీ ! ప్రజలకు కావలసిన నాయకుణ్ణి మన మెక్కడ ఎన్నుకుంటామోనని వాళ్ల భయం.

సుబ్బరామయ్య (కాంగ్రెసు ఆఫీసు మేనేజరు)

(వస్తూ) నాదార్ గారికి రెండు టెలిగ్రాంలు వచ్చాయండి - (ఇచ్చి వెళ్ళి పోతాడు.)

**నాదార్**

(వాటిని చూచి ఒకదానిని గిరి గారికిస్తాడు.)

**గిరి**

ఇది గాంధీగారి దగ్గరనుంచి -

**నాదార్**

ఏమందురు?

**గిరి**

మిమ్మల్ని వెంటనే వచ్చి కలవమన్నారు.

**నాదార్**

ఈ రెండో టెలిగ్రాం చూడండి...

**గిరి**

ఇదీ గాంధీగారి దగ్గరనుంచే... (చదువుతూ నిర్ఘాంతపోయి, అందరి మోహాలు చూసి) I have ordered Prakasam not to contest. He dare not stand. Details when we meet....

**కొండా**

ఎంత దారుణం !

**నాడార్**

ఏమండీ? పోయి రమ్మందురా?

**ప్రకాశం**

వెళ్లిరండి... పెద్దవారు పిలిచినప్పుడు.

**విశ్వ**

వెళ్లి.. మళ్లీరండి.. (నాడార్‌గారు అందరికీ నమస్కారాలు చెప్పి వెళ్ళి పోతాడు.) (సుబ్బరామయ్య వస్తాడు.)

**సుబ్బ**

మోటూరు సత్యనారాయణగారికి గాంధీగారొక ఉత్తరం యిచ్చి పంపారుట!... దాన్ని ఆఫీసుకు పంపుతున్నామని ఫోన్ చేశారు. (వెళ్ళిపోతాడు.)

**విశ్వ**

ఇది కొత్త మలుపే !

**కొండా**

ఏముంది? పోటీ చేయవద్దని రాసుంటారు.. He dare not stand అన్న ఉత్తరం ఇదే అయివుంటుంది.

**ప్రకాశం**

(మెల్లగా) ఈ వ్యవహారం అంతా చూస్తే మనం తప్పుకోవడం మంచిదని తోస్తోంది.

**వి.రాజు**

(కోపంగా) కిందటిసారీ ఇట్లాగే చేశారు. మీరు ఎన్నిక కావడం ఖాయం అనుకుంటూ వుండగా మీరే రాజాజీ పేరు ప్రతి పాదించారు. ఆయన చేసిన నిర్వాకం చూశారుగా !

**ప్రకాశం**

ఏమీ లేదు.. రాజకీయాల్లో నీతి లోపించిన తర్వాత మన కక్కడ స్థానం లేదు.

**విశ్వ**

గాంధీగారు బోధించిన నైతిక రాజకీయాలు చూడండి.. రాజాజీ కనిపిస్తే ఆయనకవేవీ కనిపించవు.

**సుబ్బరామయ్య**

(ఉత్తరం తీసుకొని వచ్చి) మోటూరు సత్యనారాయణ గారు పంపారు. గాంధీగారు పంపిన ఉత్తరంట! (ప్రకాశం గారికి ఇచ్చి వెళ్లిపోతాడు ఆయన చించి చదువుతాడు. ఒక్క క్షణం మొహం పాలిపోయింది. తల వంచుకున్నాడు. ఆ తరువాత మొహం కందగడ్డ అయిపోయింది)

**ప్రకాశం**

ఎంతధైర్యం ! ఛీ ! ఎంత నీచానికి దిగజారారు? How dare they do it to me!

**విశ్వ**

ఏమయిందండీ ?

**వి.రాజు**

ఏమంటారు? (ప్రకాశం ఉత్తరం గిరికి ఇస్తాడు.)

**గిరి**

(చదువుతూ) "When I was coming from Orissa to Madras to particpate in the Silver Jubilee celebrations of the Dakshina Bharatha Hindi Prachar Sabha....." (వెనుకనుంచి ఇంగ్లీషులో మంద్రంగా వినిపిస్తుంది.. తెలుగు అనువాదం ప్రస్ఫుటంగా –)

“నేను ఒరిస్సా నుంచి చెన్నపట్నం హిందీ ప్రచారసభ రజతోత్సవాలకు వస్తున్నప్పుడు నాతోపాటు ప్రయాణం చేస్తున్న రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి కళా వెంకటరావు గారిని – కోర్టులో న్యాయవాద వృత్తి చేస్తూ ప్రకాశం ప్రజా సేవ ఎట్లా చేస్తున్నారని అడిగాను. మీరు ప్రాక్టీసు మానివేశారని, ప్రజల సొమ్ము మీద జీవిస్తున్నారనీ ఆయన నాకు చెప్పాడు..”

**విజయరామరాజు**

(కోపంతో) "That you are living on public funds!"

**గిరి**

(చదువుతూ...) "మీరు జైలు నుంచి బయటకు వచ్చాక బహిరంగ సభలలో ప్రజలు మీకు చందాలిస్తే ఆ ధనం కాంగ్రెసుకు జమ కట్టక మీరు స్వయంగా వాడుకున్నారట ! ఇది చాలా అవినీతికరమైన పని".

**వి.రాజు**

(కోపంగా) "an unethical act"!

**గిరి**

(చదువుతూ) "అందుచేత మీరు శాసన సభలో ఉండడానికి గాని నాయకత్వం వహించడానికి గాని వీలులేదు కాబట్టి మీరు మీ ప్రయత్నం మానుకోవలసింది.

ఎమ్.కె. గాంధీ."

**వి.రాజు**

ఈ అడుగుతున్నవాళ్లంతా వాళ్లబాబుల సొమ్మేమైనా ఇచ్చారా?

**విశ్వ**

చెప్పినవాళ్లు అలా చెబితే ఆయనేం చేస్తాడు?

**కొండా**

ఎంక్వయిరీ చెయ్యాలి.. ఏమీ లేకుండా ఇంతింత మాటలంటే –

**కోటి**

దీనికి ఆంధ్ర ప్రజలే జవాబు చెబుతారు –

**ప్రకాశం**

ఎందుకింత కోపం?..జనం ఎందుకిస్తున్నారో నాకు తెలియదు. కాంగ్రెసుకు కాదు, మీకు అని చెప్పి యిచ్చారు. అయినా దాన్ని తుపాను బాధితుల కోసం ఖర్చు పెట్టాను. నాదంటూ నాకేమీ లేదు – అని చెప్పాను.

**విశ్వ**

ఇది కుట్ర ! ఇటువంటి అవినీతి ఆరోపణలను ఎదుర్కో వలసిందే !

**కోటి**

మనం అంతా గాంధీగారికి టెలిగ్రాంలు ఇద్దాం – పేపర్లలో ప్రకటన లిద్దాం..

**కొండా**

మనకు తెలుసు – ఈ డబ్బు ప్రకాశంగారి వ్యక్తిగత ఖర్చుల కోసం యిచ్చిందని–

**విశ్వ**

(కొండాతో) మీకూ, నాకూ, వెన్నెలకంటి రాఘవయ్యకి, నడింపల్లికి – అందరికీ తెలుసు.. ఒకప్పుడు లక్షలకు అధిపతై తన సర్వస్వాన్ని ప్రజా క్షేమం కోసం ఖర్చుపెట్టిన మహనీయుడికి – కృతజ్ఞులైన ప్రజలు – ఆయన జీవిక కోసం ఉడతాభక్తిగా కానుకలిస్తే – దాన్ని స్వప్రయోజనాల కోసం వాడుకునే స్వార్థ రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేశారు.

**కోటి**

ఇటువంటి రాజకీయం పై నుంచే బయలు దేరడం భారతదేశం దురదృష్టం.

**కొండా**

రాజూ ! కాగితం, కలం తీసుకో ! రాష్ట్ర కాంగ్రెసులో ఇటువంటి ఘాతుకానికి పూనుకున్న నలుగుర్నీ పక్కకుపెట్టి మిగిలిన ఇరవయ్యేదుగురం వేరువేరుగా గాంధీగారికి, అజాద్ గారికి టెలిగ్రాంలు పంపిద్దాం. టెక్స్ట్ రాసుకో –

"ప్రకాశం గారి విషయంలో మీ ఆంక్ష వెంటనే తొలగించకపోతే మేము వారికి వెంటనే లక్షరూపాయలు వసూలు చేసి యిస్తాం... ప్రకాశం గారి జీవిత మార్గానికే మీ మాటలు తలవంపు.."

అట్లా అందరి దగ్గర సంతకాలు తీసుకుని వేరువేరుగా టెలిగ్రాంలు పంపు.

**ప్రకాశం**

(రాజుని ఆగమని సౌజ్ఞ చేసి, కొండా వెంకటప్పయ్య గారితో) కాని ఆ వుత్తరం రాసింది నాపేరనండీ – సమాధానం చెప్ప వలసింది నేను. రాజూ ! నా సమాధానం రాయి.

"మహాత్మా గాంధీగారికి –

మీరు పంపిన ఉత్తరం అందింది. నేను మహాత్ముణ్ణి కాను. సామాన్యుణ్ణి. ఈ దేశంలో ప్రజాసేవ చేసి సర్వస్వాన్ని ఉద్యమం కోసం ఖర్చుపెట్టిన వారు జీవించ డానికి రెండు మార్గాలున్నాయి. ఎవరైనా కోటీశ్వరులు – బిర్లా, తాతాల వంటివారు – అభిమానించి నిధులు ఏర్పాటు చేస్తే అందులో నుంచి దినసరి ఖర్చుకు వాడు కోవడం ఒక పద్ధతి. ఇక రెండోది – ప్రజా సేవకుడికి ఎప్పటికప్పుడు ఏమి అవసరం

వస్తే దానికి సరిపోయేటంత డబ్బు ప్రజలే సమకూర్చి పెట్టే పద్ధతి. నాకు ప్రజలు ఇచ్చినది రెండవ రకానికి చెందినది.

నేను రోజుకు వేయిరూపాయలు ఫీజు పుచ్చుకుని న్యాయస్థానాల్లో న్యాయ వాదవృత్తి సాగించినప్పుడుకూడా ఆ డబ్బు ప్రజా ధనమనే అనుకునేవాడిని. ఏ పద్ధతి అయినా ప్రజా సేవకుడు వాడిన డబ్బు ప్రజా ధనమే అవుతుంది.

ఇట్లు, భవదీయుడు,

టంగుటూరి ప్రకాశం".

ఈ వుత్తరం టైప్ చేసి నా సంతకం తీసుకుని వెంటనే ఢిల్లీకి పంపు....

వెంకటప్పయ్యగారూ ! కోటిరెడ్డిగారూ ! విశ్వనాథం, గిరి, రాజూ ! ఇంత వరకు పెద్దలు మనల్ని ఎట్లా చూస్తున్నా వారి మీద ఉన్న గౌరవ భావంతోను, సంస్థ గౌరవం కోసం సహించాం. ఆశ్రిత పక్షపాతంతో వాళ్లే అడ్డదారులు తొక్కితే మనం యింకా అవమానాలు భరించవలసిన అవసరం లేదు.. మనం న్యాయం అనుకున్న మార్గంలో ముందుకు పోవలసిందే –

ఏం జరిగినా మన కర్తవ్యం మనం నిర్వహించవలసిందే ! మేలుకోండని మనల్ని హెచ్చరించింది యీ వుత్తరం – మన నిర్ణయం భవిష్యత్తుకు నాంది...గిరీ! మీ విధి నిర్వహణకి ఉపక్రమించండి. నాయకుడి ఎన్నికకి తేదీని ప్రకటించండి.

(మెల్లగా చీకట్లు ఆవరించుకుంటున్నాయి.. వెనుక గంభీరమైన గాత్రంతో "నిటలాక్షుండీపుడెత్తి వచ్చినను రానీ" అనే పద్యం)

★ ★ ★

# పదమూడవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

రాష్ట్ర ప్రధాని ప్రకాశం
సామాన్యుడి కోసం ఏవేవో చేయాలని
తహ తహ లాడిన ప్రకాశం!

**కథకుడు 2**

గాంధీగారు ఖాదీ విషయంలో
బావుందని రాస్తేనే మురిసిపోయిన ప్రకాశం!

**కథకుడు 1**

కొత్త కొత్త పథకాలు
గ్రామ స్వరాజ్యం అనే వినూత్న పథకం.
ప్రతి ఫిర్కాను కేంద్ర బిందువు చేసి
బహుళార్థ సాధక పథకాలు ప్రజలకోసం అమలు
ఖాదీ ఉద్యమం – జోగన్న పాలెంలో
గ్రామీణ విశ్వవిద్యాలయం – గోపన్న పాలెంలో.

**కథకుడు 2**

పథకాలు అమలు చేస్తూ ప్రకాశం
ప్రతి కక్షులు కుమ్మక్కయి గూడుపుఠాణీ –

మళ్లీ ప్రకాశం గద్దెకు చేటు
సామాన్యుడి ఆశయ సిద్ధికి గొడ్డలిపెట్టు.

**కథకుడు 1**

తమిళుల రాజకీయ చదరంగంలో
పాపం తెలియకో, తెలిసో
పావులయి పోయారు ఆంధ్ర నాయకులు.
అన్నింటికీ మూలం, అధికారం !!

**కథకుడు 2**

అధికారం కోసమే ప్రజా సేవ చెయ్యడం అనే
కొత్త సూత్రం అమలులోకి వచ్చింది - ఆనాడే !

★ ★ ★

**ప్రధాని కార్యాలయం,**

**మద్రాసు, 1946**

చెన్నరాష్ట్ర ప్రధాని ప్రకాశం ఆఫీసు... గిరి, విశ్వనాధం, టి.వి. రాఘవరావు.. (ప్రకాశం చేతిలో ఓ కాగితం పట్టుకుని ఆనందంగా పచార్లు చేస్తూ ఆ కాగితం వంక చూస్తూ వుంటాడు)

**ప్రకాశం**

ఇప్పుడు - ఇప్పుడు నా ప్రధాని పదవి సార్ధకం అయింది. గాంధీగారు మర కదుళ్లను గురించి రాసిన ఉత్తరం చదివావా?

**విశ్వ**

చదివాను.

**ప్రకాశం**

ఇంకా ఏమన్నాడయ్యా గాంధీగారు, రాఘవరావు? (మిగిలినవాళ్లతో) అన్నట్టు ఈయన తెలుసుగా, టి.వి.రాఘవరావు, గాంధీగారి సహచరుడు, మన ఖాదీ ఆఫీసరు.

**విశ్వ**

అయ్యో! తెలియకేం?

**రాఘువ**

మీరు చేస్తున్న గ్రామ స్వరాజ్య కార్యక్రమాలన్నీ గాంధీ గారికి వివరించానండీ- గ్రామ స్వరాజ్య కార్యక్రమాల ద్వారా గాంధీగారి ఆశయాలు ఎలా సఫలమవుతున్నాయో చెప్పాను. గ్రామీణ విశ్వవిద్యాలయం సంగతి చెప్పి, అందులో గాంధీ గారి జీవన విధానం మీద, ఆయన ఆర్థిక సూత్రాల మీద, సత్యాగ్రహోద్యమం మీద, గ్రామీణ ప్రజలకు పాఠాలు చెబుతున్నారని చెప్పాను. దాంతోపాటు మరకదుల్ల విషయం చెప్పేటప్పటికి ఆయన ఇంకా ఆనందపడి పోయారు. దేశం మొత్తం మీద తన ఆశయాలకి కార్యరూపం యిచ్చింది ప్రకాశం గారేనని ఎంతో మెచ్చుకున్నారు.

**ప్రకాశం**

ఇదీ నిజమైన గుర్తింపు... నీకు వ్యతిరేకంగా ఉంటూ వచ్చిన పెద్ద మనిషి నువ్వు చేస్తున్న ప్రజా కార్యక్రమాల్ని ఒప్పుకున్నాడంటే - అదీ కార్యక్రమానికి విజయం-

**గిరి కొందరికి**

కొందరికి మనిషి దూరం, సిద్ధాంతాలు దగ్గర...మరికొందరికి మనిషి దగ్గర, సిద్ధాంతాలు దూరం - ఏం రాజకీయాలండీ !

(ప్రకాశం గారి పి.ఏ. ప్రవేశిస్తాడు.)

**పి.ఏ.**

వస్తూ రాజాజీగారు వచ్చారండీ ! (అని చెప్పి వెళ్ళిపోతాడు)

**గిరి**

(ఆశ్చర్యంగా) రాజాజీయా !

**విశ్వ**

రాజాజీ ! !

**ప్రకాశం**

తీసుకురా విశ్వనాథం... (విశ్వనాథం వెడతాడు.. ఆయన్ని మర్యాదగా తీసుకొస్తాడు. అందరూ నమస్కారాలు..) (నవ్వుతూ) ఉరుములూ, మెరుపులూ లేకుండా యీ గాలి వాన ఏమిటి? ఢిల్లీ నుంచి ఎప్పుడు వచ్చారు?

**రాజాజీ**

పొద్దునే -

**ప్రకాశం**

కూర్చోండి.

**రాజాజీ**

(నిలబడే) రాజన్ మిమ్మల్ని కలిశాడనుకుంటాను.

**ప్రకాశం**

(అవునని తలవూపి) కూర్చోండి...

**రాజాజీ**

(చుట్టూ చూశాడు. ఆ తరువాత ప్రకాశాన్ని ఆపాదమస్తకం చూశాడు) మీరు పెద్దవాళ్లయినారు !

**ప్రకాశం**

(నవ్వి) మీరు నా కంటె ఒక్క సంవత్సరమే చిన్న. .. కానీ మీరు పెద్దవారు కాలేదు.

**రాజాజీ**

ఎప్పటికీ కానేమో?

**ప్రకాశం**

మిమ్మల్ని చూస్తే అలాగే అనిపిస్తుంది.. ఆఁ ! చెప్పండి... ఏమిటి విశేషం?

**రాజాజీ**

(చుట్టూ చూస్తాడు)

**విశ్వ,గిరి,రావు**

ఆ పక్క గదిలో వుంటాం... సెలవు.. (వెళ్లిపోతారు)

**ప్రకాశం**

ఏమిటి? ఏమన్నా అర్జంటు పనా?

**రాజాజీ**

నాకు కాదయ్యాపని – నీకు ! నీకే వుండాలి నాతో పని !! ఆ పని ఏమిటో తెలుసుకునే ముందర ఒక్క విషయం చెప్పాలి. నాకు నువ్వంటే వున్న అభిప్రాయంలో, మార్పులేదు, ఏ మాత్రమూ... నువ్వు ఆలోచనలేని ఆవేశపరుడివి... గాలిలో తేలిపోయే

ఊహాజీవివి.. పట్టువిడుపులు లేని పట్టుదల నీకు ప్రాణం.. ప్రాణం అంటే విలువలేని మూర్ఖుడివి. పిచ్చివాడివి..

**ప్రకాశం**

(బిగ్గరగా నవ్వి) నన్ను గురించి యింత బాగా వివరించిన వాళ్లు ఎవ్వరూ లేరు.. సంతోషం.. ఇప్పుడు చెప్పండి నాకు మీతో పనేమిటో?

**రాజాజీ**

మరో పదిహేను రోజుల్లో శాసనసభా సమావేశాలు జరగ బోతున్నాయి.. శాసనసభలో నావాళ్లు చాలామంది వున్నారు.

**ప్రకాశం**

'చాలామంది' అన్నది కొంచెం అతిశయోక్తి.. 10 లేదా 12 మంది. అంతే !

**రాజాజీ**

(కొంచెం కోపంగా) ఇప్పుడు నువ్వున్న పరిస్థితుల్లో అది చాలా పెద్ద సంఖ్యే ! నీకు తెలియదేమో - నాడార్ నాతో చేతులు కలుపుతాడు. ఇహ - మీ వాళ్లల్లోనే నీకు నిత్య విరోధి వర్గం ఉండనే ఉంది.

**ప్రకాశం**

అయితే - ?

**రాజాజీ**

(ఆగమని చెప్పి) మధ్యస్తంగా ఉన్నవాళ్లని బస్సు యజమానులు, మిల్లర్లు, జమీందారులు కొనేశారు. ప్రజా కార్యక్రమాల పేరుతో నువ్వు వాళ్లందర్నీ విరోధుల్ని చేసు కున్నావు. వీళ్లంతా కలిసి నిన్ను దించడానికి సిద్ధంగా ఉన్నారు.

**ప్రకాశం**

(నవ్వి) ఇంతేనా? నా మంత్రి వర్గంలో ఉన్న నలుగురు మంత్రులు మీతో చేతులు కలిపారు. మీరు తెరవెనుక సూత్ర ధారిగా ఉండి వీళ్లను నడిపిస్తున్నారు. ఇవాళ ఉదయం, మీరు నాడార్ కలిసి ఏం చెయ్యాలో ఓ నిర్ణయానికి వచ్చారు. మీరు వచ్చింది మీ పథకంలో మొదటి భాగాన్ని అమలు చెయ్యడానికి - ఇప్పుడు చెప్పండి...

**రాజాజీ**

ఫరవాలేదే ! మీ గూఢచారులు బాగానే పని చేస్తున్నారు.

**ప్రకాశం**

ఇది గూఢచారుల పని కాదండీ. Common Sense! మీ దృష్టిలో రాజకీయం అంటే ఎదుటి వాళ్లకు తెలియకుండా నాటకం ఆడడం అని. ఎలక మీద పిల్లిని, పిల్లిమీద ఎలకనీ ఎక్కించి అందువల్ల మన కొచ్చే లాభాలను గుణించుకోవడం అని. మినిస్టర్ అంటే గాంధీగారిచ్చిన నిర్వచనం మీకు తెలిసే వుండాలి. ప్రజలకు సేవ చేసేవాడు అని. నా ప్రజలకు సేవ చేయడానికి నాకు దొరికిన అవకాశంగా భావిస్తాను, ఈ పదవిని.. ప్రజలంతా ఇవాళ అనాథలై ఉన్నారు. పరిపాలిస్తున్నది పరాయి వాడయినా, తన దేశం వాడయినా, తమకు కావలసిందేమిటో తెలియని స్థితిలో వున్నారు. తెలిసినా ఆడగడానికి భయపడు తున్నారు. అటువంటి వాళ్లకి ఏం కావాలో తెలుసుకుని, అన్నీ కాకపోయినా కొన్నయినా వాళ్లకి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా పరిపాలించడం రాజకీయం అని నా ఉద్దేశ్యం. ఇది వాస్తవ రాజకీయం –

**రాజాజీ**

గాంధీ గారి సూత్రాలు ఆయనకన్న బాగానే పట్టుకున్నారు !

**ప్రకాశం**

ఆ మనిషిని మిగిలిన వాళ్లకన్న మీరు బాగా పట్టుకున్నట్టు!!

**రాజాజీ**

ఈ బుడి బుడి సూత్రాలు నా దగ్గర వల్లించకండి.

**ప్రకాశం**

ఒట్టి సూత్రాలు ప్రకాశం ఏనాడు వల్లించడు. ఇదుగో మర కదుళ్ల విషయంలో గాంధీగారి ఉత్తరం –గాంధీగారి ప్రశంస.

**రాజాజీ**

ఆయన ప్రశంసలు ఎవరికి కావాలి? ఇప్పుడు మనం చూడాల్సింది మన మంత్రివర్గాలు ఎట్లానడుస్తున్నాయా అని.

**ప్రకాశం**

ఎట్లా నడుస్తున్నాయట?

**రాజాజీ**

మరో పదిహేను రోజుల్లో మీ మంత్రి వర్గం పడిపోతున్నది. మా వాళ్లు మీకు వ్యతిరేకంగా ఓటు చేస్తే దాని ఓటమి ఖాయం.

**ప్రకాశం**

అట్లాగా !

**రాజాజీ**

అవును. మా వాళ్లు నేను ఎవరికి ఓటు చెయ్యమంటే గుడ్డిగా వాళ్లకే ఓటు వేస్తారు తెలుసా?

**ప్రకాశం**

సహజమే కదా !

**రాజాజీ**

వాళ్లందరూ మీకు వ్యతిరేకంగా ఓటు చెయ్యకుండా ఉండా లంటే మీరు నేను చెప్పిన షరతులకు ఒప్పుకోవాలి.

**ప్రకాశం**

షరతులా ?

**రాజాజీ**

అవును... ఒకటి.. మా వాళ్లలో నలుగురిని వెంటనే మంత్రి వర్గంలోకి తీసుకోవాలి ... రెండు –

**ప్రకాశం**

(కొంచెం కర్కశంగానే) క్షమించండి –

**రాజాజీ**

(వెంటనే కోపం వచ్చింది) అంటే? (బిగ్గరగా) ఒప్పుకోవని అర్థమా?

**ప్రకాశం**

అంత బిగ్గరగా మాట్లాడక్కర్లేదు రాజాజీగారూ –

**రాజాజీ**

నా ఇష్టం వచ్చినంత బిగ్గరగా మాట్లాడతాను..

**ప్రకాశం**

మీరు మాట్లాడితే నేనూ మాట్లాడాలి.. నా గొంతు మీ గొంతు కన్న పెద్దది. ఎవరన్నా వింటే ప్రకాశంగారు రాజాజీ మీద ఎందుకో కోపం చేస్తున్నారనుకుంటారు..

**రాజాజీ**

You.... You.... You are incorrigible.... ఇంత తలబిరుసుతనం పనికిరాదు. మంత్రివర్గం పడి పోకుండా నా చేత నైన సహాయం చేద్దామని వచ్చాను. మీరు మాత్రం - ఇది వరకటి మొండి మనుషులే!.

**ప్రకాశం**

చూడండి.. షరతుల్తో నేనీ పదవిలో ఉండాలనుకోవడం లేదు. మిమ్మల్ని ముందుగానే ఆహ్వానించాను. రెండు పదవులిస్తాం - అన్నాం. మీరు నిరాకరించారు. మొన్న రాజన్ మూడు అన్నాడు. ఇప్పుడు మీరు నాలుగు అంటున్నారు. మీరు నేనంటే ఎందు కిట్లా ప్రవర్తిస్తున్నారో మిగిలిన వాళ్లకెవరికీ తెలియక పోయినా నాకు తెలుసు.

**రాజాజీ**

ఎందుకు? చెప్పండి...

**ప్రకాశం**

ప్రకాశం అనేవాడు చెన్న రాష్ట్రానికి ప్రధానిగా ఉంటే మీకు ప్రాముఖ్యం ఉండదు. మీకు పక్కలో బల్లెంలా వుంటాడు. మొండివాడు. వాడికి ధనం, అధికారం, మమకారం వీటి మోజు లేదు. పైగా వాడు యిక్కడే వుంటే ఏనాటికయినా చెన్నపట్నం ఆంధ్రులకే వెళ్లిపోతుంది.. వాడిని లేపెయ్యండి.. ఆ సంగతి మీ ముందు మాట్లాడ్డానికి ఎవరికీ ధైర్యం ఉండదు. మొరిగే కుక్కలకి కాసిని మాంసం ముక్కలు పడెయ్యండి.. రాజాజీ ! ఈ విషయాలేవీ నాకు తెలియవనుకోకండి... నేను ఇవ్వాళ ధైర్యంగా చెప్పగలను, దేశంలో ఎక్కడయినా గాంధీ గారి ప్రణాళికలు మనస్సాక్షిగా అమలు జరుగుతున్నాయంటే, అది చెన్నపట్నంలోనే - ప్రకాశమే అమలు చేస్తున్నాడు.

గాంధీగారు మీ మనుషులు.. అందువల్ల నాకు వ్యతిరేకం. నాకు వ్యక్తుల్తో ప్రమేయం లేదు. పనితో ప్రమేయం. ఆదర్శా లతో ప్రమేయం..

మీరేమైనా చేసుకోండి.. నేనుసిద్ధమే ! అంతేకాని, నేను నా విలువల్తో రాజీపడను.. రాజీ పడాల్సిన ఖర్మ నాకు పట్టలేదు..

**రాజాజీ**

సరే ! ఇహ మీతో మాట్లాడి ప్రయోజనం లేదు.. మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి.. (వెళ్ళిపోవడానికి వెనుక్కు తిరుగుతాడు)

**ప్రకాశం**

అన్నట్టు, అమ్మాయి - లక్ష్మి - ఎట్లా వుంది?

**రాజాజీ**

(కాసేపాగి) బాగానే వుంది..

**ప్రకాశం**

నన్ను పెదనాన్నా - అని ఆప్యాయంగా పిలిచేది ...అడిగానని చెప్పండి.. (రాజాజీ కోపంగా ముందుకు నడుస్తాడు..) మరో మాట ! ఈ అవిశ్వాస తీర్మానాలు అవీ అయిపోయి. మరో మంత్రి వర్గం స్థిరపడేదాక మీ వాళ్లని కొంచెం జనంలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండమనండి. మీరన్నట్టు ఈ జనం ఒట్టి మూర్ఖులు.. వాళ్లు ప్రేమాస్పదాలు పంచివ్వడంలోనూ మూర్ఖులే ! కోపతాపాలు చూపించడంలోనూ మూర్ఖులే !

**రాజాజీ**

You will never change (అని అంటూ కోపంగా వెళ్ళిపోతాడు)

**ప్రకాశం**

రాజకీయ నాయకులు అధికారం కోసం చూపించే శ్రద్ధలో వందోవంతు తమ బాధ్యతలు నిర్వహించడంలో చూపితే దేశం ఎంత బాగుపడుతుంది?

★ ★ ★

# పధ్నాల్గవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

పదకొండు నెలల్లో ప్రకాశం గారి మంత్రివర్గం పడిపోయింది

**కథకుడు 2**

నీ చేతను, నా చేతను, వరమడిగిన కుంతిచేత –

**కథకుడు 1**

వెన్నుపోటు నాయకులు చేత
ప్రజాస్వామ్యం దారుణహత్య.

**కథకుడు 2**

ఈ వెన్నుపోటు పెద్ద మనుషులకు ఆంధ్రదేశంలో
ఏ ఊరు వెళ్లినా పెద్ద పెద్ద సత్కారాలు –
చెప్పుల దండలతో –

**కథకుడు 1**

మరో మంత్రి వర్గం వచ్చింది; కొత్త మంత్రులు వచ్చారు.

**కథకుడు 2**

వచ్చిన ఆరునెలల్లో ఆ మంత్రి వర్గంలో ఎనిమిది మంది మీద
ప్రకాశంగారు అవినీతి ఆరోపణలు చేశారు –
సాక్ష్యాధారాలతో సహా...

**కథకుడు 1**

వాళ్లూరు కుంటారా? ప్రకాశం గారిమీద
రాబోయే మంత్రివర్గంలో కాబోయే మంత్రిగా
మూడేళ్ల కిందట ఆయన లంచం తీసుకున్నాడని ఆరోపణ.

**కథకుడు 2**

ప్రకాశంగారు ముందు తన మీది అభియోగాన్ని విచారించమన్నారు.
కనీసం ఎవరు అభియోగం చేశారో కాగితం చూపమన్నారు.

**కథకుడు 1**

అధిష్ఠానం నిశ్శబ్దం.
ఒక ప్రముఖ నాయకుడిమీద అభియోగాన్ని
అటూ యిటూ తేలకుండా
నిమ్మకు నీరెత్తినట్లుంటే -
అది రాజకీయంగా చేసేహత్య.

★ ★ ★

**మద్రాసు, 1952**

(ప్రకాశంగారు ఉంటున్న ఇంట్లో ఒక గది).
(ప్రకాశం, గిరి, విశ్వనాథం)

**విశ్వ**

(చేతిలో కాగితాలు చూపుతూ) ఇన్నాళ్ల తరువాత నా ఈ సంజాయిషీ అడగడం?

**గిరి**

ఈ మంత్రుల మీద ప్రకాశంగారు ఆరోపణలు తెచ్చి మూడేళ్ల యింది. ఈ మూడేళ్లలో ఇప్పుడు చేసిన యీ ఆరోపణల ప్రసక్తి రాలేదు.. వీళ్లు నిజంగా ఆరోపణ చేయవలసి వస్తే ప్రకాశం గారు ప్రధానిగా ఉండగానే చెయ్యవలసింది... ఇంత ఆలస్యంగా యీ కాగితం పుట్టిందంటే యిది ఎక్కడ పుట్టిందో తెలుసుకోవాలి.

**ప్రకాశం**

ఈ ఆరోపణలు చేసినవాడు కృష్ణాజిల్లావాడు. నాకు తెలుసు. ఇది అక్కడ పుట్టలేదు.

**గిరి**

అక్కడెందుకు పుడుతుందండీ? ఇది ఢిల్లీలో పుట్టింది.

**ప్రకాశం**

అసలు కాగితం చూస్తే అది ఎవరి యింట్లో పుట్టిందో కూడా చెప్పగలను.

**విశ్వ**

ఆ భయంతోనే కదా, ఆ కాగితాన్ని ససేమిరా యివ్వనంటున్నాడు. శంకర్‌రావు దేవ్...

**ప్రకాశం**

ప్రభుత్వానికి వచ్చిన వాళ్లు లంచగొండులు.. సంస్థ అధిపతులు వాళ్ల కొమ్ము కాసేవాళ్లు. ఇహ దేశం ఏం బాగు పడేను?

**రంగా**

(ఆనందంగా) ప్రకాశంగారూ ! ప్రకాశంగారూ!

**విశ్వ**

ఏమిటయ్యా రంగా? ఏమయింది?

**రంగా**

ఏమయిందేమిటండీ? ఎదుటి గ్రూపువాళ్లు లక్షమంది ఓటర్లను చేర్పించడం ఒట్టిదని, ఒకే వ్యక్తి పాతికవేలు పెట్టి బినామీ పేర్లతో రసీదులు సృష్టించాడని మనం అధిష్ఠానానికి ఫిర్యాదు చేశాం కదా! వాళ్లనుంచి సమాధానం వచ్చింది.. ఆ ఓటర్ల జాబితాను రద్దు చేస్తూ - ఆ పాతిక వేలు కట్టిన వాళ్లని సంజాయిషీ అడిగారు.

**గిరి**

మొత్తానికి ఈ ఒక్కసారైనా హైకమాండు తెలివితో ప్రవర్తించిం దన్నమాట !

**విశ్వ**

కాదండీ ! ఇంత బహిరంగంగా అవినీతి జరిగింది, ఏమీ చెయ్యకపోతే సంస్థ ప్రతిష్ఠకే ముప్పు - అని అట్లా చేశారు.

**ప్రకాశం**

(నెమ్మదిగా వెనుక్కు నడుం వాలుస్తూ) రంగా ! ఇహనీ పదవికి ఎసరేనయ్యా!

**రంగా**

అదేమిటండీ !

**ప్రకాశం**

అవునయ్యా ! వాళ్ల ద్రోహం బట్ట బయలు చెయ్యడానికి మనం పట్టుపడితే, అధికారంలో ఉన్న ఆసాములు ఊరు కుంటారా?

**గిరి**

అవును సుమండీ !.. అయితే రంగా ! వాళ్లకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసిందెవ్వరు?

**రంగా**

రంగా !

**గిరి**

కాదు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు, దాని అధ్యక్షుడు.

**ప్రకాశం**

ఆయన్ని దించేసి మనవాణ్ణే అధ్యక్షుణ్ణి చేస్తే -

**విశ్వ**

ఎల్లుండేకదూ మీటింగు? ఎట్లా కాచుకుంటావో చూసుకో - (వాకిట్లో నుంచి 'పెదనాన్నా' ! అంటూ కేక... "ఎవరూ" అంటూ గిరి వాకిట్లోకి వెడతాడు.. బయట నుంచి సూర్యకుమారి వస్తుంది.. పెట్టె, బేడాతో..)

**సూర్యకుమారి**

పెదనాన్నా ! ఎట్లా వున్నావ్ ?

**ప్రకాశం**

ఎవరు?

**సూర్య**

నేను పెదనాన్నా ! సూర్యను - సూర్యకుమారిని -

**ప్రకాశం**

(ఇంత బాధనీ మరిచిపోయి, చిన్న పిల్లాడయి పోయాడు) అదేమిటే సూర్యం! నువ్వే !! నువ్వే !! ఎప్పుడొచ్చావ్? ఎక్కడ్నుంచి? వచ్చేటప్పుడు ఒక్క టెలిగ్రాం ఇవ్వకూడదూ?.. ఎంత పెద్దదానివయినావే?. ఏమోయ్.. మా సూర్యకుమారి - శ్రీరాములు కూతురు - టంగుటూరి సూర్యకుమారి -

**విశ్వ**

మేం ఎరక్కపోవడం ఏమిటండీ? ఏం అమ్మా ! లండన్ నుంచేనా?

**సూర్య**

అవునండీ.. మొన్న ఢిల్లీవచ్చి అక్కణ్ణుంచి విశాఖపట్నం వెళ్లాను, ఒక స్నేహితురాలి చెల్లెలి పెళ్లిఉంటే - (ప్రకాశంతో) అక్కడ నుంచి సరాసరి నిన్ను చూసిపోదామని వచ్చాను..

**ప్రకాశం**

చూసి - పోదామని వచ్చావన్నమాట !

**సూర్య**

లేదు పెదనాన్నా ! ఒక మూడు నెలలపాటు ఊటీలో ఉందామని - కాస్త గాలి మార్పు -

**ప్రకాశం**

అమ్మా ! స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి అంతా నీ పాటలు వింటూనే కూర్చున్నానమ్మా !

మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి
భరతదేశమే మా దేశం
భారతీయులం మనమంతా -

(అని ఉద్విగ్నుడవుతాడు...)

**సూర్య**

నువ్వేవీ మరిచి పోలేదు పెదనాన్నా !... (దూరంగా నిలబడి తేరిపార చూసి) నువ్వు కిందటిసారికన్నా చాలా చిక్కిపోయావు !... చాలా పెద్దవాడి వయినట్టు కనిపిస్తున్నావ్!

**ప్రకాశం**

ఇంకా నేను చిన్నపిల్లవాడి ననుకుంటున్నావా? 80 ఏళ్లు..

**సూర్య**

No! No! You should be an young man of Eighty.

నీ spirit అదీ !... ఎప్పుడూ అలాగే వుండాలి.

**ప్రకాశం**

వీళ్లు నీకు తెలుసా? (అక్కడి వాళ్లను చూపుతూ అడుగుతాడు)

**సూర్య**

ఆc ! ఈ బాబాయిగారు తెన్నేటి విశ్వనాథంగారు.. ఈయన మన జోగయ్య పెదనాన్నగారి అబ్బాయి కదూ !... పేరు-

**ప్రకాశం**

వరాహగిరి వేంకటగిరి !... ఇప్పుడు పేద్ధ కార్మిక నాయకుడు.

**గిరి**

'పేద్ధ' కాదులే అమ్మా ! పెదనాన్న గారి దగ్గర గుణింతాలు నేర్చుకుంటున్నాను.

**సూర్య**

మీ మినిస్ట్రీలో లేబర్ మినిస్టరు కదూ !.. ఆ మినిస్ట్రీ టేక్ ఓవర్ చేసిననాడు చూశాను.

**ప్రకాశం**

ఈయన రంగాగారు. (అందరికీ నమస్కారాలు పెడుతుంది)

**విశ్వ**

అట్లా వాకిట్లో ఆఫీసుగదిలో ఉంటాం - అమ్మాయితో మాట్లాడుతూ వుండండి.. (అందరూ వెడతారు..)

**ప్రకాశం**

కొత్తదేశం ఎట్లావుందమ్మా?

**సూర్య**

బాగానే వుంది.. వారంలో అయిదు రోజులు ఊపిరాడని పని... మిగిలిన రెండు రోజులూ ఖాళీ.. ఆ రెండు రోజులు గడపడమే కష్టం పెదనాన్నా ! అప్పుడు

మాత్రం.. మన వాళ్లందరూ.. మనమూ, మన మద్రాసు యిల్లూ, నువ్వు కోర్టుకు వెడుతూంటే ప్రతిరోజూ నన్ను ఎదురుగా రమ్మనడం – కేసు గెలిస్తే నువ్వు తెచ్చిపెట్టే జీడిపప్పు పాకం – అన్నీ ! అన్నీ జ్ఞాపకమే నాకు ! Oh! they were wonderful days !

**ప్రకాశం**

అవి అన్నీ ఒకనాటి రోజులమ్మా – ఇప్పుడవేవీ లేవు.

**సూర్య**

నేను వైజాగ్‌లో ఉన్నప్పుడు ఏదో విన్నాను పెదనాన్నా?... నువ్వు మంత్రుల మీద ఏవో అవినీతి ఆరోపణలు చేశావనీ .. మూడేళ్ల తరువాత వాళ్లు నీమీద ఏదో లంచం తీసుకున్నావన్న ఆరోపణ చేశారనీ –

**ప్రకాశం**

(విషాదంగా నవ్వి) రాజకీయాల్లో ఉచ్చం నీచం మరిచి పోయారమ్మా ! ఎంత పెద్దగా అరిస్తే అంత నిజం చెబుతున్నట్టు లెక్క ...

**సూర్య**

నీ మీద లంచం తీసుకున్నావని ఆరోపణా! దేశం కోసం సర్వమూ త్యాగం చేసిన వాడి మీదనా యీ ఆరోపణ! ఒంగోలులో, రాజమండ్రిలో, మదరాసులో – రెండేసి లంకంత ఇళ్లు, ఊటీలో పెద్ద బంగళా – దేశమంతా ఆస్థిపాస్తులు. ఇవన్నీ ఒదలుకున్న నీ మీద – లంచం తీసుకున్నావన్న ఆరోపణా! (దగ్గరకుపోయి) ఈ చిరిగిన చొక్కా – చిరుగు కనిపించకుండా కప్పుకున్న పాతషాలు – చేత చిల్లికానీ లేని నిరంతర కోటీశ్వరుడు మా పెదనాన్న – అని ఎలుగెత్తి అరవాలనిపిస్తుంది ...

**ప్రకాశం**

పిచ్చితల్లీ !... ఇప్పుడు మీ పెదనాన్న ముసలివాడయి పోయాడమ్మా.. ఈనాటి రాజకీయాలకు పనికిరాడు.. నేను గాంధీగారితో పోట్లాడాను. ఆ మనిషితో, ఆ మనిషి యిష్టా నిష్టాలతో పోట్లాడాను.. నేను చెప్పింది రైట్ అని ప్రూవ్ చెయ్యడానికి పోట్లాడాను. మనిషిగా ఆయనతో ఘర్షణ పడ్డా, ఆయన కార్యక్రమాలను అంత మనఃస్ఫూర్తిగానూ అమలు పరిచాను.. మనిషి వేరు, సిద్ధాంతాలు వేరు అన్న విచక్షణలో

బతికాం మేము... కాని, ఇప్పుడో? నీ సిద్ధాంతం నచ్చలేదు అంటే ఆ మనిషినే ద్వేషిస్తున్నట్టు లెఖ్ఖ ! ఇటువంటి కశ్మలంలో బతకలేమమ్మా!

**సూర్య**

పెదనాన్నా !... నువ్వు ఈ వాతావరణం నుంచి బయటకు రావాలి, కనీసం కొన్నాళ్లపాటయినా. నేను ఊటీ వెడుతున్నానుగా !.. ఈ రెండు మూడు నెలలూ నాతో పాటు వచ్చి వుండు.. మళ్లీ మనం వెనకటి జీవితం గడుపుదాం – నీకు ప్రతిరోజు నా పాటలు వినిపిస్తాను.. (దగ్గరకు వచ్చి, లాలనగా) బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్నావు !.. ఇంత నిస్పృహతో నిన్నెప్పుడూ చూడలేదు.. పెదనాన్నా ! నాతో ఊటీ వస్తావుగా!

**ప్రకాశం**

అలాగేనమ్మా ! నాక్కూడా కొన్నాళ్లపాటు యీ వాతావరణం నుంచి బయట పడాలనే వుంది.

**సూర్య**

తప్పకుండా రావాలి సుమా !

**ప్రకాశం**

అట్లాగేనమ్మా ! వస్తానన్నానుగా !

**సూర్య**

మై గుడ్ పెదనాన్న !...

**ప్రకాశం**

అమ్మా ! రాజమండ్రిలో అందరూ కులాసా?

**సూర్య**

అందర్నీ వైజాగ్‌లోనే చూశాను పెదనాన్నా !.. నరసింహారావు అన్నయ్యా కలిశాడు మొన్న వైజాగ్‌లో, అనుకోకుండా. ఆరోజున ఇద్దరం అట్లా అతుక్కు పోయామనుకో, చిన్నప్పటిలా –

**ప్రకాశం**

(ఒక్కక్షణం ఆగి) అన్నం పెట్టని దేశం కోసం కన్న పిల్లల్ని వదులుకున్న దుర్మార్గుడనుకుంటున్నావు కదూ, మీ పెదనాన్న!

**సూర్య**

ఛా, ఛా ! మీ జీవితం సంగతి ఎవరికి తెలియదు పెదనాన్న?

**ప్రకాశం**

నిజమేనమ్మా ! కన్నతండ్రిగా నేను వాళ్లకేం చెయ్యలేక పోయాను.. లక్షలు గడించినా, వాళ్లకొక్కదమ్మిడీ మిగల్చలేదు.

**సూర్య**

పెదనాన్నా ! మీకు యీ దేశమే సర్వస్వం.. ఈ జనమంతా మీ పిల్లలే ! మీరట్లా యిచ్చారు కనకనే మీరంటే వాళ్లకంత భక్తి భావం !

**ప్రకాశం**

(తేరుకుని) అమ్మా ! ప్రయాణం చేసొచ్చావ్ ! మాటల్లో పడి నీ తిండితిప్పలు కనుక్కోలేదు...

**సూర్య**

ఇప్పుడు నాకేం ఆకలిగా లేదు.. పూటుగా టిఫిన్ చేసొచ్చాను.. ఇవ్వాళ మీకు వడ్డిస్తూ, నేనూ మీతో కూచుని భోజనం చేస్తాను – మన రాజమండ్రిలో లాగా–

**ప్రకాశం**

నా భోజనం ఏముందమ్మా ! పచ్చి కూరలు, రెండు పళ్లు. ఒక గ్లాసు మజ్జిగ – అంతే !

**సూర్య**

అదే అయెను... నీతో కూర్చుంటాలే !

**ప్రకాశం**

అయితే నా చెవుల తుప్పు వదిలేటట్టు – ఏదన్నా పాట పాడమ్మా... ఆఁ! ... "మా తెలుగు తల్లికీ" పాడు. ఆ పాట వింటున్నప్పుడల్లా ఒళ్లు గగుర్పొడుస్తుందమ్మా! ఆ పాట విన్నప్పుడల్లా – ఎంత ఆనందం కలుగుతుందో, అంత ఆవేదన కూడా కలుగుతుందమ్మా!.. ఎక్కడో.. మన చుట్టూ జరుగుతున్న అన్యాయమే కనిపిస్తుందమ్మా! .. అప్పటి ఆ వైభవం!! ఇప్పుడో ! చెట్లు కూలుతున్న దృశ్యాలు; గోడలు బీటలు వారుతున్న దృశ్యాలు – ఎన్ని ఆశలతో కోటికోట్ల గళాలు విప్పి పాడుకున్నాం !

ఇప్పుడు !! ఎంతలో ఎంత దిగజారిపోయాం ! "Oh! what a fall my country-men" అని ఏడవాలనిపిస్తుందమ్మా !!

**సూర్య**

(దగ్గరకు పచ్చి బుజంమీద చేయి వేసి) పెద్దనాన్నా... (పాటకూని రాగం తీస్తుంది ముందు. తరువాత)

"మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్న తల్లికి మంగళారతులు"

(ఒక చరణం పాడుతుంది)

**ప్రకాశం**

(కళ్లు మూసుకుని ఆనందిస్తూనే) ఈ పాటల్ని ఇంత హాయిగా పాడుకోవడానికి నేను అడ్డంగా ఉన్నానుట - పట్టాభిగారువాళ్లూ అంటున్నారు!

**సూర్య**

నువ్వు అడ్డంగా ఉన్నావా !

**ప్రకాశం**

అవునట ! ... ఆంధ్రరాష్ట్రం రావడానికీ నేను అడ్డంగా ఉన్నా నట.

**సూర్య**

అదేమిటి?

**ప్రకాశం**

అందరూ చెన్నపట్నం లేకుండా ఆంధ్రరాష్ట్రం తీసుకోమనేవారే! ఈ చెన్నపట్నం ఎవరిదమ్మా? వీళ్లబ్బసొత్తా? 1639లో పూనమల్లి వెంకటాద్రి చెన్నప్ప నాయకుడు యిచ్చిన భూమి మీద తూర్పు ఇండియా కంపెనీ వాళ్లు కట్టిన కోటతో కాదూ చెన్నపట్టణం ప్రారంభం? 300 సం॥ మనదైన ఊరు - మన అజ్ఞానం వల్ల వాళ్లకే కట్టబెట్టే యీ నాయకులనే మనాలి? 2000 కోట్లు - యిక్కడ - ఈ నగరం అన్ని విధాలా పెరగడానికి మదుపు పెట్టిన తెలుగు వాళ్లేం కావాలి? ఇక్కడ మనం పెంచుకున్న తెలుగు సంస్కృతేం కావాలి?..... ఇవి అడిగినందుకు నేను ముసలాణ్ణి - మూర్ఖుణ్ణి - పట్టిన పట్టువిడవని మొండి వాణ్ణి - అవునా?

**సూర్య**

ఊరుకో పెదనాన్నా! చరిత్ర ప్రాధాన్యం తెలియని అనాగరిక దేశంలో ఉన్నాం మనం -

**ప్రకాశం**

చరిత్రని మరచి పోవడమంటే పాలుతాగిన తల్లి రొమ్మునే గుద్దడం కదమ్మా- అందుకే నమ్మా - ఆంధ్రదేశాన్ని మా తెలుగుతల్లి అంటే ప్రాణం లేచివస్తుందమ్మా... పాడమ్మా... పాడు....

(మళ్లీ మరో చరణం పాడుతుంది... తన్మయుడై వింటున్నాడు ప్రకాశం)

**విశ్వనాథం**

(తొందరగా లోపలికి వచ్చి) ప్రకాశంగారూ !... పట్టాభి గారు వచ్చారు.. మిమ్మల్ని చూడాలంటున్నారు...

**ప్రకాశం**

(కళ్లుమూసుకునే) ఎందుకట?

**విశ్వ**

బహుశః ఆంధ్రరాష్ట్రం విషయం మాట్లాడడానికే ననుకుంటా.. ఇవ్వాళ సాయంకాలం మీటింగు ఉందిగదా?... చెన్నపట్నం లేకుండా ఆంధ్రరాష్ట్రానికి మేం ఒప్పుకుంటున్నాం, అని నన్ను సంతకం పెట్టమన్నారు. నేను పెట్టనన్నాను. మిమ్మల్ని కలవ మన్నాను. చాలా కష్టం మీద ఒప్పుకున్నారు.

**ప్రకాశం**

(వ్యంగ్యం ధ్వనించేటట్లు) అట్లాగా ! సరే, రమ్మను.

**సూర్య**

పెద్దనాన్నా ! ఈలోగా నేను స్నానం అదీ చేసి రెడీ అవుతాను.. మనం యిద్దరం కలిసి భోజనం చేద్దాం... ఊటీకి టిక్కెట్లు తెస్తాను.. రెండు మూడు రోజుల్లో బయలుదేరుదాం... నువ్వు తరువాత కాదనగూడదు. తెలిసిందా? (ప్రకాశం సరేనని తల వూపుతాడు.. 'మా తెలుగుతల్లికీ' అన్నపాట ట్యూన్‌ను పాడుతూ లోపలికి వెడుతుంది... సూర్యకూమారి ఊటీకి రమ్మని చెపుతున్నప్పుడు పట్టాభి వస్తాడు... చేతులో కొన్ని కాగితాలతో)

**పట్టాభి**

నమస్కారం.... మీ ఒంట్లో ఎలా వుంది?

**ప్రకాశం**

ఏదో నెట్టు కొస్తున్నాను... పడుతూ లేస్తూ (కూర్చోమని కుర్చీ చూపుతాడు)

**పట్టాభి**

(కూర్చుంటూ) మనవాళ్లు – విశ్వనాథంగారు, గిరిగారు, కాళేశ్వర రావుగారూ – ఆంధ్రరాష్ట్రం విషయంలో మిమ్మల్ని కూడా ఒకసారి కలవమన్నారు.. మంచిదే, ఈ రకంగా ఒకసారి చూసినట్లవుతుందని వచ్చాను. (అని కాగితం చేతి కిస్తాడు)

**ప్రకాశం**

చూడ్డానికి వచ్చారు కాని, నా అభిప్రాయం కోసం కాదన్న మాట!

**పట్టాభి**

మీ అభిప్రాయం మాకు ఇదివరకే తెలుసు.... ఇప్పుడిహ ఆఖరు రిపోర్టు కేంద్రానికి వెడుతోంది కనక మీతో చెప్పిచేస్తే బావుంటుందని –

**ప్రకాశం**

చెన్నపట్నం వాళ్లకిచ్చేసి, మనకివ్వ తేలిన 2000 కోట్ల సంగతి మాట్లాడకుండా మన మానాన మనం నెత్తిన గుడ్డ వేసుకుని స్వంతరాష్ట్రం తెచ్చుకున్నామని చంకలు గుద్దుకోవడానికే నిశ్చయం చేసుకున్నారన్నమాట !

**పట్టాభి**

అట్లా ఒప్పుకోకపోతే, మనకు ఆ కాస్తా కూడా రాదు.

**ప్రకాశం**

అని పెద్దలు మీతో చెప్పారు. అంతేనా?

**పట్టాభి**

చూడండి... రాష్ట్రంలోను, కేంద్రంలోను అందరూ మనిద్దరం కలిసి పనిచెయ్యడం శ్రేయస్కరం అంటున్నారు.

**ప్రకాశం**

ఎవరికట?

**పట్టాభి**

అందరికీ -

**ప్రకాశం**

అది సాధ్యమనే అనుకుంటున్నారా?

**పట్టాభి**

మీరు ఈ కాగితం మీద సంతకం పెట్టి, చెన్నపట్నం అక్కర లేకుండా ఆంధ్రరాష్ట్రానికి ఒప్పుకుంటే - ఇక ఎందుకు సాధ్యం కాదు?

**ప్రకాశం**

అలాగా?

**పట్టాభి**

మనం ఇద్దరం కలిసి పనిచేస్తే - రాష్ట్రంలో మీరూ, కేంద్రంలో నేనూ -

**ప్రకాశం**

మనం కలిసి పని చెయ్యడం కుదరదు.

**పట్టాభి**

ఏం?

**ప్రకాశం**

మన ఆశయాలు, గమ్యాలు కలవవు కనక.

**పట్టాభి**

నేను స్నేహాన్నే కోరుతున్నాను.

**ప్రకాశం**

పులి - మేక స్నేహం కోరినట్టు -

**పట్టాభి**

నన్నూ మీ అంతవాణ్ణి చేస్తున్నారు!

**ప్రకాశం**

ఇటువంటి స్నేహాన్ని ఇవ్వజూపడం తెలుగువాళ్ళకి చేతకాని విద్య.

**పట్టాభి**

నేనూ తెలుగువాణ్ణే !

**ప్రకాశం**

అవును... కాని, కేంద్రం మద్దతు అనే మత్తులో మునిగి వున్నారు మీరు -

**పట్టాభి**

ప్రజలే ప్రకాశం, ప్రకాశమే ప్రజలు అనే మత్తులో మీరున్నట్టు-

**ప్రకాశం**

ఆ మత్తు మిమ్మల్ని ఎంత ఇబ్బంది పెట్టిందో మీరు నన్ను కలుస్తానన్నప్పుడే తెలిసింది... ఆ మత్తు నిజం కనకనే నేను బహిరంగంగా అవినీతి ఆరోపణలు చేశాను.. మీరు - మీరేం చేశారు? లేని పత్రాల్ని ఉన్నాయని బొంకి, లేని మనిషిని ఉన్నాడని సృష్టించి ఒక ప్రధాని అయిన వాడి మీద నింద మోపారు... మరో దేశంలో ప్రజా జీవితంలో ఇన్ని అబద్ధాలు కల్పించి ఒక బాధ్యత గల పౌరుడి మీద అభాండాలు మోపి, అవమానిస్తే 14 ఏళ్లు జైలు శిక్ష.. ఈ దేశంలో? ఈ దేశంలో వాళ్లకి 14 ఏళ్లు ఉన్నతాసనం !!

**పట్టాభి**

(కోపంతో) అవన్నీ నేను కల్పించానంటారా?

**ప్రకాశం**

కొంచెం నెమ్మదిగా ఆలోచించండి... అవినీతిపరుల్ని వెన కేసుకురావడానికి అమాయకుల్ని అవినీతి పరులుగా చిత్రించ నక్కరలేదు.. మనం ఇద్దరం గాంధీగారి అనుయాయులమే! ఆయన మీకు చాలా దగ్గరివాడు. ఆయనకూడా యిటు వంటివి నమ్మడం, ఆయన్ని మీరు నమ్మించడం.... యీ దేశం దౌర్భాగ్యం -

**పట్టాభి**

మీరు మాత్రం - వద్దంటున్నా వినక - శాసనసభలో మన స్వంత పార్టీ వాళ్లమీదనే అవినీతి ఆరోపణలు చెయ్యలేదా?

**ప్రకాశం**

అవికాదని నిరూపించండి... సాక్ష్యాధారాలు అన్నీయిచ్చానే!.. వాటిని పార్టీ కమిటీల్లోనే విచారించమన్నానే ! రచ్చకీడవడం యిష్టం లేదన్నానే ! ఏం? ఎందుకు విచారించలేదు? వాళ్లంతా మీ మనుషులు కనకనా?

**పట్టాభి**

అవును. అక్షరాలా అందుకే.... ఇవాళో రేపో రాష్ట్ర కాంగ్రెసు కూడా రంగా చేతినుంచి ఊడబెరికినప్పుడు మీరు బజార్న పడతారు. అందుకే ఆఖరుసారిగా మీకు యీ సంగతి చెప్పి పోదామని వచ్చాను. మీరు సంతకం పెట్టినా, పెట్టకపోయినా మేం అనుకున్నట్లుగానే రాష్ట్రం వచ్చి తీరుతుంది... అధికారం మాదవుతుంది...

**ప్రకాశం**

చూద్దాం -

**పట్టాభి**

చూడండి ! నేను స్నేహంకోరి వచ్చాను.. మీరు మేం చెప్పిన దానికి ఒప్పుకోవడం లేదు. సరే ! మీ యిష్టం... మీరు ఏ మాత్రం మారరని నాకు తెలుసు. కాని మీ అనుచరులకు తెలియదే ! వాళ్లకీ సంగతి తెలియ చెప్పాలనే వచ్చాను..(లోపల నుంచి సూర్యకుమారి పాడుతున్న 'మా తెలుగు తల్లికీ' వింటాడు.) మీరు ఊటీ వెడతారటగా ! వెళ్లండి.... ఇహ జీవితాంతం అట్లాగే విశ్రాంతి తీసుకోండి... మళ్లీ పార్టీలోకాని, ప్రభుత్వంలో కాని మీరు, మీవాళ్లు తల ఎత్తనంత చావు దెబ్బ కొడుతున్నాం - జాగ్రత్త -

**ప్రకాశం**

పట్టాభీ ! ప్రకాశాన్ని కొట్టడం అంత తేలిక పని అనుకుంటున్నారా? ఈ పార్టీలన్నా, మీరు చేసే పార్టీ రాజకీయాలన్నా నాకు అసహ్యం.. కాని మీ వాళ్లని, వాళ్ల అవినీతి విధానాలని అడ్డుకోవడానికి ఇంకే మార్గమూ లేకపోతే నేను మరో పార్టీ స్థాపిస్తాను - ప్రజల పార్టీని -

**పట్టాభి**

ఆఁ ! ఇప్పుడసలు రంగు బయటపడ్డది. ఇక్కడ ఉండడం కుదరక మీ మంకు పట్టు నెరవేర్చుకోడానికి ఈ ముసలి తనంలో మరో పార్టీ పెడితే, రెంటికీ చెడతారు, జాగ్రత్త.

**ప్రకాశం**

మంచి హెచ్చరికే ! ప్రకాశం బరిలోకి దిగితే సింహమేనని జ్ఞాపకం ఉంచుకోండి.. సింహం ముసలిదయినా రారాజేనని విస్మరించకండి.

**పట్టాభి**

ఇహ మాటలనవసరం - మీ ప్రజలు మీకు పట్టం కడితే - మంచిదే ! కాని ఇవ్వాళ వాళ్లు మా పక్షం - మా రెడ్డి చెప్పినట్టు- డబ్బు పారేస్తే కొనలేనిదేమీ లేదు ఇవ్వాళ -

**ప్రకాశం**

ఒక్క ఆత్మాభిమానం తప్ప - సెలవు (పట్టాభి కోపంగా వెళ్లి పోతాడు. సూర్యకుమారి మెల్లగా వస్తుంది.)

**ప్రకాశం**

(మెల్లగా, నవ్వుతూ) చూశావుగా అమ్మా ! ఇహ జీవితాంతం యీ యుద్ధాన్ని కొనసాగించాల్సిందేనమ్మా !

**సూర్య**

అట్లాగే అనిపిస్తోంది పెదనాన్నా !

**ప్రకాశం**

ఈ పార్టీలు, ఈ రాజకీయాలంటేనే నాకు అసహ్యం.... ప్రజలకు సేవచేయడానికి యీ పార్టీలు ఎందుకమ్మా? కాని అవే రాజ్యం చేస్తున్నాయి. మన పిల్లలు, వాళ్ల పిల్లలు, రాబోయే తరాలు ప్రజా స్వామ్యాన్ని నమ్మి బతకడానికి యీ సంఘర్షణని నేను కొనసాగించవలసిందే నమ్మా !

**సూర్య**

తప్పకుండా పెదనాన్నా - నాకు అలాగే అనిపిస్తోంది.

**ప్రకాశం**

(ఆమె చేయితట్టి) మనం ఊటీ మరోసారి వెడదామే !

★ ★ ★

# పదిహేనవ దృశ్యం

## కథనం

**కథకుడు 1**

నైతిక ప్రమాణాల్ని నిలపడం కోసం
ప్రకాశంగారు ప్రజా పార్టీని స్థాపించారు.

**కథకుడు 2**

అప్పుడు మొదలైంది - ఆంధ్రరాష్ట్ర సాధనకోసం
పొట్టి శ్రీరాములు కఠోర ఉపవాసం.

**కథకుడు 1**

పిట్టలాంటి మనిషి. అయితే యేం?
చేపట్టిన యజ్ఞాన్ని చివరి దాకా నడపగల ఋషి.

**కథకుడు 2**

50వ రోజు చేరుకుంది నిరాహారదీక్ష
నశిస్తోంది తెలుగువాడి వివక్ష.

**కథకుడు 1**

ఋషులు తపస్సు చేస్తే గజగజలాడిందట అవని.
ఈ ఋషి ఉపవాసం చేస్తే కోపంతో కంపించిందాంధ్రావని.

**కథకుడు 2**

పొట్టివారి పట్టుదల.... కేంద్రం నిశ్శబ్దం.
58వ రోజు - డిసెంబరు 16 రాత్రి

ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి అయిన
మహాత్ముడి నిర్యాణం.

**కథకుడు 1**

అంతటా అలుముకున్న విషాదం.
ఆ విషాదాన్ని చీలుస్తూ ఆక్రందన.

**కథకుడు 2**

ఆక్రందన వెంటనే ఉప్పెనగా వచ్చిన ఉక్రోషం.
ఆంధ్ర రాష్ట్రం ఇవ్వడానికి
అప్పుడుకాని ఒప్పుకోలేదు కేంద్రం.

**కథకుడు 1**

ముఖ్యమంత్రి ఎవరో –
అందరి మనసుల్లోనూ ఉన్నది.
తెలుగువాడి వాడి, నాడి
తెలుసుకున్న ప్రకాశం – అన్నది.

★ ★ ★

**కర్నూలు, 1953**

(ఫోకస్‌లో ప్రకాశంగారు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు :
"టంగుటూరి ప్రకాశం అనే నేను భారత రాజ్యాంగం లోని
...... అధికరణం మేరకు ................................"

(ప్రమాణ స్వీకారం చేస్తుండగా నేపథ్యం నుంచి ఈ పద్యం)

చెదరని గుండె, చెప్పినది చేయు ప్రతిజ్ఞ తుపాకి గుండ్లకే
నెదురగు తెంపు, ప్రాణములనే నిడు త్యాగము, తానె దేశమై
యెదిగిన ఎన్నదేండ్ల కురువృద్ధు ప్రకాశముగారు ముఖ్యులై
కుదురగు రాజ్య పాలనము గూర్తురటే అది యెంత భాగ్యమో!

శ్రీ గడియాదం వేంకటశేష శాస్త్రి

★ ★ ★

**(కథకులు ఇద్దరూ ప్రవేశిస్తారు)**

**కథకుడు 1**

ఆంధ్రదేశంలో "కుదరగు రాజ్య పాలనము" ఎట్లా కుదురుతుంది భీమశంకరం?

**కథకుడు 2**

అందుకే - ప్రకాశంగారి ప్రభుత్వం పదమూడు నెలలు మాత్రమే పదవిలో ఉంది.

**కథకుడు 1**

అయితే యేం? ఈ కొద్ది కాలంలోనే ఎన్ని పనులు సాధించింది? ఆంధ్రరాష్ట్ర అవతరణ సమయంలో జైళ్లలో ఉన్న ఖైదీలనందరినీ - సుహృద్భావ పూర్వకంగా - విడుదల చేసింది. 16, 17 మధ్యతరహా ప్రాజెక్టుల్ని చేపట్టింది. నాగార్జునసాగర్‌కు ప్రాథమిక పరిశీలన పూర్తిచేసి, ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసింది.

**కథకుడు 2**

అబ్బా !

**కథకుడు 1**

వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించింది.

**కథకుడు 2**

అసలు విషయం చెప్పవేం? ప్రకాశం బ్యారేజీ కట్టించింది.

విజయవాడలో - కృష్ణానది మీద.

**కథకుడు 1**

ప్రత్యేక హైకోర్టు గుంటూరుకు తరలించింది.

**కథకుడు 2**

మరి ఇంకా ప్రకాశం ప్రభుత్వం మీద 'నో కాన్ఫిడెన్స్ మోషన్' రాలా?

**కథకుడు 1**

రాకేం ? ఒకటి కాదు: రెండు !

**కథకుడు 2**

రెండా? అదేం? ఒకటి చాలదా?

**కథకుడు 1**

మొదటి దాని మీద ఓటింగులో ప్రభుత్వం తన మెజారిటీ నిరూపించుకుంది.

**కథకుడు 2**

మరి రెండోదెందుకు?

**కథకుడు 1**

ఆc! అక్కడే వుంది రాజకీయం ! రెండోది ప్రవేశ పెట్టడానికి ఒప్పుకోవాలా, వద్దా అనీ శాసనసభలోనే మీమాంస.. అది జరుగుతూ వుండగానే నలుగురు సభ్యులు కంచెదాటి అటు వెళ్లారు. ఒక గంటలో మళ్లీ ఓటింగు – ప్రభుత్వం ఓడిపోయింది!

**కథకుడు 2**

ఇది ప్రజాస్వామ్యమే !

**కథకుడు 1**

ఆc ! Indian mark ! ఇంకా మాట్లాడితే ఆంధ్రామార్క్ !!

నైతిక బలం కన్న, సంఖ్యాబలంమీద రాజకీయ నాయకులకు ఎక్కువ శ్రద్ధ ఉండడం వల్ల ప్రకాశం గారి ప్రభుత్వం విభీషణాయిల చేతుల్లో మళ్లీ ఓడిపోయింది.

**కథకుడు 2**

1956. విశాలాంధ్ర ప్రభవించిన వేళ. కలలు ఫలించి ఆంధ్రప్రదేశ్ అవతరించిన వేళ. దీన్ని కాపాడు కోవడం మీ ధర్మం అని సర్వాంధ్ర ప్రజల్నీ, అది మీ బాధ్యత అని నాయకుల్ని ఉద్బోధించాడు ప్రకాశం.

★ ★ ★

**హైదరాబాద్, 1956**

**ప్రకాశం**

(ప్రకాశం గారిమీద ఫోకస్)

కొండా వెంకటప్పయ్య, డాక్టర్ పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, అనంత శయనం అయ్యంగార్, బులుసు సాంబమూర్తి, దుర్గాబాయి

దేశ్‌ముఖ్, కడప కోటిరెడ్డి - ఇలా ఎందరో చేసిన కృషి అసాధారణమైంది. అలాగే బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, రావి నారాయణరెడ్డి, కె.వి. రంగారెడ్డి వంటి మహోదయుల ధైర్య సాహసాలు అనితరసాధ్యాలు. ఇందరి త్యాగ ఫలమే యీ రాష్ట్రం. ఈ విశాల రాష్ట్రం.. ఈ మహాంధ్ర...

ఈ మహదవకాశాన్ని సవ్యంగా ఉపయోగించుకోగలిగితే మనం భారతదేశంలో సగర్వంగా మన అస్తిత్వాన్ని నిరూపించుకోగలం.. లేక అధికారం కోసం రాజకీయం చేసి, మళ్లీ అభిశంసన తీర్మానాలూ, మంత్రి వర్గాలను దించెయ్యడం, సభ్యుల్ని బేర సారాల్లో కొనడం - జరిగితే అది ప్రజాస్వామ్యానికే ముప్పు.

దాన్ని కాపాడ్డం మీ చేతుల్లో ఉంది... ప్రజల చేతుల్లో... నైతిక రాజకీయం ముఖ్యమా, వర్గాలు కట్టి ఏదోవనైనా అధికారం కైవసం చేసుకోవడం ముఖ్యమా? గూడుపుఠాణీలు, కుమ్మక్కులూ ముఖ్యమా, సామాన్యుడి బడుగు జీవితంలో కాస్తంత వెలుగును నింపడం ముఖ్యమా? - ఇప్పుడైనా ఈ విషయం ఆలోచించండి..

(ఫేడ్ అవుట్)

★ ★ ★

# ఉత్తర రంగం

## కథనం

**కథకుడు 1**

శ్వాసించిన ప్రతి నిముషం
సామాన్యుడి బాగోగులు కనుకున్న పెద్దదిక్కు

**కథకుడు 2**

అధికారం బుసలుకొట్టి
ఎదురుతిరిగిన నిజాన్ని కాటేస్తే
ఆ సర్ప దష్టుల్ని ఆదుకున్న ఆపద్బాంధవుడు

**కథకుడు 1**

చేతిలో చిల్లిగవ్వ లేకుండా
నిరంతరం దానాలు చేసి అపర కర్ణుడు

**కథకుడు 2**

ఓ పేదవాడికి జరిగిన అన్యాయాన్ని
వెలికితీసి, న్యాయం చెయ్యాలని
మండు టెండలో ఊరుగాని ఊరుపోయి
వడదెబ్బ తగిలి, పడలిపోయి
ఆసుపత్రిలో అంతమ నిశ్వాసం వదిలాడు -
ఆంధ్రకేసరి ప్రకాశం -
మే 20, 1957 నాడు.

**కథకుడు 1**

ప్రజల కోసం, ప్రజల కోసమే
తన జీవితాన్ని అంకితం చేసిన
నిత్య శ్రామికుడు

**కథకుడు 2**

ప్రతి ఊరూ తిరిగి, ప్రతివాడినీ ఆప్యాయంగా
"ఒరే" అని పిలిచిన తెలుగింటి పెద్ద - అమృతమయమూర్తి

**కథకుడు 1**

తెలుగువాడి గుండెల్లో పదిలంగా ప్రకాశం.

**కథకుడు 2**

తెలుగువాడి గుండెల్లో పదికాలాలపాటు ప్రకాశం.

**కథకుడు 1**

చిరంతన అన్వేషి ప్రకాశం.

**కథకుడు 2**

చిరంజీవి ప్రకాశం.

(ఈ కథనం చివర ప్రకాశం మహా ప్రస్థానం ప్రారంభమవుతుంది. వెనుక నుంచి ఈ పద్యం వినిపిస్తుంది.)

పట్టెడు గుండెతో బ్రిటిషువారి నిరంకుశ దండనీతి న
ట్టిట్లొన రించినట్టి మగ;దెక్కటి వీరుడు; టంగుటూరి స
మ్రాట్టు; స్వరాజ్య శాంతి సమరస్థితియోద్ధ; తెలుంగుభూమికిన్
బెట్టిన శౌర్యభిక్ష మరణింపదు కోటియుగాల కేనియున్...

– శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి

(ఈ పద్యం చదువుతూ ఉండగా
"అసతోమా సద్గమయ" అన్న శ్లోకం....)

★ ★ ★

## || ప్రజానాయకుడు ప్రకాశం ||

(నాటకం)

### ఇరవై ఐదవ ప్రదర్శన లో పాల్గొన్న

### నట బృందం

కథకుడు - 1 .................................................................. మొదలి నాగభూషణ శర్మ

కథకుడు - 2 ........................................................................ భి. పి. ప్రసాద రావు

ప్రకాశం - 3 ............................................................................. గోపరాజు రమణ

ప్రకాశం - 2 ....................................................................... నడిమింటి జగ్గారావు

ప్రకాశం - 1 ...................................................................... కుమారి సురభి లావణ్య

తెన్నేటి విశ్వనాధం / పిళ్ళారిశెట్టి నారాయణరావు ..................................... బి. నారాయణ

టి. వి. రాఘవ రావు / అయినాల తాతయ్య నాయుడు .................... సుసర్ల కామేశ్వర శర్మ

ఎన్. జి. రంగా / బారిష్టర్ స్వామినాధన్ / ఆత్మకూరి గోవిందాచార్యులు ...... మిక్కిలి ఫ్రాన్సిస్

తల్లి ............................................................................ బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి

ఇమ్మానేని హనుమంతరావు నాయుడు .................................. దుగ్గిరాల సోమేశ్వర రావు

లక్ష్మమ్మ ........................................................................ శ్రీమతి సురభి ప్రభావతి

రామయ్య / కొండా వెంకటప్పయ్య ................................................ యం. ఆంజనేయులు

కడప కోటి రెడ్డి / చిలకమర్తి లక్ష్మీనరసింహం ............................ క్రమధాటి వెంకటేశ్వర శర్మ

ఉద్యమ నాయకుడు ............................................................... మోహన్ సేనాపతి

రాజాజీ ......................................................................... ముట్నూరి కామేశ్వర రావు

జడ్జి డెవిస్ .................................................................................. మారుతి కుమార్

కామరాజు నాడార్ / డాక్టర్ ......................................... సి. హెచ్. వి. వి. ఎస్. ఎన్. మూర్తి

పట్టాభి ....................................................................... డా|| జి. బి. రామకిష్ణ శాస్త్రి

కన్నింగ్ హామ్ ........................................................................... అనిల్ కుమార్

పటాలే ............................................................................................ కృష్ణంరాజు

శ్రీరాములు - 2 ........................................................................ సి. హెచ్. నటరాజ్

వి. వి. గిరి ................................................................................. కేతినీడి నటరాజ్

కంచుమర్తి రామచంద్ర రావు ............................................................. పై. మల్లిఖార్జునమ్

సూర్యకుమారి ..................................................................................... సురభి శ్యామల

వెంకట రమణా రావు ........................................................................ సి. హెచ్. వేణుగోపాల్

శ్రీరాములు - 1 ............................................................................ సురభి చిన్మయి చంద్రలేఖ

జానకిరామయ్య ..................................................................................... వి. రఘువీర్

సుబ్బరామయ్య ..................................................................................... వి. శ్రీనివాస్

వార్తహరుడు / విజయరామరాజు ................................................... మల్లాది కుటుంబ శర్మ

## ఉద్యమ కర్తలు

## మోహన్ సేనాపతి

సి. హెచ్. నటరాజ్ – కృష్ణంరాజు - బి. రాజు (డప్పు) - సి. హెచ్. వేణుగోపాల్ – రహమతుల్లా

ధనుష్ - వి. శ్రీనివాస్ - వి. రఘువీర్

## పోలీసులు

పి. సత్యనారాయణ - పి. వేణు - మరి కొందరు

## సాంకేతిక బృందం

లైటింగ్ ............................................................. జాలీ పుత్తుసరి / సురభి నాగేంద్రప్రసాద్

ఆడియో .............................................................................................................. మధు

మేకప్ ........................................................................................ బి. వి. రావు / గోపాలస్వామి

పద్యగానం ...................................................................................... క్రమధాటి వేంకటేశ్వర శర్మ

గేయగానం / నిర్వహణ ................................................................................ మోహన్ సేనాపతి

సెట్స్ ................................................................................................. సురభి నాగేంద్రప్రసాద్

స్టేజ్ మేనేజర్ ......................................................................................... వెంపటి రాధాకృష్ణ

ప్రయోగ నిర్వహణ ........................................................................................... రసరంజని

## రచన / దర్శకత్వం


# మొదలి నాగభూషణ శర్మ

# ప్రజానాయకుడు

స్టేజీ సెట్ వర్కు

సురభి పూర్ణచంద్రశేఖర్. వనారస

సురభి వనారస కిషోర్ బాబు నాయుడు





1.వ. రంగం :- పూర్తి రంగం

శ్రీ ఆంజనేయస్వామి పటం, నాయకుడిగారి ఫోటో - 8 { ఖుర్చీలు, దండ


1. సోఫా
1. టీపాయి
1. ఫోటో స్టాండు

{ బ్లాక్ స్క్రీన్
వైట్ కర్టెన్
విజన్ బ్లాక్ కర్టెన్




3. వ. రంగం:- 3/10 - ఫ్లాట్స్ - 2.నం 1. మంచం
సాంయమిగారి ఇల్లు (బంగళా) 1 బట్టల దండెం [illegible]
[illegible] 2వ. బ్లాక్ కర్టెన్ తొలగింపు [illegible]

2. వ. రంగం ] సదన - 1. బల్ల - 1 చౌకి 4/4
4. వ. రంగం } వెదురుగోడ 2.నం - బట్టల దండెం.
(ప్రకాశం పంతులు గారి ఇల్లు (బంగళా)) (ఇంట్లో భోజన శాల ఉంటుంది.)





5.వ. రంగం:-
6.వ. రంగం:-
నాయుడిగారి యిల్లు

బ్లూఫ్లాట్స్ – 3/10 – 2.NO.
గదుల స్టాండ్ – బట్టలస్టాండ్
1. రౌండ్ టీపాయి. 2.No కుర్చీలు.

2.వ. బ్లాక్ కర్టెన్.

7.వ. రంగం:-
(రం)" రంతులు యిల్లు


బ్రౌన్ ఫ్లాట్స్ 3/10 2.NO
1. టేబుల్. పుస్తకాల ర్యాక్
3.No. కుర్చీలు




దాదాబాయి నవరోజీ కనబడేవుండు
2వ బ్లాక్ పీసేలు - వేశాం. (ఫ్రాండ్ సీను)

8.వ. రంగం:- సెట్‌లో మార్పులేదు
సీన్ సెట్
కుర్చీలు - టేబులు - 5. కుర్చీలు
స్థలం మార్చాలి 1. టేబులు.


2. వ. బ్యాక్ కర్టన్




9. వ. రంగం:- ప్రకాశం పంతులు ఇల్లు

(బ్లాక్ ప్లాట్ 2.నం - పుస్తకాల ర్యాక్-1 కోటుస్టాండ్ కుర్చీలు-3 టేబులు-1
మంచం-1
చిన్న స్టూలు-1

— ః విశ్రాంతి ః —





10. వ. రంగం:— మద్రాసు హైకోర్టు

హైకోర్టు పరదా — 4/4 చౌకీలు 2 నం.

వెనక ఉద్దు తయారు చేసి పెట్టే రెడీగా వుండాలి.

గ్యాలరీ పరదా — ఎదురుగ విల్లువెట్టి - కర్రస్టాండ్-3 [illegible] [illegible]

పానోరమా వైట్ కర్టెన్.





11. వ. చిత్రం:- సముద్రం దగ్గర

గ్లాస్ పర్దా — కుండలు స్టాండ్లు — 3. నం. యిసుక తిన్నెలు — వాటర్ ఎఫెక్ట్.

గ్లాస్ పర్దా ముందు. కోలాటం ద్వారా. స్టేజ్ — అంధకారం. గ్లాస్ వెనక. 2. బ్లాక్ కర్టెన్ ఉంటాయి.


సముద్రం దగ్గర ఉప్పు చేస్తారు. అందరూ ఉప్పు తీసుకొని ముందుకు వస్తారు




12.వ. రంగం:-
బొప్పన హనుమంతరావు ఇల్లు


2. బ్లాక్ కర్టన్ - కుర్చీలు - 6.నం. రౌండ్ టేబుల్-1
పలకల టేబుల్-1

౧




13.వ. రంగం:- ప్రకాశంగారి ఆఫీసు } టేబులు.3 కుర్చీలు.3 రాట్నం-1 పిల్లర్స్ 2

2.వ. బ్లాక్ కర్టన్






15. వ. రంగం:-
ప్రకాశంగారి ఇంట్లో
మద్రాసు

చిన్న ఫ్లాట్స్ 2.NO. కుర్చీలు 5.NO. పెద్దది టేబులు 1NO చిన్న టీపాయి.1
పడక కుర్చీ-1

4 కుర్చీలు folding chairs (Steel)
పెద్ద కుర్చీ wooden

ఈ ఫ్లాట్లు వెనక్కే వేయడం 2.వ.బ్లాక్ కర్టన్ వేయాలి.
ఆ ఫ్లాట్ల వెనక్కే వంక. 2.వ.బ్లాక్ కర్టన్ కట్టాలి.



కుర్చీ.
టేబుల్.




16.వ. రంగం:- స్పీచ్.

సైక్లోరమా. దానికి ముందు ల్యాండ్ పీస్ దానికి ముందు గ్లాస్ కర్టన్
స్పీచ్ జరిగేటప్పుడు. ప్రశాంతంగా ల్యాండ్ మీద వస్తారు.
గ్లాస్ కర్టన్ మీద కెర్లైక్ ఎఫెక్ట్ వేయాలి.
2.బ్లాక్ కర్టన్ వేయాలి.



































# || జాతీయ గీతం ||

రచన

## రబీంద్రనాథ్ ఠాగోర్

జన గణ మన అధినాయక జయహే !

భారత భాగ్య విధాతా !

పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,

ద్రావిడ, ఉత్కళ, వంగ !

వింధ్య, హిమాచల, యమునా, గంగ,

ఉచ్ఛల జలధితరంగ !

తవ శుభనామే జాగే !

తవ శుభ ఆశిష మాగే !

గాహే తవ జయ గాథా!

జనగణ మంగళదాయక జయహే,

భారత భాగ్య విధాతా !

జయహే ! జయహే ! జయహే !

జయ జయ జయ జయహే !

జయ్ హింద్ !